గురువారం
11•1•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 215
• పేజీలు : 16 + (24/20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

కాళేశ్వరం ఓ అద్భుతం

ఇది.. బహుళార్థసాధక ప్రాజెక్టు

- నేను చూసిన అన్ని ప్రాజెక్టుల్లో నంబర్ వన్
- పనుల్లో ఇంత వేగాన్ని ఎక్కడా చూడలేదు
- మీరు, మేము కలిసి శక్తివంచన లేకుండా శ్రమిద్దాం
- ప్రాజెక్టు రూపకర్త కల సాకారం కావాలి
- అన్ని విధాలుగా సహకరించేందుకు సిద్ధం
- రాబోయే వానకాలమే పెద్ద సవాలు
- దాన్ని దృష్టిలోపెట్టుకుని వేగం పెంచాలి
- మీడియాతో కేంద్ర జల సంఘం సీఈ సీకేఎల్ దాస్
- మేడిగడ్డ వద్ద నీటి లభ్యతకు సమస్యే లేదని వ్యాఖ్య
- దేశంలోనే గొప్ప ప్రాజెక్టు: హైడ్రాలజీ డైరెక్టర్ నిత్యానందరాయ్



కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పరిశీలించిన సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజినీర్ సీకేఎల్ దాస్, హైడ్రాలజీ డైరెక్టర్ నిత్యానందరాయ్ బుధవారం జలసౌధలో మీడియాతో మాట్లాడుతున్న దృశ్యం

> నేను దేశంలో ఎన్నో ప్రాజెక్టులను పరిశీలించాను. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు వాటన్నింటికంటే భిన్నమైంది.. విశిష్టమైనది. స్ట్రక్చర్ల నిర్మాణపరంగా, విజన్ పరంగా, దీనిద్వారా కలిగే ప్రయోజనాలు, పనులు జరుగుతున్న తీరు.. ఇప్పటివరకు నేనైతే ఎక్కడా ఇంత అద్భుతమైన పనితీరును గమనించలేదు.
>
> - సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజినీర్ సీకేఎల్ దాస్

నిర్మాణానికి అంగీకారం తెలిపిన కేంద్ర జలసంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ప్రతినిధులు ప్రశంసల వర్షం కురిపించారు. ఈ ప్రాజెక్టు ఒక అద్భుతమని, దేశ చరిత్రలోనే విభిన్నమైనదని కొనియాడారు. రెండ్రోజులపాటు కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పరిశీలించిన సీడబ్ల్యూసీ ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లోని జలసౌధలో మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తంచేశారు. కాళేశ్వరం బహుళార్థసాధక ప్రాజెక్టు అని సీడబ్ల్యూసీ ప్రాజెక్టుల అప్రైజల్ విభాగం చీఫ్ ఇంజినీర్ సీకేఎల్ దాస్ అన్నారు. నిర్మాణం, ప్రణాళిక, పనులవేగం, పనులు జరుగుతున్న తీరు తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చే వానకాలం నాటికి మొదటి మైలురాయి దాటుతుందని ఆయన ఆకాంక్షించారు. ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం బృందం తరఫున సీకేఎల్ దాస్ వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే.. 'కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు తెలంగాణ ప్రజలందరికీ కాళేశ్వరముక్తేశ్వర స్వామి ఆశీస్సులుండాలని కోరుకుంటున్నాను. ఇంతకు ముందు మిషన్ కాకతీయ పనులను చూడటానికి కూడా నేను ఇక్కడికి వచ్చాను. కాళేశ్వరం ప్రాజెక్టు 13 కన్నా ఎక్కువ ప్రాజెక్టులతో అనుసంధానమైనది. ఇది చాలా పెద్ద లక్ష్యం. ఈ ప్రాజెక్టు దిగ్విజయంగా పూర్తికావాలని మనస్ఫూర్తిగా దేవుడిని ప్రార్థిస్తున్నాను. కాళేశ్వరం అద్భుతమైన ప్రాజెక్టు. మే లేదా జూన్‌లో మిడ్‌మానేరుకు కాళేశ్వరం జలాలు అందాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 18 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలి. అందుకు అందరూ కలిసికట్టుగా మరింత కృషి చేసి ఆ పని పూర్తిచేయాలి. మేడిగడ్డ దగ్గర పని వేగవంతం చేయాలి.

కాళేశ్వరం ప్రాజెక్టును అంగీకరిస్తున్నాం

కేంద్ర జల సంఘం పనులను పరిశీలిస్తున్నది. పర్యవేక్షిస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టును అంగీకరిస్తున్నాం. ప్రాజెక్టుకు కావల్సిన సహకారం కోసం మా తరఫున అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. కాళేశ్వరానికి ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. నేను రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లో ఎన్నో ప్రాజెక్టులను పరిశీలించాను. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు వాటన్నింటికంటే భిన్నమైంది. విశిష్టమైనది. స్ట్రక్చర్ల నిర్మాణ పరంగా, విజన్‌పరంగా, దీనిద్వారా కలిగే ప్రయోజనాలు, పనులు జరుగుతున్న తీరు.. ఇప్పటివరకు

మిగతా 2వ పేజీలో

ఎఫ్‌డీఐ నిబంధనల సడలింపు

రిటైల్ వాణిజ్యం, నిర్మాణ రంగాల్లో

గేట్లు బార్లా

వందశాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి

ఎయిరిండియాలో 49శాతం ప్రైవేటుకు.. విద్యుత్‌రంగంలోనూ సడలింపులు

కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ, జనవరి 10:

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలను కేంద్ర ప్రభుత్వం మరింత సడలించింది. సింగిల్ బ్రాండ్ రిటైల్, నిర్మాణ రంగాల్లో వందశాతం ఎఫ్‌డీఐలను అనుమతిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఎయిర్‌ఇండియాను గట్టెక్కించే దిశగా.. విదేశీ విమానయాన సంస్థలు 49శాతం వరకు పెట్టుబడులు పెట్టేందుకూ ద్వారాలు తెరిచింది. ఈ మేరకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం.. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానాన్ని పునర్వ్యవస్థీకరించడం ద్వారా పలు సవరణలకు ఆమోదం తెలిపింది. ఎఫ్‌డీఐల సరళీకరణ ద్వారా విదేశీ పెట్టుబడిదారులకు స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు క్యాబినెట్ అభిప్రాయపడింది. తద్వారా దేశంలో సులభ వాణిజ్యవిధానాన్ని పెంపొందించినట్లవుతుందని పేర్కొన్నది. ప్రస్తుత నిబంధనల ప్రకారం సింగిల్‌బ్రాండ్ రిటైల్ రంగంలో 49శాతం వరకు ఎఫ్‌డీఐలకు అనుమతి ఉంది. అంతకన్నా ఎక్కువ పెట్టుబడుల కోసం ప్రభుత్వ అనుమతి పొందవలసి ఉండేది. కేంద్ర మంత్రివర్గం బుధవారం ఈ నిబంధనను సమీక్షించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్ని మరింత ఎక్కువగా ఆకర్షించాలన్న లక్ష్యంతో ఎఫ్‌డీఐ పరిమితిని వందశాతానికి పెంచినట్లు తెలుస్తున్నది. బడ్జెట్ సమీపిస్తున్న తరుణంలో విదేశీ పెట్టుబడుల సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంకావడం గమనార్హం. 'సింగిల్‌బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్(ఎస్‌బీఆర్‌టీ)లో వందశాతం విదేశీ పెట్టుబడులకు అనుమతించాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీని ద్వారా పెట్టుబడుల వృద్ధితోపాటు ఆదాయం, ఉపాధి కల్పన గణనీయంగా పెరుగనుంది' అని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండానే నేరుగా

మిగతా 5వ పేజీలో

చెక్కుల రూపంలోనే!

పంట పెట్టుబడి పంపిణీపై ఎక్కువ మంది రైతుల అభిప్రాయం ఇది

ఆధార్ నంబర్‌తో అకౌంట్ పే చెక్కులు ■ సాగుకు అనుకూలమైన భూములకే సాయం

పెద్ద రైతులకు పెట్టుబడి సాయంపై సమాలోచన

సమస్యాత్మక ప్రాంతాల్లో పోస్టాఫీసుల ద్వారా ■ త్వరలో సీఎం కేసీఆర్‌కు ఉపసంఘం నివేదిక

వారంలో మార్గదర్శకాల జారీకి అవకాశం



సాగుకు పెట్టుబడిపై బుధవారం సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో పాల్గొన్న మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జగదీశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రైతులకు సాగుకు పెట్టుబడిని చెక్కుల రూపంలో అందించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఈ ఏడాది వానకాలం సీజన్ నుంచి రైతులకు ఇద్దామనుకున్న సహకారాన్ని ఏ రూపంలో అందిస్తే ఎక్కువ ప్రయోజనకరం అనే అంశంపై క్షేత్రస్థాయిలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా 551 మండలాల్లోని 624 గ్రామాల్లో 62,677 మంది రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయాధికారులు రైతుల వద్ద నుంచి సేకరించిన అభిప్రాయంపై బుధవారం సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం చర్చించింది. అభిప్రాయ సేకరణ సందర్భంగా ఎక్కువమంది రైతులు పంట పెట్టుబడిని చెక్కుల రూపంలోనే ఇవ్వాలని కోరారు. దాంతో చెక్కుల రూపంలోనే సాయం అందించాలన్న తుది

మిగతా 6వ పేజీలో

సివిల్ సర్వీసెస్ మెయిన్స్ ఫలితాల వెల్లడి

యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల రోల్‌నంబర్లు

తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది ఇంటర్వ్యూకు ఎంపిక

వచ్చే నెల 19 నుంచి ఇంటర్వ్యూలు

5



రాష్ట్ర పథకాలకు సహకరించండి

కేంద్రమంత్రి సురేశ్ ప్రభుకు మంత్రి కేటీఆర్ వినతి

2

స్కూళ్లకు సంక్రాంతి సెలవులు

రేపటి నుంచి

13 నుంచి 15 వరకు జూనియర్ కళాశాలలకు

2

ఏపీకి 60, తెలంగాణకు 50 టీఎంసీలు

అధిక వినియోగంపై తర్వాత చర్చిద్దామన్న కృష్ణా త్రిసభ్య కమిటీ

2

ఉరే సరైనది

మరణశిక్షపై సుప్రీంకు కేంద్రం నివేదన

5

కొత్త రైల్వే ప్రాజెక్టులు

పూర్తిచేయండి



- స్టేషన్లలో సౌకర్యాలు, ప్లాట్ ఫారంల ఆధునీకరణ.. కొత్త లైన్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి
- దక్షిణ మధ్య రైల్వే జీఎంకు రాష్ట్ర ఎంపీల విజ్ఞప్తి
- ఆదాయం ఇస్తున్నా వసతులు కల్పించరా?
- సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంపై అసహనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు నత్తనడుకన సాగుతున్నాయని, చేపట్టిన డబ్లింగ్, ట్రిబ్లింగ్ పనులు వేగంగా సాగడంలేదని తెలంగాణ ఎంపీలు విమర్శించారు. 'పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కంటే తక్కువ నిడివిలో రైల్వేలైన్లు ఉన్నాయి. ఆదాయం మాత్రం తెలంగాణ నుంచి గణనీయంగా వస్తున్నది. అయినప్పటికీ రైల్వే అధికారులు చేపట్టిన ప్రాజెక్టులను సైతం త్వరగా పూర్తి చేయలేకపోతున్నారు. ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యం, ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించడంలో ఆనాసక్తి ప్రదర్శిస్తున్నారు' అని దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌పై ఒకింత అసహనం వ్యక్తంచేశారు. పనుల్లో వేగం పెంచాలని డిమాండ్ చేశారు. బుధవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని సమస్యలపై తెలంగాణ ఎంపీలతో జీఎం వినోద్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎంపీలు సమస్యలను ప్రస్తావిస్తూ, వాటిని త్వరగా పరిష్కరించాలని కోరారు.

మనోహరాబాద్- కొత్తపల్లి రైల్వేలైన్ పూర్తిచేయాలి : ఎంపీ వినోద్‌కుమార్

తెలంగాణలో తక్కువ మొత్తంలో రైల్వే లైన్ ఉందని, ఉన్న వాటికి సరైన వసతులు కల్పించడం, కొత్త ప్రాజెక్టులను చేపట్టడంలో రైల్వేశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఎంపీ బీ వినోద్‌కుమార్ ఆరోపించారు. 150 కిలోమీటర్ల నిడివిలో మనోహరాబాద్- కొత్తపల్లి లేన్ వయా గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్-కొత్తపల్లి వరకు రూ.1160 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం పూర్తికావాల్సి ఉందని చెప్పారు. దీనిని వేగంగా పూర్తిచేయాలని కోరారు. ఈ ప్రాజెక్టులో తెలంగాణ ప్రభుత్వ భాగస్వామంవల్ల పనులు వేగంగా

మిగతా 6వ పేజీలో

464 ఎంపీఎస్‌వో పోస్టుల భర్తీ

మార్చిలో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్: మంత్రి ఈటల

3



జోయాలుక్కాస్‌లో

ఐటీ సోదాలు

3

జూలై నాటికి పీఆర్సీ!



- ప్రకటించేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- తెలంగాణ తొలి పీఆర్సీ కోసం ఉద్యోగుల ఎదురుచూపు
- సకాలంలో ప్రకటించని పక్షంలో ఐఆర్‌కోసం విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు దాదాపు ఐదులక్షల మంది ఎదురుచూస్తున్న పీఆర్సీని ప్రకటించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. జూలై నాటికి దీనిని ప్రకటించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. 2015లో ప్రకటించిన పీఆర్సీని ఉమ్మడి రాష్ట్రంలోని పదో పీఆర్సీగా ఉద్యోగసంఘాలు భావిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం ప్రకటించేది తెలంగాణలో తొలి పీఆర్సీ అవుతుందని తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం జూలై -2018 నాటికి ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాల్సి ఉంటుంది. అన్ని క్యాటగిరీలకు వేతనాలను సవరించాల్సిఉంది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వ పీఆర్సీ కమిషన్‌ను నియమించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి కోసం అన్వేషిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ సకాలంలో వేతన సవరణ సంఘం సిఫారసులు అమలు చేయని పక్షంలో ఉద్యోగులు ఇంటీరియం రిలీఫ్ (ఐఆర్) కోసం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో వేతన సవరణల కోసం ఉద్యోగసంఘాలతో ప్రభుత్వాలు బేరసారాలు జరిపేవి. ఇవి బ్రహ్మానందరెడ్డి నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి వరకు కొనసాగాయి. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తొలిసారి 2015 ఫిబ్రవరిలో ఉద్యోగసంఘాల జేఏసీ నాయకులతో చర్చలు జరుపుతూనే 10 నిమిషాల్లో 43 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి యావత్తు తెలంగాణ ఉద్యోగులను ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఈ సంప్రదాయం తెలంగాణ రాష్ట్రంలో తొలి పీఆర్సీ విషయంలోనూ జరుగుతుందని తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ధరల సూచీ ప్రకారం కేంద్రప్రభుత్వం ఇచ్చిన వేతన సవరణ సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఫిట్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తామని ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆధార్ లేనివారికి ప్రభుత్వ పథకాలు అందేదెలా?

- ఇల్లు లేనివారు ఆధార్‌కార్డు ఎట్లా పొందగలరు?
- అటువంటివారున్నా ఉనికిలో లేనట్టేనా?
- అదనపు సొలిసిటర్ జనరల్‌ను ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- పట్టణాల్లో నైట్‌షెల్టర్ల నిర్మాణ పర్యవేక్షణకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కమిటీలు వేయాలని నిర్ణయం



న్యూఢిల్లీ, జనవరి 10: 'ఇల్లు, శాశ్వత చిరునామా లేని వారు ఆధార్‌కార్డులు ఎలా పొందగలరు? అటువంటి వారికి ప్రభుత్వ సామాజిక సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలా అందుతాయి?' అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అన్నిసేవలకు ఆధార్ తప్పకుండా ఉండాల్సిందేనని ప్రభుత్వం అంటే.. దేశంలో లక్షల సంఖ్యలో ఉన్న ఇల్లు లేనివారు ప్రభుత్వ సామాజిక సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందకుండానే ఉంటారని వ్యాఖ్యానించింది. ఆధార్ దరఖాస్తుదారులకు శాశ్వత చిరునామా తప్పకుండా ఉండాల్సిందేనని అంటే ప్రభుత్వం దృష్టిలో ఆధార్‌కార్డు లేనివారున్నా ఉనికిలో లేనట్టేనని భావించాలని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం కోసం ప్రభుత్వ సూచనలు పొందడానికి తనకు కొంత సమయం ఇవ్వాలని అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) తుషార్ మెహతా కోర్టును కోరారు. ఉత్తరప్రదేశ్‌లో నైట్ షెల్టర్ల కొరత, వాటి నిర్మాణం కోసం మంజూరైన నిధుల దుర్వినియోగానికి సంబంధించి దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా బుధవారం ఆధార్ కార్డుల సమస్య మరోసారి సుప్రీంకోర్టు పరిశీలనకు వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత చిరునామా గలవారు పట్టణాలకువలసపోయిన తరువాత ఇల్లులేని వారు అవుతున్నారు. అటువంటి వారు అసలైన నివాస స్థలం నుంచి ఆధార్ కార్డు పొందాక ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందవచ్చునని ఏఎస్‌జీ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఇండ్లులేనివారు లక్షలమంది ఉన్నారని, వారు తలదాచుకోవడానికి తగినన్ని నైట్‌షెల్టర్లు కూడా లేవని వ్యాజ్యంపై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. నైట్‌షెల్టర్ల నిర్మాణాన్ని పర్యవేక్షించడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. యూపీలో ఆధార్ లేనివారికి నైట్ షెల్టర్లలో ఆశ్రయం ఇవ్వడం లేదన్న విషయం సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. దీంతో జస్టిస్ మదన్ బీ లోకూర్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం, యూపీ ప్రధాన కార్యదర్శికి సమన్లు జారీ చేసి రప్పించి ప్రశ్నించింది. ఆ సంగతి నిజమేనని ఆయన చెప్పారు. ధర్మాసనం కేసును రెండువారాలు వాయిదా వేసింది.

రేపటి నుంచి పాఠశాలలకు
సంక్రాంతి సెలవులు
జూ.కళాశాలలకు 13 నుంచి 15 వరకు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బడులకు ఈ నెల 12 నుంచి 16 వరకు ఐదురోజులు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నది. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు 13 నుంచి 15 వరకు సెలవులను ప్రకటిస్తున్నట్టు ఇంటర్‌బోర్డు తెలిపింది.

వచ్చే ఏడాది గురుకులాల్లో ఇంటర్ తరగతులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలోని 34 గురుకుల విద్యాలయాల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ తరగతులను ప్రారంభించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. 2018-19 విద్యాసంవత్సరం నుంచి ప్రవేశాలను ప్రారంభించనున్నారు. దీనివల్ల గురుకులాల్లో పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఇంటర్ వరకు హాస్టల్‌లో ఉండి చదువుకొనే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. గురుకులాల్లో జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

జూనియర్ కాలేజీల అఫిలియేషన్ గడువు పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కాలేజీల ఆన్‌లైన్ అఫిలియేషన్ దరఖాస్తుల గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి ఏ అశోక్ బుధవారం తెలిపారు. ఈ నెల 31 తర్వాత రూ.వెయ్యి ఆలస్య రుసుంతో ఫిబ్రవరి 7 వరకు, రూ.3వేలతో ఫిబ్రవరి 14 వరకు, రూ.5వేలతో ఫిబ్రవరి 21 వరకు, రూ.10వేలతో ఫిబ్రవరి 28 వరకు, రూ.15వేలతో మార్చి 7 వరకు, రూ.20 వేల ఆలస్య రుసుంతో మార్చి 14 వరకు గడువు విధించామన్నారు.

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఎంపికపై కమిటీ

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్, సభ్యుల ఎంపిక కోసం ఓ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసిం ది. కమిటీ అధ్యక్షుడిగా మహిళా అభివృద్ధి, శిశు, వయోవృద్ధుల సంక్షేమశాఖమంత్రి వ్యవహరించనున్నారు. సభ్యులుగా తెలంగాణ, ఏపీ ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, అసెంబ్లీ స్పీకర్ నామినేట్‌చేసిన వ్యక్తి ఉండనున్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 5.55 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, దశమి రాత్రి 7.13 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: స్వాతి తె. 5.02 వరకు తదుపరి విశాఖ, అమృత ఘడియలు: రాత్రి 9.46 నుంచి 11.22 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.47 నుంచి 3.10 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 2.59 నుంచి సాయంత్రం 4.27 వరకు, వర్జ్యం: ఉదయం 11.12 నుంచి మధ్యాహ్నం 12.48 వరకు.

లోకం పోకడ



ట్రైలర్ వేసి ఊరించాడు... సిన్మా ఎప్పుడంటే తెలియదంటాడేంది?



బుధవారం ఢిల్లీలో విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఆధ్వర్యంలో జరిగిన భారత సంతతి పార్లమెంటేరియన్ల సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఎన్నారై సంక్షేమశాఖ మంత్రి కే తారకరామారావు

నకిలీ గల్ఫ్‌ఏజెంట్లపై కఠిన చర్యలు

- పీఐవో పార్లమెంటేరియన్ల సమావేశంలో మంత్రి కేటీఆర్
- పశ్చిమాసియా దేశాల్లో తెలుగు అధికారులను నియమించాలని విదేశాంగమంత్రికి వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గల్ఫ్‌లోని కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని రాష్ట్ర ఎన్నారై సంక్షేమ శాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో బుధవారం జరిగిన భారత సంతతి (పీఐఓ) పార్లమెంటేరియన్ల సమావేశంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే పాస్‌పోర్ట్‌ల వెరిఫికేషన్, ఇమ్మిగ్రేషన్ విషయాల్లో తెలంగాణ ప్రభుత్వం ముందువరుసలో ఉన్నదని విదేశాంగమంత్రి ప్రశంసించారని తెలిపారు. నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై తెలంగాణ ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తున్నదని, అనేక నకిలీ ఏజెంట్ల దుకాణాలు మూసేసి, వారిపై విదేశాంగ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసినట్టు కేటీఆర్ తెలిపారు. పశ్చిమాసియా దేశాలలో చాలా మంది తెలుగువారు ఉన్నారని, అక్కడి రాయబార కార్యాలయాల్లో నలుగురు చొప్పున తెలుగు ట్రాన్స్‌లేటర్లను నియమిస్తే బాగుంటుందని సమావేశంలో సూచించామన్నారు. ముందుగా పీఐవో సమావేశంలో సుష్మాస్వరాజ్ మాట్లాడుతూ విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామని మోసంచేసేవారిపై రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వీసా లేకుండా విదేశాలకు వెళ్లేవారి పాస్‌పోర్ట్ రద్దు

యెమెన్, లిబియాలాంటి దేశాల్లో చిక్కుకున్న భారతీయులను వెనుకకు తీసుకువచ్చినా, ఆ దేశాల్లో దక్కే వేతనాలను చూసి మళ్లీ బాధితులు పర్యాటక, ఆరోగ్య వీసాలపై వెళ్తున్నారని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఇకపై సరైన వీసా లేకుండా పలుమార్లు విదేశాలకు వెళ్లేవారి పాస్‌పోర్ట్‌ను ఐదేండ్లు రద్దు చేయాలన్న కేంద్ర నిర్ణయాన్ని సమర్థిస్తున్నట్టు తెలిపారు. తెలుగువారికి ఉపయోగపడేలా హైదరాబాద్‌లో విదేశీభవన్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఇందుకు స్థలం కేటాయించనున్నట్టు వివరించారు.

రాష్ట్ర పథకాలకు సహకరించండి

కేంద్రమంత్రి సురేశ్ ప్రభుకు మంత్రి కేటీఆర్ వినతి



ఢిల్లీలోని ఉద్యోగభవన్‌లో కేంద్రమంత్రి సురేశ్ ప్రభుతో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాల అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి సురేశ్ ప్రభును రాష్ట్ర ఎన్‌ఆర్‌ఐ సంక్షేమం, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు కోరారు. బుధవారం ఢిల్లీలోని ఉద్యోగ్‌భవన్‌లో సురేశ్ ప్రభును మంత్రి కేటీఆర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశం అనంతరం మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలసీ అయిన టీఎస్‌ఐపాస్ పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకట్టుకుంటున్నదని తెలిపారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' (సులభవాణిజ్య విధానం)లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని చెప్పారు.

దావోస్ సభకు ఆహ్వానం

అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా దూసుకుపోతున్న తెలంగాణ ప్రభుత్వం తరఫున దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ సదస్సుకు రావాలని కేంద్రమంత్రి సురేశ్ ప్రభు కోరారని, ఆయన ఆహ్వానాన్ని అంగీకరించి తప్పక దావోస్ వస్తానని చెప్పానని మంత్రి కేటీఆర్ వివరించారు. హైదరాబాద్ ఫార్మాసిటీ ఏర్పాటుకు కావాల్సిన నిమ్జ్ స్టేటస్, ఫార్మాసిటీ అభివృద్ధికి రూ.1500 కోట్లు ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరామని వివరించారు. నిజామాబాద్ స్పైస్‌పార్క్‌కు రూ.20 కోట్లను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రకటించిందని, ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్టు చెప్పారు. హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-రామగుండం, హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్లకు కావాల్సిన నిధులను కేటాయించాలని సురేష్ ప్రభుకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో మెగా లెదర్ పార్క్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించారని, తెలంగాణ రాష్ట్రానికి కూడా మెగా లెదర్‌పార్క్ మంజూరు చేయాలని కోరామని చెప్పారు. ఫిబ్రవరి 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే బయోఆసియా సదస్సుకు గౌరవ అతిథిగా కేంద్రమంత్రి సురేశ్ ప్రభుని ఆహ్వానించామని, అందుకు ఆయన అంగీకరించారని మంత్రి కేటీఆర్ వెల్లడించారు.

అన్ని విధాలా అటవీ సహకారం

- కాళేశ్వరం నిర్మాణంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉంది
- అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా
- ప్రాజెక్టును సందర్శించిన రాష్ట్ర ఐఎఫ్ఎస్ అధికారుల బృందం



పెద్దపల్లి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు ఆరో ప్యాకేజీ అండర్ టన్నెల్ పనుల గురించి అటవీశాఖ ఉన్నతాధికారుల బృందానికి వివరిస్తున్న సీఈ వెంకటేశ్వర్లు

ధర్మారం, కాళేశ్వరం: 'కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అద్భుతమైనది.. ఈ ప్రాజెక్టు పూర్తయ్యాక తెలంగాణ స్వరూపమే మారుతుంది' అని ఐఎఫ్ఎస్ అధికారుల బృందం కితాబిచ్చింది. బుధవారం రాష్ట్రంలోని సుమారు 60 మంది అధికారులతో కూడిన బృందం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని కన్నెపల్లి పంప్‌హౌస్, అన్నారం బరాజ్, అటవీ ప్రాంతంలో నిర్మాణమవుతున్న కాలువ పనులను సందర్శించింది. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఇరిగేషన్ డీఈ ప్రకాశ్ వారికి మ్యాప్ ద్వారా పంప్‌హౌస్ నమూనాను వివరించారు. ఆ తరువాత అన్నారం బరాజ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి బృందం రాత్రి సమయానికి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం శివారులో కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అనుబంధంగా జరుగుతున్న 6వ ప్యాకేజీ అండర్ టన్నెల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అద్భుతమైందని అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ భూములను సస్యశ్యామలం చేయాలనే దృక్పథంతో అతిపెద్ద ప్రాజెక్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, దీనికి తమశాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. దీనికి ఇంత పెద్దప్రాజెక్ట్ నిర్మాణంలో అటవీశాఖ భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి 6వ ప్యాకేజీ అండర్ టన్నెల్ పనుల పురోగతిని ప్రాజెక్ట్ ఈఈ నూనె శ్రీధర్ ఐఎఫ్ఎస్ అధికారుల బృందానికి తెలియజేశారు. ప్రాజెక్ట్ స్వరూపాన్ని సీఈ నల్లా వెంకటేశ్వర్లు వివరించారు. మేడిగడ్డ వద్ద ప్రాజెక్ట్, ఇతర ప్రాంతాల్లో నిర్మిస్తున్న బరాజ్‌లకు నీటి లభ్యత గురించి వివరించారు. ఆరునెలల్లో ప్రాజెక్టుకు ఒక రూపం వస్తుందని, ఇందుకోసం రేయింబవళ్లు పనులు జరుగుతున్నాయని సీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మరోసారి ఇక్కడకువచ్చి నీటి అద్భుతాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు రఘువీర్, శోభ, పృథ్వీరాజ్, ఎంజే అక్బర్, రవికిరణ్, ఆర్ శివ, మునీంద్ర, డోబ్రియల్, స్వర్గం శ్రీనివాస్, తిరుపతయ్య, కృష్ణమాచారి, వజ్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాగింగ్ పద్ధతిలో చెట్ల తరలింపు

కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద ముంపునకు గురవుతున్న అటవీభూములోని చెట్లను నరుకకుండా శాస్త్రీయ పద్ధతిలో ఎలా తొలిగించాలనే దానిపై పరిశీలన జరుపుతున్నామని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఇందులోభాగంగానే బుధవారం అటవీశాఖ అధికారుల బృందం ప్రాజెక్టును సందర్శించినట్టు తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి అటవీశాఖ దాదాపు 3,200 హెక్టార్ల భూమిని సాగునీటి శాఖకు బదిలీచేసింది. ఆ మేరకు రెవెన్యూశాఖ అటవీశాఖకు ప్రత్యామ్నాయ భూమి కేటాయించింది. 12లక్షల చెట్లను 'లాగింగ్' పద్ధతిలో తొలిగించనున్నట్టు అధికారులు వెల్లడించారు. అనంతరం వాటిని ప్రత్యామ్నాయంగా కేటాయించిన భూమిలో నాటడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

కాళేశ్వరం ఓ అద్భుతం

మొదటిపేజీ తరువాయి...

నేనైతే ఎక్కడా ఇంత అద్భుతమైన పనితీరును గమనించలేదు. దీన్ని నిర్ణీత సమయంలో పూర్తిచేసేందుకు మీరు, మేము కలిసి మరింత పట్టుదలగా పనిచేయాలి. తద్వారా తప్పులకు ఆస్కారం లేకుండా సమయం వృథాకాకుండా చూసుకోగలుగుతాం. ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేసేందుకు రాష్ట్రం తరఫున మీరు, కేంద్రం తరఫున మేము శక్తివంచన లేకుండా కృషిచేద్దాం. ప్రాజెక్టు రూపకర్త కల సాకారానికి సమిష్టిగా కృషిచేయాలి.

రానున్న వర్షాకాలమే సవాలు

మనకు ఎదురుకానున్న మొదటి సవాలు రానున్న వర్షాకాలమే. వర్షాకాలంలో పనిగంటలు, నిర్మాణపనుల్లో హెచ్చుతగ్గులతో ప్రభావం పడుతుంది. దాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఇప్పుడు పనులు జరుగుతున్న తీరు బాగున్నా, ఇంకా వేగం పెంచాలి. పనులను వేగవంతం చేయడంపై దృష్టిపెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై కృతనిశ్చయంతో ఉన్నదని పనుల తీరును గమనిస్తే తెలుస్తున్నది. రోజువారీగా జరుగుతున్న కాంక్రీట్ పనులు, బ్యాలెన్స్ వర్క్‌పై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వాటిని పూర్తిచేసేందుకు ఉత్సాహంగా, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారు. ఇదే నేను గమనించింది. దీనిని కొనసాగించాలని కోరుతున్నాను.

కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎన్నో సానుకూల అంశాలు

కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయి. సవాళ్లు కూడా ఉన్నాయి. కాళేశ్వరం జలాశయం.. ఒక సమగ్ర ప్రాజెక్టు. దీని ద్వారా ఈ ప్రాజెక్టులో భాగంకాని ప్రాజెక్టులకు కూడా ఆయకట్టు స్థిరీకరణతోపాటు అనేక ప్రయోజనాలు అందనున్నాయి. ఇప్పటికే రాష్ట్రానికి సేవలందిస్తున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు స్థిరీకరణకు కాళేశ్వరం తోడ్పడనుంది. దీని అనుసంధానంపై మంత్రి హరీశ్‌రావు ప్రణాళికలు సిద్ధంచేశారు. అది తర్వాతి దశలో కార్యరూపం దాల్చనుంది. ఎగువ, మధ్య, దిగువ మానేరు ప్రాజెక్టులకు కూడా కాల్వల నిర్మాణం, ఇతర ఏర్పాట్లు ఉన్నాయి. కానీ నీటి లభ్యతే సమస్యగా ఉన్నది. అదే కాళేశ్వరం ప్రాజెక్టు షెడ్యూలు మేరకు పూర్తయి, నీటిని అందిస్తే మానేరుకు ఆ సమస్య తీరిపోయినట్టే. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా అందుబాటులోకి వస్తే ప్రాజెక్టు ఆయకట్టుతో పాటు అనేక జలాశయాల పరిధిలోని రైతులకు ఉపయోగకరం. ఇన్ని ప్రత్యేకతలు ఉన్నాయి కాబట్టే కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టమైనది, ప్రత్యేకమైనది. ఇది బహుళార్థ సాధక ప్రాజెక్టు. నీటి సమతుల్యత, సమర్థ జల వినియోగం, విస్తృత ప్రయోజనాలు, ఇప్పటికే ఉన్న ఆయకట్టు స్థిరీకరణ, కొత్త ఆయకట్టు రూపకల్పన, ఇలా చెప్పుకొంటూపోతే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఇక సవాళ్ల విషయానికొస్తే అంచనా వ్యయంలోనే, నిర్ణీత కాలంలో ప్రాజెక్టును పూర్తిచేయడం కీలకమైనది' అన్నారు.



బుధవారం జలసౌధలో మీడియాతో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజినీర్ సీకేఎల్ దాస్. చిత్రంలో హైడ్రాలజీ డైరెక్టర్ నిత్యానందరాయ్, కేంద్ర జల సంఘం డైరెక్టర్లు ముఖర్జీ, రాజీవ్‌కుమార్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తదితరులు

దేశంలోనే గొప్ప ప్రాజెక్టు: నిత్యానందరాయ్, సీడబ్ల్యూసీ హైడ్రాలజీ డైరెక్టర్

కాళేశ్వరం ప్రాజెక్టులో గోదావరి నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఎంచుకున్న మేడిగడ్డ వద్ద నీటి లభ్యతకు ఎలాంటి సమస్య లేదు. ప్రాజెక్టు నిర్మాణ పనులు చాలా సంతృప్తికరంగా జరుగుతున్నాయి. దేశంలోనే ఒక గొప్ప ప్రాజెక్టు తెలంగాణలో నిర్మితమవుతున్నది. అన్ని విషయాలు సంతృప్తి కలిగేలా ఉన్నాయి.

నిర్ణీత గడువులో పూర్తి చేయాలన్నదే లక్ష్యం

కాళేశ్వరం ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తిచేసేందుకు ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నామని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్కే జోషి చెప్పారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రాజెక్టు పనులను నిరంతరం సమీక్షిస్తున్నారని తెలిపారు. నిర్ణీత గడువులోపే ప్రాజెక్టును పూర్తిచేసి రికార్డును నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టంచేశారు. మీడియా సమావేశంలో కేంద్ర జల సంఘం డైరెక్టర్లు ముఖర్జీ, రాజీవ్ కుమార్, కాళేశ్వరం సీఈలు వెంకటేశ్వర్లు, హరిరామ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల కేటాయింపు

తెలంగాణకు 50 టీఎంసీలు, ఏపీకి 60

- 133 టీఎంసీల లభ్యత జలాల వినియోగంపై కృష్ణాబోర్డు భేటీలో నిర్ణయం
- ఏపీ అధిక నీటి వినియోగం, సాగర్ కాల్వ నష్టాలపై తర్వాత చర్చిద్దామన్న బోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణానదీ జలాల్లో ఇప్పుడు లభ్యమయ్యే నీటి వినియోగంపై కృష్ణానదీ యాజమాన్యబోర్డు ఇరు తెలుగు రాష్ట్రాలకు స్పష్టతనిచ్చింది. ప్రస్తుతం లభించే 133.75 టీఎంసీల జలాల్లో తెలంగాణ 50 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 60 టీఎంసీలు వినియోగించుకోవచ్చునని తెలిపింది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో ఉన్న నీటి కేటాయింపులపై చర్చించేందుకు బుధవారం జలసౌధలో కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ భేటీ అయింది. బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం, ఏపీ, తెలంగాణ ఈఎన్సీలు వెంకటేశ్వర్‌రావు, మురళీధర్, ఏపీ సీఈలు నారాయణరెడ్డి, జబ్బార్, సాగర్ సీఈ సునీల్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్లు నరహరి, రామచంద్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వచ్చే జూన్ వరకు నీటి అవసరాలపై చర్చించారు. రెండు ప్రాజెక్టుల్లో చేరిన నీటిలో 357.25 టీఎంసీలను ఇప్పటివరకు రెండు రాష్ట్రాలు వినియోగించుకున్నాయి. ఒప్పందం ప్రకారం తెలంగాణ, ఏపీలు 34-66 శాతం నిష్పత్తిలో నీటిని వినియోగించుకోవాలి. అంటే తెలంగాణ 121.46 టీఎంసీలు, ఏపీ 235.79 టీఎంసీలు వాడుకోవాలి. అయితే ఏపీ నిర్ణీత కోటా కంటె దాదాపు 19 టీఎంసీలు ఎక్కువగా 254.57 టీఎంసీల వినియోగించుకున్నదని బోర్డు దృష్టికి తెలంగాణ తీసుకెళ్లింది. ఆ మేరకు నీటిని సర్దుబాటు చేసి తమకు కేటాయింపులు పెంచాలని కోరింది. దీనిపై బోర్డు స్పందిస్తూ.. ఇప్పుడున్న 133.75 టీఎంసీల నీటిలో వాటాల ప్రకారం తెలంగాణకు 60.33 టీఎంసీలు, ఏపీకి 73.42 టీఎంసీలు దక్కుతాయని, ఇందులో తెలంగాణ 50 టీఎంసీ, ఏపీ 60 టీఎంసీలు తమ అవసరాలకు తగ్గట్లు వాడుకోవాలని సూచించింది. ఈ వినియోగం పూర్తయ్యాక అధిక వినియోగంపై తేల్చుదామని తెలిపింది. దీనికి ఇరు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి. ఇక శ్రీశైలం నుంచి తక్షణమే సాగర్‌కు నీటిని విడుదల చేయాలని తెలంగాణ కోరగా, అందుకు ఏపీ నిరాకరించింది. చెన్నై తాగునీటి అవసరాల నిమిత్తం శ్రీశైలం నుంచి 5 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉందని, అది పూర్తయిన వెంటనే సాగర్‌కు నీటి విడుదల చేస్తామని తెలిపింది. పోతిరెడ్డిపాడు కింద కూడా ఏపీ అధికంగా నీటిని వినియోగించుకుంటున్నదని, అందుకే 25 టీఎంసీల మేర లెక్కల్లో తేడా వస్తున్నదని బోర్డుకు తెలంగాణ తెలుపగా.. ఈ విషయాన్ని పరిశీలిస్తున్న తమ కమిటీ నివేదిక మరోవారంలో వస్తుందని, నివేదిక అందిన వెంటనే దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని బోర్డు వివరించింది. సాగర్ ఎడమ కాల్వ కింద ఏపీ అవసరాల కోసం కేటాయించిన నీటికి, వినియోగిస్తున్న నీటికి తేడా ఉంటున్నదని, ఆ లోటును పూడ్చాలని ఏపీ కోరింది. సరఫరా నష్టాల వల్ల అలా జరుగుతున్నదని తెలంగాణ బదులిచ్చింది. ఈ అంశంపై కూడా కమిటీ నియమించినందున విషయం తేలాక దీనిపై ఒక నిర్ణయానికి రావాలని సూచించింది. ఇక టెలీమెట్రీ వ్యవస్థలను త్వరగా కార్యాచరణలోకి తీసుకురావాలని ఇరు రాష్ట్రాలు కోరగా.బోర్డు అంగీకరించింది.

'కావ్యహిత'కు గడువు ఫిబ్రవరి 10

బ్రాహ్మణ రచయితల అముద్రిత రచనలకు ఆర్థికసాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కావ్యహిత' పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 10 వరకు గడువు ఇస్తూ బుధవారం పత్రికా ప్రకటన విడుదలచేశారు. బ్రాహ్మణ రచయితలు తమ అముద్రిత రచనలను ముద్రించుకునేందుకు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఈ పథకాన్ని రూపొందించింది. పుస్తకాల ముద్రణకు గరిష్ఠంగా రూ.50వేల వరకు ఆర్థికసాయం అందిస్తారు. రచయితలు పూర్తి చిరునామాతో, హామీపత్రం జతచేసి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. రచనల ఎంపికకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్టు సంక్షేమ పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంద్రమోహన్ తెలిపారు. అముద్రిత రచనల రాతప్రతులకు సంబంధించిన పది కాపీలను పరిషత్‌కు అందజేయాలని.. కమిటీ సిఫారసుల ప్రకారం ఆర్థికసాయం అందిస్తామన్నారు. మహిళలకు, నిరుపేద బ్రాహ్మణులకు ప్రాధాన్యం ఉంటుందని వివరించారు.

జోయాలుక్కాస్‌పై ఐటీ దాడులు

- దేశవ్యాప్తంగా 133 జ్యూవెలరీ షాపుల్లో సోదాలు
- హైదరాబాద్, నిజామాబాద్‌లోనూ తనిఖీలు!



బుధవారం బెంగళూరులోని జోయాలుక్కాస్ షోరూంలో తనిఖీలు చేస్తున్న ఐటీ అధికారులు

న్యూఢిల్లీ, జనవరి 10: పన్ను ఎగవేత ఆరోపణలపై దేశవ్యాప్తంగా ఏకకాలంలో 133 చోట్ల జోయాలుక్కాస్‌తోపాటు మరోసంస్థకు చెందిన నగలు, ఆభరణాల దుకాణాల్లో బుధవారం ఆదాయం పన్నుశాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. కేరళకు చెందిన ఆభరణాల విక్రయ సంస్థ జోయాలుక్కాస్‌తోపాటు మరోసంస్థపై దాడులు చేపట్టారు. చెన్నై, త్రిసూర్ నగరాలతో పాటు కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, హర్యానా రాష్ట్రాల్లో 133 దుకాణాల్లో తనిఖీలు చేశారు. తెలంగాణలోని హైదరాబాద్, నిజామాబాద్ నగరాల్లో కూడా తనిఖీలు జరిగినట్టు తెలుస్తున్నది. అయితే, పలుచోట్ల నిర్వాహకులు దుకాణాలను బలవంతంగా మూసేందుకు యత్నించారు. మరికొన్నిచోట్ల జోయాలుక్కాస్ ఉద్యోగులు ఐటీ అధికారులను అనుమతించలేదు. పోలీసుల సాయంతో ఎనిమిదిమంది సభ్యులతో కూడిన ఒక్కో ఐటీ బృందం సోదాలు చేపట్టింది. పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో భారీగా పన్ను ఎగవేశారనే ఆరోపణలపై ఈ రెండు సంస్థల్లో సోదాలు జరిపినట్టు ఐటీ వర్గాలు తెలిపాయి. భారీగా నగదు డిపాజిట్లు, బంగారు, డైమండ్, ఆభరణాలు పెద్దఎత్తున విక్రయాలు జరిపినట్టు వారి ఖాతాల్లో ఐటీ అధికారులు గుర్తించారు. 100 ఐటీ బృందాలు, పోలీసులు బలగాలతో చెన్నై ఐటీ విభాగం నేతృత్వంలో దేశవ్యాప్తంగా సోదాలు జరిపినట్టు అధికారవర్గాలు తెలిపాయి. జోయాలుక్కాస్‌కు బ్రిటన్, భారత్, బహ్రెయిన్, ఒమన్, ఖతార్‌సహా 11 దేశాల్లో 130 శాఖలు ఉన్నాయి. జోయాలుక్కాస్ గ్రూప్‌నకు జాన్‌పాల్ జోయాలుక్కాస్(29) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా 2015లో నియమితులయ్యారు. 1981-1997 మధ్య జన్మించిన టాప్‌టెన్ సంపన్నుల్లో జోయాలుక్కాస్ ఎనిమిదో స్థానంలో ఉన్నారు.

కేంద్ర ఎక్సైజ్ సుంకం ఎగవేసిన జోయాలుక్కాస్ !

పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో 2016 నవంబర్ నుంచి ఏప్రిల్ 2017 మధ్య జోయాలుక్కాస్ సంస్థ రూ.1,500 కోట్ల విలువైన 5.7 టన్నుల బంగారు ఆభరణాలను విక్రయించింది. ఈ విషయాన్ని గత ఏడాది ఖాతా పుస్తకాల్లో సంస్థ వెల్లడించింది. కానీ, 2016 ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి వచ్చిన తప్పనిసరిగా కట్టాల్సిన ఒకశాతం కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని సంస్థ చెల్లించలేదు. ఎగవేసిన సుంకం రూ.16 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీచేసినట్టు సెంట్రల్ ఎక్సైజ్ ఇంటెలిజెన్స్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

కరంటుపై చర్చకు సిద్ధమే

- స్థలం, సమయం మీరే నిర్ణయించండి
- ఆరోపణలు నిరూపించలేకపోతే అబిడ్స్‌లో ముక్కు నేలకు రాయాలి
- మా లెక్కలు తప్పని తేలితే మేం రాస్తాం
- కాంగ్రెస్ సవాల్‌ను స్వీకరించిన ఎంపీ బాల్క సుమన్
- రేవంత్‌రెడ్డి కాదు.. రవ్వంతరెడ్డి
- కరంటు ఉత్పత్తి, సరఫరా సామర్థ్యం లెక్కలు వివరించిన సుమన్



బుధవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ బాల్క సుమన్. చిత్రంలో మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్ ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'కాంగ్రెస్ పార్టీ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నది. గాంధీభవన్ గోబెల్స్ భవన్‌గా మారింది. గాంధీభవన్ వేదికగా రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నాం. విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై మేం చెప్పిన లెక్కలు తప్పైతే మేం ముక్కు నేలకురాస్తాం. మీరు చేసిన ఆరోపణలు నిరూపించలేకపోతే అబిడ్స్ సెంటర్‌లో ముక్కు నేలకు రాయాలి. బహిరంగ చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. మా పార్టీ తరఫున నేను ఒక్కడిని చాలు.. నాతోపాటు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భానుప్రసాద్ వస్తారు. మీ పార్టీ నుంచి ఉత్తమ్‌ను తీసుకొచ్చినా ఫర్వాలేదు. మీ సీఎల్పీనేత జానారెడ్డి, ఉపనేత జీవన్‌రెడ్డి అయినా సరే. లేదా మీ హయాంలో విద్యుత్ మంత్రిగా పనిచేసిన షబ్బీర్‌అలీ లేదా మంత్రులుగా పనిచేసిన వాళ్లంతా వచ్చినా సరే.. సమయం, స్థలం మీరే చెప్పండి.. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లేదా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ అయినా అమరవీరుల స్థూపం వద్ద అయినా ఫర్వాలేదు. చర్చిద్దాం.. రండి' అని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డికి టీఆర్‌ఎస్ ఎంపీ బాల్క సుమన్ ప్రతి సవాల్ విసిరారు. బుధవారం టీఆర్‌ఎస్ ఎల్పీ కార్యాలయంలో మండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌తో కలిసి బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర రైతులకు 24 గంటల కరంటు ఇస్తే కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోవడం లేదని విమర్శించారు. చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచినప్పుడే సీఎం కేసీఆర్ నిరసన వ్యక్తం చేశారని, తెలంగాణ ఏర్పడితే ఈ కరంటు బాధలు పోతాయని ఆనాడే తమ నాయకుడు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మొదలు పెట్టారని వివరించారు. రేవంత్‌రెడ్డి చేసే ఆరోపణల్లో ప్రతి విషయానికి తాము వివరంగా లెక్కలు చెప్తామని, ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు.

తెలంగాణ అంధకారం అవుతుందన్నారు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తే తెలంగాణ అంధకారం అవుతుందని కిరణ్‌కుమార్‌రెడ్డి కట్టె పట్టుకొని చూపించారని, ఆనాడు తెలంగాణ మంత్రులెవరూ నోరుమెదపని విషయాన్ని ఎంపీ బాల్క సుమన్ గుర్తుచేశారు. 'ఉమ్మడి రాష్ట్రంలో మీ పార్టీ అధికారంలో ఉండగా వారానికి రెండురోజులు పరిశ్రమలకు పవర్ హాలీడే ఇచ్చింది నిజం కాదా? కరంటు కోసం పారిశ్రామికవేత్తలు ఇందిరాపార్కు వద్ద ధర్నాలు చేసింది నిజం కాదా? హైదరాబాద్‌లో నాలుగు గంటల కరంటు కోతలు, గ్రామాల్లో పగటిపూట కరంటు కోత, రెండు షిఫ్టుల్లో వ్యవసాయానికి 7 గంటల విద్యుత్.. లోవోల్టేజీ సమస్యలు వాస్తవం కాదా'? అని ప్రశ్నించారు. ఒక్క యూనిట్ కూడా అదనపు విద్యుత్‌ను ఉత్పత్తిచేయలేదని రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలకు లెక్కలతో సహా సమాధానం ఇచ్చారు. రేవంత్‌రెడ్డి రవ్వంతరెడ్డేనని ఎద్దేవాచేశారు. రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 నాటికి రాష్ట్రంలో 6,574 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉంటే ఈ మూడున్నరేండ్లలో 14,913.36 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని సాధించినట్టు వివరించారు. రాష్ట్రం ఏర్పడే నాటికి 16,379 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఉంటే ఈ మూడున్నరేండ్లలో 4511 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు పెంచామని, ఇప్పుడు 20,890 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఉన్నాయని తెలిపారు. 'భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకుండా మీరు కేసులు వేసింది నిజం కాదా? కేసుల వల్ల భద్రాద్రి 18 నెలలు ఆగింది. 38 నెలల్లో కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించడం అతి పెద్ద రికార్డు. 38 నెలలకాలంలో దేశంలో ఏ థర్మల్ ప్రాజెక్టు పూర్తి కాలేదు' అని తెలిపారు.

కర్ణాటక, పంజాబ్‌లో ఎందుకివ్వడం లేదు: పల్లా

మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇచ్చి కాంగ్రెస్ నేతలకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చామని.. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రేపు నీళ్లలో ముంచుతామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, పంజాబ్‌లో ఆరేడు గంటలకు మించి విద్యుత్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం అద్భుత ప్రాజెక్టు అని కేంద్ర జలసంఘం అభినందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఉదయ్‌పూర్‌లో జరిగిన విప్‌ల సమావేశంలో 24 గంటల విద్యుత్ ఇస్తున్న తెలంగాణ రాష్ట్రానికి అభినందనలు తెలిపారన్నారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు తెలంగాణలో ఉంటూ పక్క రాష్ట్రం భజన చేస్తున్నారని మండిపడ్డారు.



గణాంకశాఖలో టెస్సా డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఈటల, బేవరేజెస్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి

త్వరలో గణాంకశాఖలో 464 పోస్టుల భర్తీ

టెస్సా డైరీ ఆవిష్కరణ సభలో మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 464 మండల ప్రణాళిక గణాంకాధికారుల (ఎంపీఎస్‌వో) పోస్టుల భర్తీకి మార్చి నెలలో టీఎస్‌పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ జారీచేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. ఈ పోస్టుల భర్తీకి సీఎం కేసీఆర్ అంగీకరించారని తెలిపారు. బుధవారం తెలంగాణ డైరెక్టరేట్ ఆఫ్ ఎకానమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో ఎకానమిక్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్స్ అసోసియేషన్ (టెస్సా) డైరీని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఎకానమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌శాఖఅందిస్తున్న నివేదికలు ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. జీఎస్డీపీని రూపొందించడంలో గణాంకశాఖ శాస్త్రీయమైన నివేదికలను అందిస్తున్నదని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ జీ దేవీప్రసాద్ చెప్పారు. మండల కేంద్రాల్లో గణాంకాల సేకరణకు అధికారి లేక.. ఇతర అధికారులపై పనిభారం పడుతున్నదని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తెలిపారు. రెండేండ్ల సర్వీసు పూర్తిచేసిన అధికారులకు పదోన్నతి కల్పించాలని టెస్సా రాష్ట్ర అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, అసోసియేట్ ప్రెసిడెంట్ నరసింహాచారి, సంఘం నాయకులు సురభి వెంకటేశ్ కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ జీ శ్రీనివాస్‌రెడ్డి, సలహాదారు సలీమొద్దీన్, సీఈవో షేక్‌మీరా, టీఎన్జీవో ప్రధానకార్యదర్శి మామిండ్ల రాజేందర్, అసోసియేట్ ప్రెసిడెంట్ మందాడి ఉపేందర్, నాయకులు హరికృష్ణ, రాంభిక్షం, వేణుమాధవ్, అన్నిజిల్లాల టెస్సా అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్‌పై చర్చకు మేం సిద్ధం

- కాంగ్రెస్ నాయకులు అనవసర విమర్శలు మానాలి
- ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



బుధవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి రాష్ట్రంలో ఆర్డీఎస్‌కు అన్యాయం జరిగిందని, దీనిపై కాంగ్రెస్ నాయకులతో చర్చకు తాము సిద్ధమని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్డీఎస్‌కు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ నీటి కేటాయింపుల ఒప్పందాలన్నీ కాంగ్రెస్ హయాంలో తుంగలో కలిశాయని మండిపడ్డారు. నిద్రాహారాలు మాని మంత్రి హరీశ్‌రావు ప్రాజెక్టుల కోసం పనిచేస్తుంటే.. ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌కు తగదని అన్నారు. బ్రిటిష్ పాలనలో ఉన్నపుడు హైదరాబాద్ రాష్ట్రంలో అప్పటి ఒప్పందాలను చూస్తే మనకు 39.9 టీఎంసీల నీళ్లవాటా ఉన్నట్టు కృష్ణా ట్రిబ్యునల్ తీర్మానం చేసి కేటాయించిందని గుర్తుచేశారు. ఎంతోకాలంగా నడిగడ్డ ప్రజలు తుమ్మిళ్ల సాగునీటి పథకం కొరకు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టుపై సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని చెప్పారు. మొన్న రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు తుమ్మిళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, ఆ సందర్భంగా నడిగడ్డ రైతులు ఆనందం వ్యక్తంచేశారని గుర్తుచేశారు. ప్రజల్లో వ్యక్తమవుతున్న సంతోషాన్ని జీర్ణించుకోలేక ఎమ్మెల్యే సంపత్ అనవసర విమర్శలకు దిగుతున్నారని దుయ్యబట్టారు. ఆయనను చేర్చుకోవాల్సిన అవసరం టీఆర్‌ఎస్ పార్టీకి లేదని చెప్పారు. తుమ్మిళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి హరీశ్‌రావుకు శతకోటి దండాలు అంటూ ఆయనను సన్మానించిన ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆ మరుసటి రోజే విమర్శలకు దిగడం ఏమిటని బాలరాజు ప్రశ్నించారు.

'సైబర్' ముప్పుపై మరింత దృష్టి

సమన్వయంతో పనిచేద్దాం • డీజీపీల సదస్సులో నిర్ణయించినట్టు డీజీపీ మహేందర్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భవిష్యత్తులో సైబర్ నేరాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నందున వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కేసుల పరిశోధనలో రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయడం వంటి అంశాలపై అన్నిరాష్ట్రాల డీజీపీల సదస్సులో ప్రధానంగా చర్చ జరిగినట్టు డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని టెకాన్పూర్ బీఎస్‌ఎఫ్ అకాడమీలో మూడురోజులపాటు జరిగిన సదస్సు అంశాలను బుధవారం ఆయన మీడియాకు వెల్లడించారు. సైబర్ సెక్యూరిటీ, వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టిపెట్టడం, నేర పరిశోధనలో సాంకేతికత వినియోగం తదితర అంశాలపై లోతుగా చర్చించినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా నేరాల కట్టడి, నేర పరిశోధనలో తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ అనుసరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానానికి ప్రశంసలు లభించినట్టు డీజీపీ వివరించారు.

బడ్జెట్‌పై ఉన్నతాధికారులతో సమీక్ష

వచ్చే బడ్జెట్‌లో పోలీస్‌శాఖకు అవసరమైన నిధులపై డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి కసరత్తు ప్రారంభించారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా సాంకేతిక వినియోగాన్ని మరింత పెంచడం, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయనున్న నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర పోలీస్‌శాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నది. అవసరమైన నిధులను కోరేందుకు చేయాల్సిన ప్రతిపాదనలపై బుధవారం పోలీస్ కేంద్ర కార్యాలయంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అంశాలవారీగా కేటాయింపులపై తుది కసరత్తు చేసిన అనంతరం పోలీస్ శాఖ ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించనున్నట్టు డీజీపీ తెలిపారు.

కానిస్టేబుళ్ల పదోన్నతులకు చర్యలు తీసుకోండి

డీజీపీకి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కానిస్టేబుళ్ల పదోన్నతులకు చర్యలు తీసుకోవాలని డీజీపీ మహేందర్‌రెడ్డిని రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం కోరింది. ఈమేరకు పోలీస్ కేంద్ర కార్యాలయంలో డీజీపీని కలిసి వినతిపత్రం అందించినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై గోపిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోన్నతుల కోసం ఎన్నో ఏండ్లుగా కానిస్టేబుళ్లు ఎదురు చూస్తున్నారని.. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని డీజీపీని కోరినట్టు తెలిపారు. దీనికి డీజీపీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, సైబరాబాద్ అధ్యక్షుడు భద్రారెడ్డి ఉన్నారు.



2019 లోక్‌సభ ఎన్నికల కోసం యూపీలో ఇప్పటి నుంచే పనిచేస్తున్నాం. ప్రతి సీటు కోసం ప్రత్యేక ప్రణాళికతో కదులుతున్నాం. ఇప్పుడే పొత్తుల గురించి ఆలోచించటం లేదు. మాకున్న క్షేత్రస్థాయి కార్యకర్తల బలాన్ని కూడ గడుతున్నాం. బీజేపీకి ఇక్కడి నుంచే పతన రుచి చూపిస్తాం.

అఖిలేశ్ యాదవ్, యూపీ మాజీ ముఖ్యమంత్రి

బీజేపీ మహమ్మద్ ప్రవక్తపై అభ్యంతరకరంగా రాతలతో పుస్తకాలు ముద్రించి స్కూల్ పిల్లల బ్యాగుల్లో పెడుతున్నది. తద్వారా మతపరమైన ఉద్రిక్తతలను సృష్టించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నది. మేం దీన్ని సీరియస్‌గా తీసుకుని దోషులను అరెస్టు చేశాం. ఇలాంటి తప్పుడు రాతలు, ప్రచారాలతో ప్రభావితం కావొద్దని ప్రజలను కోరుతున్నాం.

మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి



చరిత్రలో నేడు




1779

మణిపూర్ రాజుగా కిరీటాన్ని ధరించిన చింగ్ థాంగ్ ఖోంబా.

1922

మొదటిసారి మధుమేహానికి ఇన్సులిన్‌ను వినియోగించిన లియోనార్డ్ థాంప్సన్.





1938

మొదటిసారి టెలిగ్రాఫ్ ద్వారా సమాచారాన్ని పంపిన శామ్యూల్ మోర్స్.

అభివృద్ధి పేరుతో జరుగుతున్న జాతీయ, రాష్ట్ర రహదారుల కారణంగా వన్య ప్రాణులకు తీవ్ర హాని జరుగుతున్నది. రక్షిత అభయారణ్యాలుగా గుర్తించిన అడవుల మధ్య నుంచి రహదారులను యథేచ్ఛగా నిర్మించటం మూలంగా వన్యప్రాణులు రోడ్డు ప్రమాదాలతో చనిపోతున్నాయి. దీనికి తాజా ఉదాహరణగా మహారాష్ట్రలోని అభయారణ్యంలో అరుదైన పులి దుర్మరణాన్ని చెప్పకోవచ్చు. ఎంతో వ్యయప్రయాసలకోర్చి సంరక్షిస్తున్న వన్య ప్రాణులు వాహనాల కారణంగా చనిపోతున్నాయి. వాజపేయి కాలంలోని వైల్డ్‌లైఫ్ యాక్షన్ ప్లాన్ 2002-16ను ఇకనైనా ఆచరించాలి. అభివృద్ధి పేరుతో వన్యప్రాణుల ప్రాణాలకు ముప్పు కలిగించవద్దు.

ది హిందూ

గతంలో ఇచ్చిన తీర్పులకు సడలింపులు, సవరణలు చేస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ముందుకురావటం ఉదారవాదుల వాదనలకు విజయం చేకూరినట్లయ్యింది. గతంలో జాతీయగీతం, స్వలింగ సంపర్కుల విషయాల్లో ఇచ్చిన తీర్పులకు సవరణలు చేసి సుప్రీంకోర్టు ఆధునికతకు, ప్రజాలోచనా రీతులకు పెద్దపీట వేసింది. జాతీయగీతంలో ఎవరినీ నిర్బంధం చేయలేమని, స్వలింగ సంపర్కం విషయంలో కూడా మోరల్ పోలిసింగ్‌తో వ్యక్తుల వ్యక్తిగత జీవితాలను నిర్దేశించలేమని తేల్చిచెప్పటం ద్వారా ఆధునిక జీవన సరళికి సానుకూలతను తెలిపింది. సుప్రీం తీర్పులు ఆహ్వానించదగినవి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

ఆధార్ గోప్యత

పౌరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతున్నదనే ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో, ఆధార్ సంస్థ (యూఐడీఏఐ) కొత్త భద్రతా విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇటీవలే ఒక పాత్రికేయురాలు ఆధార్ వివరాలను సులభంగా పొందవచ్చునని ఆధారాలతో వెల్లడించడం సంచలనం రేపింది. ఈలోగా ఆర్బీఐ అధ్యయనంలో కూడా ఆధార్ వివరాలు వ్యాపారులకు, శత్రువర్గాలకు చేరవచ్చుననే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో యూఐడీఏఐ ప్రవేశపెడుతున్న కొత్త విధానం ప్రాధాన్యం సంతరించుకున్నది. కొత్త విధానం ప్రకారం– పౌరుడి వ్యక్తిగత వివరాలకు రెండురకాలుగా భద్రత లభిస్తుందని తాజా వార్తలను బట్టి తెలుస్తున్నది. ఆధార్ వివరాలను బ్యాంకులు, టెలికం సంస్థలు మొదలైన వాటికి ఇవ్వవలసి వస్తున్నది. వీటి ద్వారా పౌరుడి వ్యక్తిగత వివరాలు బయటకు పొక్కే అవకాశం ఉన్నది. అందువల్ల వినియోగదారుడు ఆధార్ నెంబర్ ఇవ్వకుండా, 'వర్చువల్ ఐడీ'ని అందించవచ్చు. ఇష్టం వచ్చినప్పుడు ఎన్నిసార్లయినా ఆ వర్చువల్ ఐడీని మార్చుకోవచ్చు. కొత్త వర్చువల్ ఐడీ తీసుకుంటే, పాతది రద్దయిపోతుంది. ఆధార్ మూల నెంబర్ నిక్షిప్తమై ఉంటుందే తప్ప బయటికి తెలువదు. ఇది మొదటి భద్రతా విధానం. ఈ వర్చువల్ ఐడీతోపాటు అన్ని వివరాలను కాకుండా పేరు, చిరునామా, ఫొటో అందిస్తే సరిపోతుందనేది రెండవ భద్రతా విధానం. ఈ రెండు విధానాల వల్ల వ్యాపార సంస్థలు తమ వినియోగదారుల వివరాలను పూర్తిగా సేకరించలేవు. అందువల్ల పౌరుడి వ్యక్తిగత వివరాలు బయటికి పొక్కే అవకాశం ఉండదనేది యూఐడీఏఐ అభిప్రాయమై ఉంటుంది.

ఆధార్ వివరాలు గోప్యంగా లేవని తాజాగా ఒక పాత్రికేయురాలు నిరూపించిన నేపథ్యంలో ఈ గోప్యతా వివాదం తెరపైకి వచ్చింది. ఇటీవల ఒక పాత్రికేయురాలు ఐదు వందల రూపాయలు చెల్లించడం ద్వారా అతి సులభంగా ఆధార్ వివరాలు సేకరించవచ్చునని వెల్లడించింది.

దేశవ్యాప్తంగా పలు సంక్షేమ పథకాలు దుర్వినియోగం అవుతున్న విషయం తెలిసిందే. ఒకే వ్యక్తి ఎక్కువ పేర్లతో సంక్షేమ పథకాలను ఉపయోగించుకునే అవకాశం ఉన్నది. బోగస్ పేర్లతో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నది. అవినీతి మూలంగా, పారదర్శకత లేకపోవడం వల్ల పేదరిక నిర్మూలనా పథకాలు ఫలితాలను ఇవ్వడం లేదు. ఆధార్‌కార్డు ద్వారా అవినీతిని, ప్రజాధనం దుర్వినియోగాన్ని అరికట్టాలనే ప్రయత్నం సాగుతున్నది. ఉదాహరణకు తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలలో దుర్వినియోగాన్ని అరికట్టడానికి, పారదర్శకతను ప్రవేశపెట్టడానికి ఆధార్‌ను వినియోగించుకుంటున్నది. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించినప్పుడు ఆరోపణలకు ఆస్కారం ఉండదు.

ఇందుకు తాను సేకరించిన విధానాన్ని వివరించింది. ఈ వార్తాకథనం వెలువడిన నేపథ్యంలో ప్రభుత్వం ఆధార్ గోప్యతను కాపాడటం ఎట్లా అనే విషయమై కూలంకష అధ్యయనం జరిపి, తగు జాగ్రత్తలు చేపట్టవలసింది. కానీ పాత్రికేయురాలిపైన, ఈ కథనాన్ని ప్రచురించిన ఆంగ్ల పత్రికపైన చర్యల కోసం కేసు నమోదుచేసింది. ఇది పత్రికాస్వేచ్ఛకు భంగకరమంటూ తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఈలోగా ఆర్బీఐ అధ్యయన నివేదిక బయటకు వచ్చింది. ఆధార్ వివరాలు భద్రంగా లేవనేది ఈ అధ్యయన నివేదిక సారాంశం. వ్యాపార సంస్థలు ఏ విలువలకు స్థానం లేకుండా పోటాపోటీగా వ్యవహరిస్తున్న తరుణంలో అవి వినియోగదారుల వ్యక్తిగత వివరాలను ఆధార్ ద్వారా సేకరించడం కష్టమేమీ కాదు. వ్యాపారులే కాకుండా శత్రువులు కూడా ఒకేచోట అన్ని వివరాలు పొందవచ్చు. ఈ వివరాల ఆధారంగా ఇక్కడి వ్యాపారాలను, పరిపాలనను దెబ్బకొట్టవచ్చునని ఆర్బీఐ నివేదిక పేర్కొన్నది. ఈ నేపథ్యంలో యూఐడీఏఐ కొత్త భద్రతా విధానాన్ని ముందుకుతెచ్చింది. కొత్త భద్రతా విధానం వల్ల వ్యాపార సంస్థలకు వ్యక్తిగత వివరాలు అందవు. కానీ ఆధార్ సంస్థ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, పౌరుల వివరాలను ఇతరులకు అందకుండా భద్రపరుచడం సాధ్యమా అనే సందేహం కూడా ఉన్నది. ప్రభుత్వం ఇంత సమగ్రంగా పౌరుల వివరాలను సేకరించడం అవసరమా అనే ప్రశ్నను కొందరు వేస్తున్నారు. బ్యాంకు ఖాతా మొదలుకొని ప్రతి అవసరానికి ఆధార్‌ను తప్పనిసరి చేయడం ద్వారా ప్రభుత్వం అందరి వివరాలను తన గుప్పెటలో పెట్టుకుంటున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ఆధార్‌ను ప్రవేశపెట్టడం వల్ల ప్రయోజనాలు లేవని కాదు. దేశవ్యాప్తంగా పలు సంక్షేమ పథకాలు దుర్వినియోగం అవుతున్న విషయం తెలిసిందే. ఒకే వ్యక్తి ఎక్కువ పేర్లతో సంక్షేమ పథకాలను ఉపయోగించుకునే అవకాశం ఉన్నది. బోగస్ పేర్లతో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నది. అవినీతి మూలంగా, పారదర్శకత లేకపోవడం వల్ల పేదరిక నిర్మూలనా పథకాలు ఫలితాలను ఇవ్వడం లేదు. ఆధార్‌కార్డు ద్వారా అవినీతిని, ప్రజాధనం దుర్వినియోగాన్ని అరికట్టాలనే ప్రయత్నం సాగుతున్నది. ఉదాహరణకు తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలలో దుర్వినియోగాన్ని అరికట్టడానికి, పారదర్శకతను ప్రవేశపెట్టడానికి ఆధార్‌ను వినియోగించుకుంటున్నది. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించినప్పుడు ఆరోపణలకు ఆస్కారం ఉండదు. అయితే ఆధార్ దేశవ్యాప్తంగా కచ్చితంగా సద్వినియోగం మాత్రమే అవుతుందనే హామీ ఇవ్వలేం. ఈ చర్చ అమెరికాలో కూడా సాగుతున్నది. ప్రభుత్వం తాజా పరిజ్ఞానం తోడ్పాటుతో ప్రజల ప్రతి చర్యను నమోదు చేయాలనే ప్రతిపాదన ఉన్నది. పౌరుడు పంపుకొనే మెసేజ్‌లు, ఎక్కడ ఏయే వస్తువులు కొనుగోలు చేసిందీ మొదలుకొని ప్రతి ఒక్కటీ నమోదవుతుంది. పౌరులపై మితిమీరిన నిఘా ప్రజాస్వామ్య విరుద్ధమని, నిరంకుశ లక్షణమని విమర్శలు వినబడుతున్నాయి. పౌరుడి సమాచారం దుర్వినియోగం కాకూడదు, పౌరుడి వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగకూడదనే కోణంలో ఆధార్‌పై చర్చించడం కూడా అవసరం.

ఆలోకన



టంకశాల అశోక్

భారత వ్యవస్థకు మూడవ సవాలు

స్వతంత్ర్య భారతదేశ వ్యవస్థ ప్రస్తుతం మూడవ సవాలును ఎదుర్కొంటున్నది. మొదటి సవాలు పేదరికం. దానిని పరిష్కరించటంలోని వైఫల్యం వల్ల తలెత్తిన రెండవ సవాలు సామాజిక అశాంతి, ప్రాంతీయ ధోరణులు, కుల సమస్యలు, అస్తిత్వ ఉద్యమాలు, తిరుగుబాటు ఉద్యమాలు మొదలైనవి. ఈ రెండు సవాళ్లను చక్కబెట్టడంలోని వైఫల్యం వల్ల ఉత్పన్నమవుతున్న మూడవ సవాలు ఇటీవలి కాలంలో ముందుకు వస్తున్న మతతత్వ ధోరణి. ఈ మూడు సవాళ్లు ఇదేవిధంగా కొనసాగితే భవిష్యత్తులో ఏమి కాగలదన్నది అగమ్యగోచరమే.

ఈ మూడు సవాళ్లను , వాటి క్రమాన్ని, పర్యవసానాలను ఇపుడు ఒకటొక్కటిగా చూద్దాం. మొదటిది పేదరికం. భారతదేశంలో సహజ సంపదలు ఎన్ని ఉన్నా, అత్యధిక ప్రజల జీవిత స్థితిగతులను బట్టి స్వాతంత్ర్యానికి ముందు వరకు పేద దేశమే. అప్పటివరకు ఇక్కడి వర్గాలు, బయటివారు చేసిన ఎటువంటి దోపిడీల వల్ల, ప్రజలను నిర్లక్ష్యం చేసినందువల్ల పేదరికం ఒక సవాలుగా మారిందో తెలిసిన విషయమే. అందువల్లనే స్వాతంత్రోద్యమ నాయకత్వం మనకు ఇంకా స్వాతంత్ర్యం సిద్ధించటానికి ముందే, పేదరికం నిర్మూలనను, అభివృద్ధిని అన్నింటికి మించిన లక్ష్యాలుగా ప్రకటించింది. అందుకో స్వాతంత్ర్యానికి ముందు, 1947లో స్వాతంత్ర్యాన్ని సాధించినప్పుడు, 1951లో రాజ్యాంగం అమలుకు వచ్చినప్పుడు అనేక ప్రణాళికలను వెల్లడించింది. వీటన్నింటిని గమనించిన దేశ ప్రజలు ఇక అభివృద్ధి జరుగగలదని, పేదరికం సవాలు మనం అధిగమించగలమని చాలా ఆశలు పెట్టుకున్నారు.

కాని 15–20 సంవత్సరాలైనా గడువకముందే, ఈ మొదటి సవాలు అయిన పేదరికాన్ని మన నాయకత్వాలు పరిష్కరించగలవనే ఆశలు అడియాసలు కావటం మొదలైంది. ఆ కాలంలో అసలేమీ జరుగలేదని కాదు. కాని ఇంత పెద్ద దేశం, ఎన్నెన్నో సమస్యలు, తీవ్రమైన పేదరికం మధ్య అది కొరగాకుండా పోయింది. అంతకన్నా ముఖ్యమైంది మరొకటి ఉంది. పేదరికం సవాలు పరిష్కారం కాకపోయినా, కనీసం ప్రభుత్వం రాజకీయ నాయకులకు, అధికారయంత్రాంగం, సామాజిక నాయకత్వాలు ఆ దిశలో నిజాయితీతో పనిచేస్తున్నట్లు కనిపించి ఉంటే ప్రజలకు ఆ మేరకు విశ్వాసం, సంతృప్తి కలిగి ఉండేవి. కాని ఈ నాలుగింటిలో ఏ ఒక్కటీ ప్రజలు మెచ్చగలిగినట్లు జరుగలేదు. మొదటి ప్రధాని నెహ్రూ వంటి ఒకరిద్దరు తగినంత నిస్సహాయస్థితిలో చిక్కుకుని విరోధ శక్తులను ఎదుర్కొంటూ వీలైనంత ప్రయత్నం చేసి ఉండవచ్చు గాక. కాని అది ఎంతమాత్రం చాలలేదు. వారు స్థూల స్థాయిలో (మ్యాక్రో లెవల్స్) కొన్ని చేయగలిగినా సూక్ష్మమైన క్షేత్రస్థాయిలో (మైక్రో లెవల్స్) ఫలితాలు సంతృప్తికరంగా లేవు.

ఈ విధంగా మొదటిసవాలు కొనసాగటమే గాక, కొన్ని విషయాల్లో ఇంకా తీవ్రమవుతున్నట్లు కనిపించటంతో రెండవ సవాలు ఆవిర్భావానికి బీజాలు పడ్డాయి. సుమారు 1960ల మధ్య నుంచి ఇది ఒక రూపు తీసుకోవటం మొదలైంది. ఆ సవాలు రూపం బహుముఖాలుగా విస్తరించింది. ఆ బహు ముఖాలలో సామాజిక అశాంతి ఒకటి. 1960ల మధ్య నుంచి ఆరంభించి గ్రామాలలో రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తుల వారు, అటవీ ప్రాంతాలలో ఆదివాసీలు, పట్టణ ప్రాంతాలలో యువకులు, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులకు చివరకు ఉద్యోగులు కూడా అశాంతికి గురికాగా సామాజిక అశాంతి విస్తరించసాగింది. అనేక సమ్మెలు, ఆందోళనలు జరిగాయి. నక్సలైట్ ఉద్యమం తలెత్తింది. అట్లా కొద్దికాలం గడిచి 1970లు వచ్చేసరికి ఇదే అశాంతి ఇంకా పెరుగటమే గాక ప్రాంతీయ రాజకీయ–ఆర్థికశక్తులు, కుల అస్తిత్వ ధోరణులు, ఇతర అస్తిత్వ ఉద్యమాలు ముందుకు రాసాగాయి. కేంద్రీకృత రాజకీయ ప్రాబల్యం బలహీనపడటం మొదలైంది.

గమనించదగినది ఏమంటే, మొదటి సవాలు అయిన పేదరికం ఇంకా గణనీయస్థాయిలో కొనసాగుతూనే ఉండగా, ఆ వైఫల్యం నుంచి పుట్టుకువచ్చిన ఈ రెండవ సవాలు దానిని సమాంతరంగా ముందుకు వచ్చి విస్తరించటం మొదలైంది. మొదటి సవాలును అధిగమించలేకపోయిన భారతదేశ వ్యవస్థ, లేదా నాయకత్వం, ఈ రెండవ సవాలు కూడా వచ్చేసరికి దిక్కుతోచనదిగా మారింది. ప్రవాహంలో కొట్టుకుపోతూ, తన సొంత ఉనికి కాపాడుకునేందుకు ఆరాటపడుతూ, అపుడపుడు ప్రాప్తకాలజ్ఞత అనదగ్గ ఎత్తుగడలను అనుసరిస్తూ పోయింది. ఆ క్రమంలో మరింతగా బలహీనపడుతూ వచ్చింది. అది తార్కికమైనది, సహజమైనది కూడా. ఎందుకంటే, సవాళ్లను అధిగమించే వ్యూహమంటూ ఉన్నపుడు అందులో భాగంగా ఎత్తుగడలు పనిచేస్తాయి గాని, వ్యూహమే లేనపుడు ఎత్తుగడలన్నవి తెరచాప, చుక్కాని, తెడ్లు లేని పడవను చేతులతో నీటిని తోస్తూ నడిపినట్లు ఉంటుంది. దేశ నాయకత్వానికి, దానితో పాటు దేశవ్యవస్థకు సరిగా అదే జరిగింది.

ఈ రెండు సవాళ్లు సమాంతరంగా సాగి, వ్యవస్థలో రెండు శూన్యాలను సృష్టించాయి. ఆ సవాళ్ళు, శూన్యాల పర్యవసానంగా భారతదేశంలో జాతీయవాదం, జాతీయత అన్నవి, ఒక జాతీయ వ్యవస్థ అన్నది ఆరోగ్యకరమైన, బలమైన పునాదులపైన నిర్మాణం కాకుండాపోయాయి. 1960లలో మొదలైన అస్తవ్యస్త స్థితులు పాతికేండ్ల పాటు 1980ల వరకు కొనసాగాయి. కాని మొదటి వైఫల్యపు 15–20 ఏళ్లు, మొదటిది–రెండవది కలగలసిన వైఫల్యాల మొత్తం 40–45 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో భారతవ్యవస్థ, నాయకత్వాలూ (ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు అన్నీ కలగలిపి) సవాళ్లను అధిగమించలేకపోవటమే గాక, పైన అన్నట్లు కేవలం స్వీయ అస్తిత్వాల కోసం, అధికార స్పృహలతో, తెరచాపలు లేని పడవలను చేతులతో నీటిని తోస్తూ ముందుకు పోజూస్తూ వస్తున్నారు.

మొదటి సవాలు, రెండవ సవాలు 1947-1980ల మధ్య పరిష్కారం అయి ఉంటే, ఈ మూడవ సవాలుకు అసలు ఆస్కారమే లేదు. దాని ప్రవేశానికి వీలు కల్పించే శూన్యమన్నదే దేశవ్యవస్థలో ఉండేది కాదు. ఏ దేశ వ్యవస్థకైనా, దాని నిర్వహణకైనా మతం అనే కేవలం వ్యక్తిగత అంశంతో నిమిత్తం ఉండకూడదు. కాని, మొదటి రెండు సవాళ్లను ఎదుర్కోవటంలో వ్యవస్థ, నాయకత్వాలు విఫలమై అసలు మతమన్నది ఒకసారి రంగప్రవేశం చేసిన తర్వాత, అది కేవలం మతమా లేక మతతత్వమా అనే చర్చ అర్థం లేనిదవుతుంది.

కాని సుడిగుండాలు, సుడిగాలులు, రోదసిలో కృష్ణబిలాలు ఎవరినీ క్షమించవు. సమాజంలో పాత సవాళ్ల పరిష్కారం కానపుడు ఆ స్థితి సరికొత్త సవాళ్లను పుట్టిస్తుంది. రోగ కారకాలయ్యే పాత వైరస్‌లు కొత్త సంతానాన్ని కంటాయి. మ్యుటేట్ అవుతాయి. సరిగా ఈ స్థితి నుంచి లేదా శూన్యం నుంచి తలెత్తి వస్తున్నదే మత సమస్య. ఇందుకు మూలాలు 1980ల చివరి నుంచే ఉండగా 1990లు వచ్చేసరికి ఆకారం స్పష్టంగా కాసాగింది. ఇక్కడ ముఖ్యంగా మాట్లాడుతున్నది మతతత్వం గురించి కాదని దయచేసి గమనించాలి. అది ఉండటం సరే. కాని అంతకన్నా ముఖ్యమైన మౌలిక ప్రశ్న ఒకటుంది. అది మతమనేది దేశ వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, సామాజిక వ్యవస్థల అజెండాపైకి ప్రవేశించటం. పైన పేర్కొన్న మొదటి సవాలు, రెండవ సవాలు 1947–1980ల మధ్య పరిష్కారం అయి ఉంటే, ఈ మూడవ సవాలుకు అసలు ఆస్కారమే లేదు. దాని ప్రవేశానికి వీలు కల్పించే శూన్యమన్నదే దేశవ్యవస్థలో ఉండేది కాదు. ఏ దేశ వ్యవస్థకైనా, దాని నిర్వహణకైనా మతం అనే కేవలం వ్యక్తిగత అంశంతో నిమిత్తం ఉండకూడదు. కాని, మొదటి రెండు సవాళ్లను ఎదుర్కోవటంలో వ్యవస్థ, నాయకత్వాలు విఫలమై అసలు మతమన్నది ఒకసారి రంగప్రవేశం చేసిన తర్వాత, అది కేవలం మతమా లేక మతతత్వమా అనే చర్చ అర్థం లేనిదవుతుంది. శూన్యంలోని మతం ప్రవేశించిందే మతతత్వంగా మారటానికి. ఇపుడిది మూడవ సవాలు అయింది.

దేశ వ్యవస్థ ఈ మూడు సమాంతర సవాళ్లను ఎదుర్కొనలేకపోతే భవిష్యత్తు ఆందోళనకరంగా కనిపిస్తున్నది. ఈ మూడింటి మిశ్రమం భయంకరమైనది. చివరికి పరిష్కారం ఎట్లా జరుగుతుందో గాని ఈ లోపల దేశం మరొక కల్లోల స్థితిని ఎదుర్కోవచ్చుననిపిస్తున్నది.

బహుజనుల అభివృద్ధి బాట

సామాజికం



జూలూరు గౌరీశంకర్

'ప్రపంచంలో చిన్నా పెద్ద తేడా జన్మను బట్టి ఉండవు. డబ్బు, చదువు మొదలైనటువంటి వాటిని అనుసరించి ఉంటాయి. మన దేశంలో కుల విభేదాలు డబ్బు పదవిరీత్యా కాక కేవలం జన్మరీత్యా, వంశరీత్యా ఉంటున్నాయి. కమ్మరి, కుమ్మరి, మంగలి, చాకలి, మాల, మాదిగ మొదలైనవారు చిన్న కులాల వారు. వీరి సంఖ్య 90 శాతం దాకా ఉన్నది. కుల విభేదాల వల్ల వీరి మేధస్సు బందీ అయ్యింది. వీరిని పైకి తెస్తే తప్ప దేశ పునర్నిర్మాణం అసంభవం. కాళ్లూ చేతులు కదిలించకపోయినట్లయితే శరీరానికి పక్షవాతం వచ్చినట్లే, దేశానికి పక్షవాతం వచ్చింది. దేశంలోని ఈ 90 శాతం ప్రజలకు రెండు వేల ఏండ్లుగా పక్షవాతం వచ్చినతీరుగా చేసేశారు. సమాజంలో వీరిని ఎక్కడికక్కడ పాతర వేశారు. కదలిక లేకుండా చేశారు. బానిసత్వానికి మూల కారణం ఇదే. ఇప్పటికైనా మారకపోతే, మరోసారి బానిసలయ్యే ప్రమాదం ఉంది' అని డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా 1968 జూలై 8న గుల్బర్గాలో ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ అన్నారు. సరిగ్గా 50 ఏండ్ల తర్వాత కూడా ఈ వర్గాల్లో మార్పు తెచ్చేందుకు మన పాలకులు ఏ మేరకు కృషి చేశారన్నది పునః పరిశీలన చేసుకోవాల్సిందే. అణగారినవర్గాలను చేయి పట్టుకొని వారిని పైకి తీసుకురాని ప్రాంతమేదైనా అభివృద్ధి చెందదు. తెలంగాణ 85 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలున్న రాష్ట్రం. ఈ రాష్ట్రం బాగు ఈ వర్గాలపై ఆధారపడి ఉన్నది. తెలంగాణ రాష్ట్రం నిర్మాణానికి 85 శాతంగా ఉన్న అట్టడుగువర్గాలను సొంత కాళ్లపై నిలబెట్టేందుకు కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. దార్శనికతతో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాజకీయాలకు అతీతంగా అట్టడుగు నుంచి అభివృద్ధి మొదలు కావాలని తలంచారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో సగం జనాభాగా ఉన్న బీసీల అభివృద్ధి కోసం, వారిని విద్య, ఉద్యోగ, సామాజికరంగాల్లో ముందుకు తీసుకుపోయేందుకు తీవ్రంగా మేధోమథనం చేస్తున్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా సంచారజాతులు, మైనార్టీల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నది. సంచారజాతులు, ఎంబీసీలను గత 60 ఏండ్లల్లో ఏ పాలకులూ పట్టించుకోలేదు. తుతు మంత్రంగా కమిషన్లు వేసి చేతులు దులుపుకున్నారు.కానీ వారి జీవితంలో మార్పు కోసం జరిగిన పని శూన్యం. తెలంగాణ రాష్ట్ర అవతరణతో వారి జీవితాల దశదిశ మారనుంది. సంచార జాతులు, అర్ధ సంచార జాతులు, ఆశ్రిత కులాలు, బాగా వెనుకబడ్డ కులాలను పైకి తెచ్చేందుకు వారి దగ్గరి నుంచి అభివృద్ధికి శ్రీకారం చుడుతానని చెప్పటం విప్లవాత్మకం. దీంతో ఆ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సంచారజాతులు, ఎంబీసీల కోసం ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ఇంత గా ఆలోచించలేదు. ఇదిక్కడి పాలకులే కాదు, దేశంలో ఇంతవరకు ఏ రాష్ట్రంలో కూడా ఈ జాతుల కోసం ఈ రకమైన అడుగులు ఏ రాష్ట్ర ప్రభుత్వం వేయలేదు. సంచార జాతులకు, ఎంబీసీలకు బ్యాంకుల సహాయం లేకుండా నేరుగా సహాయం చేసేపనికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఇది తెలంగాణ పునర్నిర్మాణంలో అభివృద్ధి కింది నుంచి రావాలన్న సూత్రాన్ని అనుసరించి జరుగుతున్నది. అత్యంత వెనుకబడినవాళ్లు, ఇల్లూ వాకిలి లేకుండా తిరుగుతున్నవాళ్లు, యాచక కులాల వాళ్లను స్థిరపరుచాలనే ప్రభుత్వానికి ఉన్నట్లు కనపడుతున్నది. 'అభివృద్ధి అట్టడుగు నుంచే మొదలు' (డెవలప్‌మెంట్ ఫ్రమ్ బిలో) అన్నది తెలంగాణలో ప్రభుత్వ నినాదంగా మారింది.

భౌగోళిక తెలంగాణ సాధన తర్వాత ఇప్పుడు సామాజిక తెలంగాణ అంశాలను ప్రభుత్వం చేస్తున్నది. అందులో భాగంగానే సంచారజాతుల అభివృద్ధి గురించి పథకాలు వేయటం, ఎంబీసీలకు సంబంధించి సమగ్ర జీవన విధానం మార్చే పథక రచనకు శ్రీకారం చుట్టడం, బీసీ కులాలకు సంబంధించి ఆర్థికంగా స్థిరపడేందుకు పథకాలను రూపొందించి అమలుచేయటం సామాజిక న్యాయసూత్రంలో భాగం. ఇదింకా ముందుకుపోయి సామాజిక అంశాలను రూపొందిస్తే అది ప్రజాస్వామిక తెలంగాణగా రూపుదిద్దుకోవచ్చు. అటువైపుగానే ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం జీవో 9 తీసుకువచ్చి సంచార జాతుల జీవన విధానంపై అధ్యయనం చేయించింది. రాష్ట్ర ప్రభుత్వం జీఓఎంఎస్ నెం.9 ద్వారా టీఓఆర్ జారీ చేసిన తర్వాత తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ వెంటనే కార్యాచరణ చేపట్టింది. 90కి పైగా ప్రభుత్వ శాఖ విభాగాధిపతులతో, అధిపతులతో కమిషన్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించింది. ఆయా శాఖల్లో అన్నిస్థాయిల్లోని పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగస్థుల వివరాలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ నియామకాల వివరాలు, వారి కులాలు, ఉప కులాల సమాచారంతో సహా అందించాలని కోరింది. వివరాల సేకరణకు ఫార్మాట్‌ను రూపొందించి అన్ని ప్రభుత్వ విభాగాలకు పంపించింది. దీంతో పాటు ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యాశాఖ, సర్వశిక్షా అభియాన్ అధికారులతో సమావేశం జరిపి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల వివరాలను సామాజికవర్గాల వారీగా ఉపకులాల సమాచారంతో సహా అందించాలని కోరింది. అలాగే ప్రస్తుతం బీసీ జాబితాలోని ఏబీసీడీ కేటగిరిల్లో గల కుల సంఘాల నేతలు, సంచార కులాల ప్రతినిధులు, బీసీ సంఘాలు, ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశాలు నిర్వహించి సామాజిక, విద్య, ఆర్థిక స్థితిగతులు, కులాల చరిత్ర, సాంస్కృతిక జీవనం తదితర అంశాలపై సమాచారాన్ని సేకరించింది.

ఎంబీసీలు ఎవ్వరన్నది గుర్తించటం, వారి బతుకుదెరువుకు అత్యవసరంగా చేయవల్సిన పనులను నిర్ణయించుకోవటం అన్నది తొలి అడుగు. ఈ జీవో నెం.9 ద్వారా కోటిమంది సంచార జాతులు, ఎంబీసీల బతుకులు బాగు కోసం చేస్తున్న కృషి ఒక బహుజన జీవన వేదంగా చరిత్రలో రికార్డవుతుంది. జీవోనెం. 9 ద్వారా ఎంబీసీలెవరో గుర్తించటం, వారికి ఏ స్కీంలు ఇవ్వాలో, వారికి ఏ రకమైన నిధులు అందజేయాలో ఇందులో చెప్పబడింది.ప్రభుత్వమే స్వయంగా ఈ అంశంపై ఎన్నోసార్లు చర్చలు జరిపింది. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ఆరు గంటలు కూర్చొని చర్చించారు. వారి వికాసమే తెలంగాణ వికాసంగా మారాలన్నది సీఎం కేసీఆర్ ఆలోచన.

ఎంబీసీలు ఎవ్వరన్నది గుర్తించటం, వారి బతుకుదెరువుకు అత్యవసరంగా చేయవల్సిన పనులను నిర్ణయించుకోవటం అన్నది తొలి అడుగు. ఈ జీవో నెం.9 ద్వారా కోటిమంది సంచార జాతులు, ఎంబీసీల బతుకు లు బాగు కోసం చేస్తున్న కృషి ఒక బహుజన జీవన వేదంగా చరిత్రలో రికార్డవుతుంది. జీవోనెం. 9 ద్వారా ఎంబీసీలెవరో గుర్తించ టం, వారికి ఏ స్కీంలు ఇవ్వాలో, వారికి ఏ రకమైన నిధు లు అందజేయాలో ఇందులో చెప్ప బడింది. ప్రభుత్వమే స్వయంగా ఈ అంశంపై ఎన్నోసార్లు చర్చలు జరిపింది. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ఆరు గంటలు కూర్చొని చర్చించారు. వారి వికాసమే తెలంగాణ వికాసంగా మారాలన్నది సీఎం కేసీఆర్ ఆలోచన.

సంచార, అర్ధ సంచార, ఆశ్రిత, ఎంబీసీ కులాల వారికి అన్నిరకాల సహాయ సహకారాలు అందించాలి. వృత్తులవారికి నైపుణ్య శిక్షణ ఇప్పించటం, ముఖ్యంగా నగలు, కార్పెంటర్, కుండల తయారీలో శిక్షణ ఇప్పించాలి. వడ్రంగి వృత్తిలో ఉన్నవారికి కలప సహాయం చేసి, ఆధునికతను జోడించి వస్తువులు తయారుచేస్తే అవి రాష్ట్ర అవసరాలను తీర్చడమే కాకుండా దేశవిదేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉంటుంది. ప్రాథమిక పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు బల్లలు, కుర్చీలు, టేబుల్లు, టేబుల్‌పైన పెట్టుకునే పెన్ ప్యాడ్స్, పేపర్ వెయిట్స్, భోజన వసతులకు ఉపయోగించే డైనింగ్ టేబుల్ల దగ్గరి నుంచి కలపతో చేసే ప్రతీ వస్తువును ఈ విశ్వకర్మ ఫెడరేషన్ నుంచే తయారుచేసి సరఫరా చేస్తే కోట్లాది రూపాయల ఆదాయాన్ని ఆ ఫెడరేషన్ పొందుతుంది. పాఠశాల స్థాయి నుంచి మంత్రుల కార్యాలయాల వరకు ఉపయోగించే ఫర్నీచర్ అంతా అత్యంత అద్భుతంగా వడ్రంగి వృత్తిలో ఉన్నవారు చేయగలరు. వడ్రంగి వృత్తి సంపూర్ణ ఆధునికత చెందితే విదేశాల నుంచి వస్తున్న ఫర్నీచర్‌కు అడ్డుకట్టవేయవచ్చు. జైళ్లశాఖ నుంచి తయారుచేసిన వస్తువులనే కొనాలనే జీవో ఉన్నప్పటికీ దీని అమలు సక్రమంగా జరుగటం లేదు.

కళలు, వాయిద్య సంబంధ వృత్తుల్లో ఉన్నవారి కోసం ప్రత్యేక శిక్షణను ఇప్పించేందుకు సంస్థలను ప్రారంభించాల్సి ఉంది. బీసీ కులాల్లో బాగా వెనుకబడ్డ వారికి అన్నిరకాల ప్రోత్సాహకాలు అందించేందుకు వెనుకడుగు వేసేది లేదని ప్రభుత్వం నిర్ణయించటం ఆహ్వానించదగింది. మార్పు ఒక్కసారిగా రాదు. మార్పుకోసం అడుగులు వేయడమే పెద్ద మార్పు. బహుజనుల వికాసాన్ని తెలంగాణ వికాసంగా కేసీఆర్ ప్రకటించడం సమగ్రాభివృద్ధికి సంకేతంగా చెప్పవచ్చు.

జనగళం

కాలుష్యాన్ని నివారించాలె

హైదరాబాద్ నగరంలో కాలుష్యం ప్రమాద స్థాయిలో ఉన్నది. దీనికి పెరుగుతున్న జనాభా ఒక కారణమైతే,కొత్తగా రోడ్డెక్కుతున్న వాహనాలు, కాలంచెల్లిన వాహనాలు ప్రధాన కారణం. పేరుకుపోతున్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్తను తగులబెట్టడం, పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల వల్ల కూడా రోజురోజుకు కాలుష్యం పెరుగుతున్నది. అధికారులు కాలుష్య కారణాలను అన్వేషించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలి. పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలిగించాలి. చెత్తను తగులబెట్టడాన్ని నిరోధించాలె. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దాలె.

-ఎస్. శ్రీనివాసరాజు, హైదరాబాద్

కఠినంగా వ్యవహరించాలి

భ్రూణహత్యల నివారణ కోసం ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. ఇప్పటికీ ప్రమాదకరస్థాయిలో భ్రూణ హత్యలు జరుగుతున్నాయి. ప్రైవేట్ దవాఖానల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదనే నిబంధనలున్నప్పటికీ యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నాయి. కాబట్టి రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వైద్యాధికారులు దీనిపై దృష్టిపెట్టాలి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- పి.సంపత్, రాములపల్లె, పెగడపల్లి, జగిత్యాల

వీధి బాలలను అక్కున చేర్చుకోవాలె


నగర కూడళ్లలో ఎక్కడచూసినా వీధి బాలలు యాచకవృత్తుల్లో కనిపిస్తున్నారు. చదువుకోవాల్సిన వయసులో పిల్లలు పొట్టకూటి కోసం వెంపర్లాడటం పెద్ద విషాదం. ప్రభుత్వం వీరిని చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించాలి. నగరంలో ఎక్కడ వీధిబాలలు కనిపించినా ప్రభుత్వానికి అప్పగించాల్సిన బాధ్యత ప్రజలు తీసుకోవాలి.

- జంపాల అంజయ్య, సామాజిక కార్యకర్త, భువనగిరి

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.


ఉరే సరైన పద్ధతి!



- ప్రాణాంతక ఇంజెక్షన్లు పనిచేయవు
- మరణశిక్ష అమలు విధానాలపై సుప్రీంకోర్టుకు నివేదించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: మరణశిక్షను అమలు చేయడానికి ఉరితీయడమే సరైన పద్ధతి అని, ప్రాణాంతకమైన ఇంజెక్షన్లు ఇచ్చే విధానం సరిగా పనిచేయదని కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ పింకీఆనంద్ సుప్రీంకోర్టుకు నివేదించారు. మరణశిక్ష పడిన వ్యక్తిని కేవలం ఉరితీయడం ద్వారా మాత్రమే ప్రాణం కోల్పోయేలా చేయాలని ఉన్న నిబంధనలను పక్కకు పెట్టాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం.. వివిధ దేశాల్లో మరణశిక్షలను ఎలా అమలు చేస్తున్నారో తమకు తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. 'మరణశిక్షను అమలు చేయడానికి ఏది సరైన విధానం అనేది మేం నిర్ణయించలేం. అయితే ఇతర దేశాల్లో ఏం జరుగుతున్నదో మేం తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది' అని ధర్మాసనం పేర్కొన్నది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి నాలుగు వారాల గడువును విధించింది.

'పద్మావత్' రిలీజ్ చేస్తే థియేటర్ల వద్ద కర్ఫ్యూ: కర్ణిసేన



న్యూఢిల్లీ: వివాదాస్పదమైన 'పద్మావత్' సినిమాను రిలీజ్ చేస్తే సినిమా టాకీస్‌ల వద్ద ప్రజా కర్ఫ్యూ విధిస్తామని, టాకీస్‌ల వద్దకు ఎవ్వరూ రాకుండా అడ్డుకుంటామని రాజ్‌పుత్‌లు హెచ్చరించారు. మొదటి నుంచి కూడా వీరు ఈ సినిమాను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. బుధవారం రాజ్‌పుత్ కర్ణిసేన ప్రతినిధులు మాట్లాడుతూ పద్మావత్ సినిమాను పూర్తిగా నిషేధించాలని మరోసారి డిమాండ్ చేశారు. చరిత్రను వక్రీకరించి ఈ సినిమాను నిర్మించారని, ఎట్టి పరిస్థితుల్లో దీని ప్రదర్శనకు ఒప్పుకోమని తెలిపారు. ఈ సినిమాను డిసెంబర్ 1న రిలీజ్ చేయాలని మొదట భావించారని, తమ ఆందోళనల నేపథ్యంలో వెనుకడుగు వేశారని పేర్కొన్నారు. మళ్లీ జనవరి 25న రిలీజ్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసిందని, దీనిని అడ్డుకుంటామని హెచ్చరించారు.

భారత్ అభివృద్ధిలో భాగస్వాములు కండి

భారత సంతతి పార్లమెంటేరియన్లకు రాష్ట్రపతి రామ్‌నాథ్ పిలుపు



న్యూఢిల్లీ: 'భారతదేశం విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తున్నది. మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న దేశాల అవసరాలను భారత్‌తో అనుసంధానం చేసి అభివృద్ధిలో భాగస్వాములు కండి' అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ భారత సంతతి పార్లమెంటేరియన్ల(పీఐవో)కు పిలుపునిచ్చారు. బుధవారం ఢిల్లీలో జరిగిన పీఐవో అంతర్జాతీయ సదస్సును రాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సదస్సుకు 23 దేశాల నుంచి భారత సంతతి పార్లమెంటేరియన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, భిన్నత్వంలో ఏకత్వం, సాంస్కృతిక వైవిధ్యం భారత్ బలాలని, వీటిని చూసి దేశవాసులంతా గర్విస్తున్నారని చెప్పారు. ప్రవాస భారతీయులు సైతం ఇవే విలువలు పాటిస్తూ, తాము నివసిస్తున్న దేశాల్లో ప్రత్యేకత చాటుకుంటున్నారని అభినందించారు. మీరు నివసిస్తున్న దేశానికి, మీ పూర్వీకులు జన్మించిన భారతదేశానికి మధ్య వారధులుగా మిమ్మల్ని భావిస్తున్నామని తెలిపారు. ప్రజల మధ్య అనుసంధానం పెరుగడం ద్వారా రెండు దేశాలకూ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, సమీప భవిష్యత్‌లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందన్నారు. 2022లో 75వ స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలు జరుపుకొనేనాటికి కొన్ని స్పష్టమైన మైలురాళ్లను అధిగమిస్తామన్నారు. పలువురు ప్రవాస భారతీయులు వ్యాపార, రాజకీయ రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగారని, ఆయా దేశాల అభివృద్ధిలో కీలకంగా మారారని అభినందించారు.

ఇస్రో చైర్మన్‌గా శివన్



న్యూఢిల్లీ: ఇస్రో చైర్మన్‌గా ప్రముఖ శాస్త్రవేత్త శివన్ కే నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన మూడేండ్లపాటు కొనసాగనున్నారు. శివన్ ప్రస్తుతం విక్రమ్‌సారాభాయ్ అంతరిక్ష కేంద్రం డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చదివిన ఆయన తర్వాత బెంగళూరులోని ఐఐఎస్‌సీలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తిచేశారు. ఐఐటీ బాంబే నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 1982లో ఇస్రోలో చేరిన శివన్ ప్రస్తుత ఇస్రో చైర్మన్ కిరణ్‌కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. మరో రెండు రోజుల్లో ఇస్రో నూరవ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్న నేపథ్యంలో శివన్ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

'ఆధార్' బదులు 'వర్చ్యువల్' ఐడీ!

సమాచార గోప్యతాహక్కుకు భంగం కలుగకుండా యూఏడీఏఐ ప్రత్యామ్నాయం

సిమ్ కార్డుల జారీ వంటి సేవలు, గుర్తింపు తనిఖీలకు వర్చ్యువల్ ఐడీ

ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి జారీకి అభ్యర్థనల స్వీకరణ



న్యూఢిల్లీ, జనవరి 10: బ్యాంకు ఖాతాల నుంచి మొదలు, సెల్‌ఫోన్లకు సిమ్‌కార్డుల జారీ వరకు అన్ని ప్రభుత్వ పథకాలు, సేవలకు ఆధార్ కార్డును జత చేయాలని ముడిపెట్టడం వల్ల ప్రజల వ్యక్తిగత సమాచార గోప్యతా హక్కులకు భంగం కలుగుతున్నదన్న ఆందోళనలను పరిష్కరించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఏడీఏఐ) ప్రత్యామ్నాయాన్ని ప్రవేశపెట్టింది. అదే 'వర్చ్యువల్ ఐడీ..' సిమ్ కార్డుల జారీ వంటి వివిధ సౌకర్యాలు, సేవలు కావాలనేకునే వారు ఇకపై ఆధార్‌ను చూపించాల్సిన అవసరం లేదు. వారు ఆధార్‌కు బదులు వర్చ్యువల్ ఐడీని చూపించి సేవలను పొందవచ్చు. ఆధార్ సంఖ్యలో 12 అంకెలు ఉంటే 'వర్చ్యువల్ ఐడీలో 16 అంకెలు ఉంటాయి. వర్చ్యువల్ ఐడీ అనేది ఒక వ్యక్తి గుర్తింపునకు సంబంధించిన పరిమిత వివరాలను మాత్రమే అందజేస్తుంది. ఆధార్ సంఖ్యను తెలుపకుండా వివిధ సేవలు పొందే అవకాశాన్ని వర్చ్యువల్ ఐడీ కల్పిస్తుంది. అంటే ఉదాహరణకు సిమ్ కార్డుల తనిఖీ కోసం ఆధార్ సంఖ్యను తప్పకుండా తెలియజేయాల్సిన పని ఉండదు. సిమ్‌లు జారీ చేసే కంపెనీకి వినియోగదారు ఎవరనేది తెలియడానికి అవసరమైన వినియోగదారుని పేరు, ఫొటో వగైరా బయోమెట్రిక్ సమాచారం, చిరునామా వంటి వివరాలుండే వర్చ్యువల్ ఐడీని సమర్పిస్తే చాలు. వర్చ్యువల్ ఐడీ అనేది ఆధార్ సంఖ్యలాగా శాశ్వతమైన సంఖ్య కాదు. దీనిని ఎప్పుడైనా ఉపసంహరించుకోవచ్చు. ఆధార్‌కార్డులున్నవారు యూఏడీఏఐ వెబ్‌సైట్ ద్వారా వర్చ్యువల్ ఐడీని తమంతతాము పొందవచ్చు. ఒకటి కాదు ఎన్ని వర్చ్యువల్ ఐడీలనైనా ఒక వ్యక్తి తీసుకోవచ్చు. అయితే కొత్తగా మరో వర్చువల్ ఐడీ తీసుకోగానే పాత ఐడీ ఆటోమెటిక్‌గా రద్దవుతుంది. ఈ ఏడాది మార్చి ఒకటో తేదీ నుంచి వర్చ్యువల్ ఐడీల జారీ అభ్యర్థనలను యూఏడీఏఐ స్వీకరిస్తుంది. వినియోగదారుల వర్చ్యువల్ ఐడీలను సేవాసంస్థలు ఈ ఏడాది జూన్ ఒకటి నుంచి విధిగా అంగీకరించాలి. అలా అంగీకరించని సంస్థలకు ఆర్థికపరమైన ప్రోత్సాహకాలు లభించవు. దీనివల్ల ప్రతి విషయానికీ వినియోగదారుల ఆధార్ సంఖ్యలను సేకరించాల్సిన భారం సర్వీసు సంస్థలకు కూడా తప్పుతుంది.

కాలిఫోర్నియా బురదమయం

- 15 మంది మృతి.. 20 మందికి తీవ్రగాయాలు
- బీభత్సం సృష్టిస్తున్న వరదలు



శాంటా బార్బరా, జనవరి 10: అమెరికాలోని కాలిఫోర్నియాను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. మొన్నటివరకు వేల ఎకరాల అడవి అగ్నికి ఆహుతై వేలాదిమంది నిరాశ్రయులు కాగా, ప్రస్తుతం వర్షం బీభత్సం సృష్టిస్తున్నది. తుఫానుతో భారీ వరదల వల్ల దక్షిణ కాలిఫోర్నియాలో జనజీవనం అతలాకుతలమైంది. ఇండ్లు, రహదారులపై కొండచరియలు విరిగిపడ్డాయి. 15 మంది మృతిచెందారని, మరో 20 మంది తీవ్రంగా గాయపడగా దవాఖానకు తరలించామని అధికారులు తెలిపారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నది.

కుంభవృష్టి వర్షాలతో కొండచరియలు విరిగిపడి పెద్ద పెద్ద రాళ్లు, చెట్లు రహదారులపై పడ్డాయి. పదులసంఖ్యలో ఇండ్లు, వాహనాలు ధ్వంసమయ్యాయి. భారీ సంఖ్యలో జనం నిరాశ్రయులయ్యారు. వరదల వల్ల కొండలపై ఉన్న బురదంతా వీధులు, రోడ్లపైకి చేరింది. వందలాది వాహనాలు బురదలో కూరుకుపోయాయి. అమెరికాలోని అత్యంత రద్దీగా ఉండే 101 జాతీయ రహదారిపై దాదాపు 45 కిలోమీటర్ల దూరం మూడు అడుగుల మేర బురద పేరుకుపోయింది. దీంతో వాహనాలు నిలిచి రాక పోకలు స్తంభించాయి. ఇటీవల కార్చిచ్చు కారణంగా మాంటెసిటో పర్వతశ్రేణిపై ఉన్న అడవి అంతా దగ్ధమైంది. రోజులతరబడి కొనసాగిన మంటల్లో వృక్ష సంపద అంతా బూడిదైంది. ఈ నేపథ్యంలో మంగళవారం భారీ వర్షం కురియడంతో చెట్లు లేని కారణంగా ఎగువ ప్రాంతం నుంచి మట్టి బురదగా మారి కిందకు చేరింది. శాంటా బార్బరా కౌంటీలో ఐదు నిమిషాల్లోనే 1.5 సెంటీమీటర్ల వర్షం పడటంతో వరదలు తీవ్ర రూపం దాల్చాయి. ఉన్నతస్థాయి వర్గాలు నివసించే మాంటెసిటో, కార్పెంటేరియాలో వరదల ప్రభావంతో అడుగుమేర బురద పేరుకుపోయింది. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో శునకాలు, హెలికాప్టర్ల సాయంతో సిబ్బంది మంగళవారం సహాయక చర్యలు చేపట్టారు. పదులసంఖ్యలో స్థానికులను రక్షించారు. మాంటెసిటోలో కొండచరియలు విరిగిపడి ధ్వంసమైన ఓ ఇంట్లో కొన్నిగంటలపాటు చిక్కుకున్న 14ఏండ్ల బాలిక ఏడుపు శబ్దాన్ని శునకాలు వినడంతో.. వాటిసాయంతో సిబ్బంది ఆమెను సజీవంగా కాపాడారు. చుట్టూ వరదలతో ప్రాణాలను అరచేతిలో పట్టుకుని ఓ ఎత్తైన ప్రాంతంలో నిల్చున్న 300మందిని యూఎస్ తీరప్రాంత హెలికాప్టర్ సాయంతో కాపాడగలిగామని అధికారులు తెలిపారు. భారీ వర్షాల్లో చిక్కుకున్న శాంటా బర్బారలో నివసిస్తున్న వారి ఇంటింటికీ వెళ్లి దాదాపు ఏడువేల మందిని ఖాళీ చేయించామని చెప్పారు.



మాంటెసిటో పర్వత ప్రాంతం నుంచి కాలిఫోర్నియాలోకి ప్రవహిస్తున్న బురదనీరు (ఇన్‌సెట్లో) ఓ టీనేజర్‌ను కాపాడిన సహాయసిబ్బంది

'రాజకీయ' న్యాయవాదులకు బార్‌కౌన్సిల్ షాక్

న్యూఢిల్లీ: దేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఎన్నికై న్యాయవాద వృత్తిని కొనసాగిస్తున్న ప్రజాప్రతినిధులకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) బుధవారం నోటీసులు జారీచేసింది. చట్టం ప్రకారం వారిని నిషేధించాలని డిమాండ్ చేస్తూ వచ్చిన విజ్ఞప్తిపై బీసీఐ స్పందించింది. తమ నోటీసులపై ఎంపీలు, ఎమ్మెల్యేలు వారంలోగా స్పందించాలని బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు న్యాయస్థానాల్లో న్యాయవాదులుగా పనిచేస్తూ.. బీసీఐ చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారని ఢిల్లీ బీజేపీ నేత అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్ వేశారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో తొక్కిసలాట

- బీహార్‌లో ఒకరు మృతి, నలుగురికి గాయాలు

దెహ్రీ ఆన్ సోన్: బీహార్‌లోని రోహ్‌టస్ జిల్లా దెహ్రి ఆన్‌సోన్ పట్టణంలో బుధవారం జరిగిన ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఒక యువకుడు మృతిచెందగా నలుగురు గాయపడ్డట్టు అధికారులు తెలిపారు. ఈ ర్యాలీకి 4500మంది యువకులు హాజరయ్యారు. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో వారందరూ ఒకేసారి గేట్‌లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగిందని ఎస్పీ ధిల్లోన్ తెలిపారు.

మరో జేఎన్‌యూ విద్యార్థి అదృశ్యం



న్యూఢిల్లీ: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన మరో విద్యార్థి ముకుల్ జైన్ (26) సోమవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదు. ముకుల్ లైఫ్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ముకుల్ అదృశంపై ఇప్పటివరకు అనుమానస్పదంగా ఏదీ అనిపించలేదని పోలీసులు చెప్తున్నారు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ చదివే నజీబ్ అహ్మద్ అనే విద్యార్థి 2016లో మహి మన్డీ హాస్టల్ నుంచి అదృశ్యమైన సంగతి తెలిసిందే.

శ్రీలంక పార్లమెంట్‌లో కొట్టుకున్న ఎంపీలు

కొలంబో: శ్రీలంక పార్లమెంట్‌లో ఎంపీలు ఒకరినొకరు కొట్టుకున్నారు. దేశంలోని సెంట్రల్ బ్యాంకులో బాండ్ల కుంభకోణంపై విచారణ కమిషన్ తన నివేదికను గతవారం సమర్పించింది. ఈ నివేదికపై బుధవారం పార్లమెంట్‌లో జరిగిన చర్చ సందర్భంగా ప్రధాని విక్రమ్‌సింఘే మాట్లాడుతుండగా ప్రతిపక్ష సభ్యులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరినొకరు కొట్టుకున్నారు.

సివిల్ సర్వీసెస్ మెయిన్స్ ఫలితాల వెల్లడి

యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల రోల్‌నంబర్లు

తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది ఇంటర్వ్యూకు సెలెక్ట్

వచ్చే నెల 19 నుంచి ఇంటర్వ్యూలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సివిల్ సర్వీసెస్-2017 మెయిన్స్ ఫలితాలను యూనియన్ సర్వీస్ పబ్లిక్ కమిషన్(యూపీఎస్సీ) బుధవారం ప్రకటించింది. మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల రోల్‌నంబర్ వివరాలను కమిషన్ వెబ్‌సైట్ (www.upsc.gov.in)లో పొందుపర్చింది. వీరికి వచ్చే నెల 19 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించే అవకాశముంది. ఇంటర్వ్యూలకు ఎంపికైన వారిలో తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు 300 మంది ఉన్నట్లు సమాచారం. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఈ నెల 18 నుంచి కమిషన్ వెబ్‌సైట్‌లో ఇంటర్వ్యూ లెటర్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గతేడాది అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 మధ్య మెయిన్స్ పరీక్షలను యూపీఎస్సీ నిర్వహించింది. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఏఎస్), ఇండియన్ ఫారెన్ సర్వీస్(ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్(ఐపీఎస్) తదితర విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ప్రతియేటా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలను నిర్వహిస్తున్నది. ఇంటర్వ్యూల అనంతరం ఫైనల్ ఫలితాలను ప్రకటించాక మెయిన్స్‌కు అర్హత సాధించని అభ్యర్థుల మార్కుల జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చుతారు. అయితే మెయిన్స్‌లో మొత్తం ఎంతమంది అర్హత సాధించారన్న విషయాన్ని యూపీఎస్సీ ప్రకటించలేదు.

మార్చి 5 నుంచి సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలు

న్యూఢిల్లీ, జనవరి 10: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)లో చదువుతున్న 10, 12వ తరగతుల విద్యార్థులకు వార్షిక పరీక్షలు మార్చి 5 నుంచి జరుగనున్నాయి. ఈ పరీక్షలకు దాదాపు 16,38,552 మంది 10వ తరగతి విద్యార్థులు హాజరుకానున్నారు. వీరి పరీక్షలు ఏప్రిల్ 4న పూర్తవుతాయి. 12వ తరగతి పరీక్షలను 11,86,144 మంది విద్యార్థులు రాయనున్నారు. వీరి పరీక్షలు ఏప్రిల్ 12 వరకు జరుగుతాయి.

కర్ణాటక ప్రభుత్వం హిందూ వ్యతిరేకి

మా కార్యకర్తలను హత్యచేసినవారిని కాపాడుతున్నది: అమిత్‌షా ■ బీజేపీ, భజరంగ్‌దళ్‌లోనూ ఉగ్రవాదులున్నారు: సిద్ధరామయ్య

బెంగళూరు, జనవరి 10: సిద్ధరామయ్య ప్రభుత్వం ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతూ హిందూ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా విమర్శించారు. బుధవారం చిత్రదుర్గ జిల్లా హోలాల్కెరేలో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. సోషల్ డెమోక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) నాయకులపై కేసులను ఎత్తివేయడమే అందుకు నిదర్శనమని ఆరోపించారు. కేరళకు చెందిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)లో ఎస్‌డీపీఐ ఓ భాగమని, ఈ పార్టీలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. గత మూడేండ్లలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ 21మంది కార్యకర్తలను కోల్పోయిందని, వీరి హత్యల్లో పలువురు పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ నాయకుల ప్రమేయం ఉన్నదన్నారు. అమిత్‌షా విమర్శలను కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కొట్టిపారేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్‌లోనూ పలువురు ఉగ్రవాదులు ఉన్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేవారెవరినీ ప్రభుత్వం వదిలిపెట్టదని, పార్టీలు, సంస్థలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకుంటుందన్నారు.



హోలాల్కెరే సభలో మాట్లాడుతున్న అమిత్‌షా



మడికెరి సభలో వేదికపైనే కునుకుతీస్తున్నసిద్ధరామయ్య

కేవీఎస్‌లో కండ్లుమూసుకుని ప్రార్థనలెందుకు?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: కేంద్రీయ విద్యాలయాల్లో కండ్లుమూసుకుని, చేతులు జోడించి సామూహిక ప్రార్థనను ఎందుకు తప్పనిసరి చేశారో చెప్పాలని బుధవారం సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వాన్ని కోరింది. రెండువారాల్లో సమాధానం ఇవ్వాలని జస్టిస్ రోహింటన్ ఎఫ్ నారిమన్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వంతోపాటు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్)కు నోటీసులు జారీచేసింది. ఈ మేరకు వినాయక్ షా అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం.. 'ఇది చాలా ముఖ్యమైన విషయం' అని పేర్కొన్నది. కేవీఎస్ సవరించిన విద్యా నియమావళిలోని ఆర్టికల్ 92 చెల్లుబాటును పిటిషనర్ సవాల్ చేశారు. ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థల్లో మతపరమైన నమ్మకాలను వ్యాప్తి చేయవద్దని, వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉన్నప్పుడు విద్యార్థులను చేతులు జోడించి, కండ్లుమూసుకుని ప్రార్థనలు చేయమనడం సరైంది కాదని పేర్కొన్నారు.

సిక్కు అల్లర్ల కేసుల పునర్విచారణ

- విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు

న్యూఢిల్లీ: 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన 180కి పైగా కేసులను పునర్విచారించాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశాలు జారీచేసింది. ఇందుకోసం విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. గతంలో సుప్రీంకోర్టు నియమించిన ఒక కమిటీ సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన 241 కేసుల్లో 186 కేసులను మళ్లీ దర్యాప్తు చేయాలని సిఫారసు చేసింది. కమిటీ సూచనల మేరకు సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు జారీచేసింది. దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హత్య అనంతరం ఢిల్లీలో సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో ఢిల్లీ పరిసర పాంతాల్లో 2,733 మంది సిక్కులు ప్రాణాలు కోల్పోయారు.

కల్బుర్గి హత్యపై సిట్ దర్యాప్తు!

- కేంద్రం అభిప్రాయం కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: 2015లో జరిగిన హేతువాది, రచయిత ఎంఎం కల్బుర్గి హత్యపై సిట్ దర్యాప్తు చేయాలని ఆయన భార్య ఉమాదేవి కల్బుర్గి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. దీనిపై అభిప్రాయం వెల్లడించాలని బుధవారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కాగా తన భర్త కుల్బుర్గితోపాటు మరో ఇద్దరు హేతువాదులు నరేంద్ర దబోల్కర్, గోవింద్ పన్సారే హత్యలు ఒకే విధంగా జరిగాయని.. ఈ మూడు హత్యల మధ్య సంబంధం ఉన్నదని ఉమాదేవి కల్బుర్గి తన పిటిషన్‌లో తెలిపారు. వీటిపై ఉమ్మడి దర్యాప్తు చేపట్టాలని ఆమె కోరారు.

ఎఫ్‌డీఐ గేట్లు బార్లా

మొదటిపేజీ తరువాయి...

విదేశీ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు తాజానిర్ణయం అవకాశం కల్పిస్తుంది. 'పెట్టుబడులు వచ్చే మార్గాల్లో ఉన్న అడ్డంకుల్ని తొలిగిస్తున్నాం. ఈ విధాన నిర్ణయాల ద్వారా వేగవంతమైన ఆర్థికవృద్ధిని సాధించేందుకు వీలవుతుంది' అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి సురేశ్‌ప్రభు చెప్పారు.

నిర్మాణ రంగంలోనూ తెరుచుకున్న గేట్లు

నిర్మాణ రంగంలోనూ వందశాతం ఎఫ్‌డీఐలకూ ప్రభుత్వం గేట్లు తెరిచింది. దేశీయ నిర్మాణ రంగం మొత్తం రియల్ ఎస్టేట్ బ్రోకింగ్ సేవలు విస్తరించిలేనందున వాటిలోనూ వందశాతం పెట్టుబడులను అనుమతిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. దీనికితోడు ఐకియా, హెచ్‌అండ్ఎం వంటి బహుళజాతి సంస్థలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నట్లుగానే.. 30శాతం స్థానిక నియామకాలు ఉండాలన్న నిబంధననూ ప్రభుత్వం ఎత్తివేసింది. ఏప్రిల్- సెప్టెంబర్ త్రైమాసికంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 17శాతం వృద్ధి నమోదైంది. ఎఫ్‌డీఐలు 25.35బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఈ పెట్టుబడులు 9శాతం వృద్ధి చెందాయి.

విద్యుత్‌రంగంలో నిబంధనల సడలింపు

విద్యుత్ రంగంలో పెట్టుబడులకూ కేంద్రం నిబంధనలను సడలించింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐ) గానీ, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ)గానీ సెకండరీ మార్కెట్‌లో ప్రస్తుతం 49శాతం వరకు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉంది. ఇకపై ఎఫ్ఐఐ, ఎఫ్‌పీఐ ప్రైమరీ మార్కెట్‌లోనూ వారు పెట్టుబడులు పెట్టవచ్చు. ఈ మేరకు కేంద్రక్యాబినెట్ ఆమోదముద్ర వేసింది.

క్యాబినెట్ నిర్ణయాన్ని ఖండించిన సీఏఐటీ


ఎఫ్‌డీఐలపై కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని కాన్ఫిడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ ఖండించింది. వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వల్ల భారత రిటైల్ మార్కెట్‌లోకి బహుళజాతి కంపెనీలు సులువుగా వచ్చేస్తాయని ఆ సంస్థ ఆరోపించింది. ఇది ఒకరకంగా బీజేపీ తన ఎన్నికల వాగ్దానాన్ని మరిచినట్లేనని సీఏఐటీ విమర్శించింది.

తుంగభద్ర స్టీల్ ఫ్యాక్టరీ మూసివేతకు నిర్ణయం

కర్నాటకలోని హోసూరులో ఉన్న తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (టీఎస్‌పీఎల్) మూసివేతపై మంత్రివర్గ కమిటీ చేసిన ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 1960లో మైసూర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నెలకొల్పిన ఈ పరిశ్రమ క్రమంగా నష్టాలపాలైంది. క్యాబినెట్ నిర్ణయంతో ఫ్యాక్టరీ ఆస్తులను విక్రయించనున్నారు. మరోవైపు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్)లో 25 కొత్త పోస్టుల భర్తీకి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సీఐఎస్ఎఫ్‌లో ఇప్పటికే 1.49లక్షల మంది సిబ్బంది ఉన్నారు.

2020 వరకూ ఎంపీ ల్యాడ్స్ స్కీం పొడిగింపు

పార్లమెంటు సభ్యులకు నిధుల్ని కేటాయించే లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీం (ఎంపీ ల్యాడ్స్) పథకాన్ని 31 మార్చ్ 2020 వరకు పొడిగిస్తూ ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం నిర్ణయించింది. 1993లో ప్రారంభమైన ఎంపీ ల్యాడ్స్ పథకం కింద గత ఏడాది ఆగస్టు వరకు రూ.44,929కోట్ల వ్యయంతో 18,82,180 పనుల్ని చేపట్టారు. మరోవైపు దివ్యాంగుల జాతీయ ట్రస్టు చైర్మన్, సభ్యుల పదవీకాలాన్ని మూడేండ్లకు పరిమితం చేస్తూ దివ్యాంగులచట్టం-1999లో సవరణలకు కూడా క్యాబినెట్ ఆమోదం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.



అప్పుల ఊబిలోంచి 'మహారాజా' బయటపడుతాడా?

ఎయిర్ ఇండియాలో విదేశీ విమానయాన సంస్థలు 49శాతం వరకు అనుమతితో కూడిన పెట్టుబడులు పెట్టేందుకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. తద్వారా భారీగా పెట్టుబడులు, ఆదాయం, ఉద్యోగాలు వస్తాయని కేంద్రం అంచనావేస్తున్నది. మంత్రివర్గ తాజా నిర్ణయంతో నష్టాల్లో ఉన్న ఎయిర్ ఇండియాలో విదేశీ పెట్టుబడులకు మార్గం సుగమమవుతుంది. అయితే ఈ ఎఫ్‌డీఐలు కొన్ని షరతులకు లోబడి ఉండాల్సి ఉంటుంది. ప్రత్యక్ష లేదా పరోక్ష పెట్టుబడుల ద్వారా విదేశీ విమానయాన సంస్థల వాటా 49శాతం దాటకూడదు. ప్రధాన యాజమాన్య హక్కులు, సమగ్ర నియంత్రణ ఎయిర్ ఇండియాకే ఉంటుంది. మరోవైపు విమానయాన రంగాన్ని ప్రైవేట్ పరం చేయడంపై ప్రభుత్వం పునరాలోచించాలని, దేశానికి గర్వకారణమైన ఎయిర్ ఇండియా నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకోవడానికి బదులుగా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని రవాణా, టూరిజం, సాంస్కృతికరంగాల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ మంగళవారం నిశ్చితాభిప్రాయం వ్యక్తంచేసినట్లు సమాచారం. 2017 మార్చ్ నాటికి ఎయిర్ ఇండియా మొత్తం రూ.48,877 కోట్ల అప్పుల్లో ఉంది. ఇందులో రూ.17,360 కోట్లు విమాన కొనుగోలు రుణాలు కాగా, రూ.31,517 నిర్వహణ మూలధనం. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఎయిర్ ఇండియా నికర నష్టం రూ.3579 కోట్లుగా ఉండవచ్చని భావిస్తున్నారు. ఎయిర్‌ఇండియాలో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణపై గత ఏడాది జూలైలో ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ ప్రభుత్వానికి ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

వలసలకు ప్రతిభ ఆధారంగానే ప్రవేశం: ట్రంప్



వాషింగ్టన్: అమెరికాలోకి అక్రమ వలసలను నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. అమెరికాకు రావాలనుకుంటున్న వలసదారులకు ప్రతిభ ఆధారంగానే ప్రవేశం ఉంటుందని తెలిపారు. అమెరికాలో ఉంటున్న ప్రవాసీయులు కుటుంబ సభ్యులను చాలా సులభంగా ఇక్కడి తీసుకొస్తున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. ట్రంప్ అధికార నివాసం వైట్‌హౌస్‌లో చట్టసభ సభ్యులతో ఆయన మాట్లాడుతూ మెక్సికో సరిహద్దు వెంట కూడా అక్రమ వలసలు పెరుగుతున్నాయని గుర్తుచేశారు. వీసాల మంజూరుకు ప్రస్తుతం అనుసరిస్తున్న లాటరీ విధానానికి కూడా చమరగీతం పాడాలని సూచించారు.

గత ఏడాది 138 మంది పాక్ సైనికులు హతం

న్యూఢిల్లీ: గత ఏడాది జమ్ము కశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి భారత సైన్యం జరిపిన ప్రతీకార దాడుల్లో 138 మంది పాకిస్థాన్ సైనికులు హతమయ్యారని ప్రభుత్వ నిఘా వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఈ క్రమంలో భారత్‌కూడా 28 మంది సైనికులను కోల్పోయిందని పేర్కొన్నాయి. పాక్ సాధారణంగా తమ సైనికుల మరణాలను ధ్రువీకరించదని, వారిని సామాన్య పౌరులు చూపేందుకు ప్రయత్నిస్తుందని వర్గాలు తెలిపాయి. గత ఏడాది పాక్ సైన్యం 860 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, దీంతో భారత సైన్యం దీటుగా జవాబు చెప్పిందని పేర్కొన్నాయి. పాక్ సైన్యం కాల్పుల్లో 70 మంది భారత సైనికులు గాయపడ్డారని తెలిపాయి.

నేడు ఎన్ఐవోఎస్ అవగాహన తరగతులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్ఐవోఎస్) స్టడీ సెంటర్ల కోఆర్డినేటర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన తరగతులను నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. ఇందుకోసం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు డీఈవోలు అందుబాటులో ఉండాలని కోరారు. వీడియోకాన్ఫరెన్స్‌లో ఎన్ఐవోఎస్ ప్రాంతీయ డైరెక్టర్ అనిల్‌కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు.



బుధవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎంతో జరిగిన సమావేశానికి హాజరైన ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, నంది ఎల్లయ్య, కే కేశవరావు, జితేందర్‌రెడ్డి, సీతారాంనాయక్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీబీ పాటిల్, పసునూరి దయాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి. (ఇన్‌సెట్) దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ తదితరులు

కొత్త రైల్వే ప్రాజెక్టులు పూర్తిచేయండి

మొదటిపేజీ తరువాయి...

జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు భూసేకరణ పూర్తయిందని, త్వరలో కరీంనగర్ వరకు భూసేకరణ చేస్తామని చెప్పారు. భూ సేకరణ పూర్తి వ్యయాన్ని తెలంగాణ ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. మనోహరాబాద్- కొత్తపల్లి లైన్ తెలంగాణ ప్రభుత్వ కలల ప్రాజెక్టు అన్నారు. చర్లపల్లి, నాగులపల్లిలో పెద్ద రైల్వేస్టేషన్లు ఏర్పాటుచేయాలని, దానికి రాష్ట్ర ప్రభుత్వం సాయం చేస్తుందని చెప్పారు. కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9 ప్రకారంగా రెండు రాష్ట్రాలకు జాతీయ రహదారులు, రైల్వేలైన్లు విస్తరించాల్సి ఉందని గుర్తుచేశారు. కరీంనగర్-హుజూరాబాద్‌మీదుగా కాజీపేటకు కొత్త రైల్వేలైన్‌కు సర్వే పూర్తయిందని అన్నారు అలాగే ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్‌కు రైల్వేలైన్ ఏర్పాటుచేయాలని కోరారు.

వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ విస్తరించాలి: ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి
ఎంఎంటీఎస్‌ను వికారాబాద్ వరకు విస్తరించాలని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో రద్దీని తగ్గించేందుకు వికారాబాద్, శంకర్‌పల్లి, లింగంపల్లిలో రైళ్లను ఆపాలన్నారు. స్టేషన్లలో వసతులు కల్పించాలని కోరారు. అవసరమైనచోట ఎక్స్‌ప్రెస్‌రైళ్ల హాల్టింగ్ కోసం చర్యలు తీసుకోవాలన్నారు.

జీఎం వినడం తప్ప ఏమీ చేయరు: ఎంపీ సీతారాంనాయక్
దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ ఎంపీలు చెప్పినవి వినడం తప్ప ఏమీ చేయరని ఎంపీ సీతారాంనాయక్ అసహనం వ్యక్తంచేశారు. కనీసం చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని విమర్శించారు. రైల్వేలైన్ల ఏర్పాటులో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. భద్రాచలం-కొవ్వూరు రైల్వేలైన్ ప్రతిపాదనల్లో ఉందన్నారు. రైల్వేస్టేషన్లలో టాయిలెట్లను పే అండ్ యూజ్ పద్ధతిన ఏర్పాటు చేయడం సరైంది కాదని అన్నారు.

సమావేశాలు తంతుగా మారొద్దు: ఎంపీ బూర నర్సయ్యగౌడ్
ఎంపీలతో సమావేశాలు నిర్వహించడం ఒక తంతుగా కాకుండా జీఎంకు కొన్ని అధికారాలిస్తే బాగుంటుందని ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. 'ఎంపీలు చెప్పింది నోట్ చేసుకున్నాం, బోర్డుకు పంపిస్తాం' అంటూ సమాధానమిస్తే ఇక ఎంపీలు ఎందుకు? అంటూ ప్రశ్నించారు. మనోహరాబాద్-కొత్తపల్లి, భద్రాచలం-సత్తుపల్లి, సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనుల్లో వేగం పెంచాలన్నారు. జనగామలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌ను భువనగిరినుంచి జనగామ వరకు పొడిగించాలని కోరారు.

అధిక ఆదాయమిస్తున్నా సౌకర్యాలు కల్పించండి: ఎంపీ బాల్క సుమన్
పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంనుంచి రైల్వేకి అధిక మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చుతున్నామని, అందుకు తగిన విధంగా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని ఎంపీ బాల్క సుమన్ డిమాండ్‌చేశారు. కోల్‌బెల్ట్ ఏరియా విస్తరించడం, ఎన్టీపీసీ, సిమెంట్ కంపెనీలు, ఎఫ్‌సీఐ వంటివి ఉండటంవల్ల రైల్వేకి భారీగా ఆదాయం వస్తున్నదని తెలిపారు. అయితే ఈ ప్రాంతానికి రైల్వే వసతులు కల్పించే విషయమై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ స్థలం కోసం కొంత టెక్నికల్ ఇబ్బందులు ఉన్నాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. మంచిర్యాలలో పెద్ద ఆర్వోబీ, బెల్లంపల్లిలో ఆర్‌యూబీ నిర్మించాలని కోరారు. ఎండాకాలంలో మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలి: ఎంపీ దయాకర్
కాజీపేటలో రైల్వే వ్యాగన్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటుచేయాలని ఎంపీ పసునూరి దయాకర్ కోరారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌కు రైల్వే కేటాయింపుల్లో ప్రాధాన్యం పెరుగాలన్నారు. రైల్వే హాస్పిటల్, స్టేడియం పునరుద్ధరణ, పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ పెంపు వంటివాటిపై దృష్టిపెట్టాలన్నారు. నిత్యం వరంగల్‌నుంచి 4000 మంది హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఎక్స్‌ప్రెస్ రైళ్లు పెంచాలన్నారు.

కామారెడ్డి-జహీరాబాద్ ఆర్వోబీ నిర్మించాలి: ఎంపీ బీబీ పాటిల్
కామారెడ్డి-జహీరాబాద్ రైల్వేలైన్‌పై ఆర్వోబీ నిర్మించాలని ఎంపీ బీబీ పాటిల్ కోరారు. బోధన్-బీదర్ రైల్వేలైన్ల పనులు, జహీరాబాద్- సికింద్రాబాద్ లైన్‌పై ప్రతిపాదనలు చేశామని తెలిపారు.

సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనుల వేగం పెంచాలి: ఎంపీ జితేందర్‌రెడ్డి

సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ రైల్వేలైన్ డబ్లింగ్ పనులు వేగవంతం చేయాలని ఎంపీ జితేందర్‌రెడ్డి కోరారు. ఎలక్ట్రికల్ పనులు పూర్తిచేసి, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను నడుపాలని సూచించారు. ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణంలో శ్రద్ధ వహించాలని కోరారు. స్టేషన్లలో ప్రయాణికులకు వసతులు కల్పించి, ప్లాట్‌ఫారంలను పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. పెండింగ్‌లో ఉన్న మహబూబ్‌నగర్-మునీరాబాద్ రైల్వేలైన్‌పై చర్చించామని జితేందర్‌రెడ్డి తెలిపారు.

సమస్యల పరిష్కారంలో వెనుకంజ: ఎంపీ గుత్తా

దక్షిణ మధ్య రైల్వేకు ఆదాయం గణనీయంగా ఉన్నా, సమస్యల పరిష్కారంలో వెనుకంజలో ఉందని ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి మండిపడ్డారు. 1997లో నల్లగొండ-మాచర్ల 81 కిలోమీటర్ల మార్గం మంజూరైందని, 20 ఏండ్లు అవుతున్నా పనులు ప్రారంభం కాలేదని అన్నారు. ఈ ప్రాజెక్టును కేంద్రం హోల్డ్‌లో పెట్టిందన్నారు. పగిడిపల్లి- నల్లపాడు డబ్లింగ్ కోసం అడిగితే కేంద్రం పట్టించుకోలేదన్నారు. చిన్నచిన్న సమస్యలను కూడా జీఎంకు చెప్పాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎంపీల సమావేశాలకు రైల్వేబోర్డు చైర్మన్లు, సభ్యులు హాజరు కావాలని సూచించారు.

బొల్లారంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను రిక్వెస్ట్ స్టాప్ కింద ఆపాలని కోరారు.

స్టేషన్లలో వసతులు కల్పించాలి: ఎంపీ సీహెచ్ మల్లారెడ్డి
రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎంపీ మల్లారెడ్డి డిమాండ్‌చేశారు. పెద్ద పెద్ద రైల్వే స్టేషన్లలో పరిశుభ్రతను పాటించినట్లుగానే చిన్నచిన్న స్టేషన్లలో కూడా స్వచ్ఛ్ రైల్వే కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. హైదరాబాద్‌కు వచ్చే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు శివారు ప్రాంతాల్లో ఉన్న స్టేషన్లలో నిలిపితే రద్దీ తగ్గుతుందని సూచించారు.

ఎంఎంటీఎస్ ఫేజ్-2ను త్వరగా పూర్తిచేయాలి : ఎంపీ దత్తాత్రేయ
2007లో పూర్తికావాల్సిన ఎంఎంటీఎస్ ఫేజ్-2లో నిర్లక్ష్యం జరుగుతున్నదని ఎంపీ దత్తాత్రేయ అన్నారు. సికింద్రాబాద్ నుంచి 240 రైళ్లలో రోజుకు 1.70 లక్షల ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నందున దీనిని వరల్డ్ క్లాస్ రైల్వేస్టేషన్‌గా చేయాలన్నారు. ముంబై, తిరుపతి, చెన్నైలకు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను నడుపాలని కోరారు. సమావేశంలో ఎంపీలు కే కేశవరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, వీ లక్ష్మీకాంతారావు, మహ్మద్ అలీఖాన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నంది ఎల్లయ్య, రాపోలు ఆనంద్ భాస్కర్‌రులు పాల్గొన్నారు.

డిసెంబర్‌కు ఎంఎంటీఎస్ ఫేజ్-2 పూర్తి

100 కోట్లు విడుదల చేసిన తెలంగాణ సర్కార్ ● దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్

ఎంఎంటీఎస్ ఫేజ్-2ను ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తిచేస్తామని దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం తెలంగాణ సర్కార్ ఇటీవలే రూ.100 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. బుధవారం ఎంపీలతో సమావేశం తర్వాత జీఎం మీడియాతో మాట్లాడారు. ఎంపీలు చెప్పిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేగం, సమయపాలన వల్ల అన్ని స్టేషన్లలో వాటిని ఆపడం సాధ్యపడదన్నారు. రైల్వేలైన్లపై అవసరమైన చోట ఆర్వోబీలు, ఆర్‌యూబీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటికి ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. ఇప్పటికే 100 ఆర్వోబీలను రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు. కొత్త రైల్వేలైన్లు, కొత్త రైళ్ల ఏర్పాటువంటి వాటిపై ఎంపీలు ప్రతిపాదనలు చేశారని చెప్పారు. తెలంగాణ పరిధిలో ఇప్పటికే పలు కొత్త రైల్వే పనులు వేగంగా నడుస్తున్నాయని తెలిపారు. భద్రాచలం-సత్తుపల్లి పనులు వచ్చే ఏడాది నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ స్థలానికి సంబంధించి పెండింగ్ పనులున్నాయని, అవి పూర్తికాగానే పనులు చేపడుతామని తెలిపారు. చర్లపల్లి టెర్మినల్‌కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూమిని కోరినట్లు చెప్పారు.

చెక్కుల రూపంలోనే!

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయానికి మంత్రివర్గ ఉపసంఘం వచ్చింది. రైతులకు ఇచ్చే చెక్కులను వారు ఏ బ్యాంకులో వేసినా చెల్లుబాటు అయ్యేలా ఇవ్వాలని, చెక్కు తారుమారు కాకుండా దాని వెనుక సంబంధిత రైతు ఆధార్ నంబర్‌ను రాయాలని ఉపసంఘం అభిప్రాయపడింది. పెట్టుబడిసాయం అందించేందుకు మార్గదర్శకాలను రూపొందించే సమయంలో పకడ్బందీగా వ్యవహరించాలని మంత్రులు అభిప్రాయపడ్డారు. రైతులకు చెక్కులు ఇచ్చిన వెం టనే బ్యాంకుల నుంచి నగదు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. బ్యాంకులకు నగదు సరఫరా విషయాన్ని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ నేతృత్వంలో ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి, రిజర్వ్‌బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో చర్చించిన అంశాలన్నింటినీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు నివేదిక రూపంలో ఉపసంఘం అందజేయనున్నది. సీఎం నిర్ణయం అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నారు. యాసంగి సీజన్ మార్గదర్శకాలపై వానకాలం సీజన్ పెట్టుబడి సాయం పంపిణీ ముగిసిన అనంతరం సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ఆధార్ నంబర్‌తో పకడ్బందీ అమలు
గ్రామాల్లో ఒకే పేరు, ఒకే ఇంటిపేరుతో అనేకమంది ఉండే అవకాశాలున్నాయి. దీంతో చెక్కుల పంపిణీ సమయంలో ఒకరి చెక్కు మరొకరికి వెళ్లే అవకాశాలున్నాయి. రైతుకిచ్చే చెక్కు వెనుక లబ్ధిదారుడి ఆధార్ నంబర్ వేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

వ్యవసాయయోగ్యమైన భూములకే పెట్టుబడి సాయం
రాష్ట్రంలోని రైతులందరికీ ఎకరానికి రూ.4000 పెట్టుబడి అందించడం ద్వారా వారిని వ్యవసాయం చేయడానికి ప్రోత్సహించవచ్చని, నిరుపయోగమైన భూమి సాగులోకి వస్తుందని సీఎం కేసీఆర్ భావించారు. కానీ ఏండ్ల తరబడి రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యంకాని భూములు కొన్ని జిల్లాల్లో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఇలాంటి భూములకు పెట్టుబడి వ్యయం ఇవ్వడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయనే అభిప్రాయం వ్యక్తమైంది. మార్గదర్శకాలను రూపొందించే సమయంలో ఇలాంటి భూములను పెట్టుబడి సాయం పథకం నుంచి తొలిగిస్తే ఎలా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైంది.

పెద్ద రైతులకు పెట్టుబడి సాయంపై చర్చ
పెట్టుబడి పథకం అమలులో పెద్ద రైతులపట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే అంశంపై కూడా మం త్రులు చర్చించారు. 25 ఎకరాలకు పైగా పట్టా భూములున్న పెద్ద రైతులకు పెట్టుబడి సాయం పథకం వర్తింపచేస్తే గ్రామాల్లోని చిన్న, సన్నకారు రైతుల్లో తప్పుడు అభిప్రాయం నెలకొనే ప్రమాదం ఉంటుందని మంత్రులు అభిప్రాయపడ్డారు. పెద్ద భూస్వాములు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్, వ్యాపారులు తదితరులు స్వచ్ఛందంగా పెట్టుబడి సాయాన్ని వదులుకుంటే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని చర్చించారని తెలుస్తున్నది.

సమస్యాత్మక గ్రామాల్లో పోస్టాఫీసులలో ఖాతాలు
బ్యాంకు సౌకర్యం లేని సమస్యాత్మక ప్రాంతాల్లోని రైతులకు నగదు రూపంలో పెట్టుబడి సాయం అందిస్తే ఎలా ఉంటుందని కొందరు మంత్రులు ప్రస్తావించారు. ఇటువంటిచోట్ల పెద్దమొత్తంలో నగదు అధికారుల వద్ద ఉంటే భద్రతాపర ఇబ్బందులు తలెత్తుతాయన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఇలాంటి ప్రాంతాల్లోని రైతులకు పోస్టాఫీసులలో ఖాతాలు తెరిపించి, చెక్కులను మార్చుకునే అవకాశం కల్పించడం శ్రేయస్కరమని అభిప్రాయపడినట్లు తెలిసింది.

గ్రామసభల్లో చెక్కుల పంపిణీ
పెట్టుబడి సాయం పథకం కింద రైతులకు చెక్కులను గ్రామసభలు నిర్వహించి, పండుగ వాతావరణంలో పంపిణీ చేయనున్నారు. గ్రామసభ సమక్షంలో రైతులందరికీ చెక్కులు ఇవ్వడం ద్వారా వారికి భరోసా లభించనుంది.

రికార్డు స్థాయిలో అభిప్రాయ సేకరణ

పంట పెట్టుబడి సహకారాన్ని ఏ రూపంలో అందిస్తే బాగుంటుందనే అంశంపై మంగళవారం ఒక్క రోజు వ్యవసాయశాఖ రికార్డుస్థాయిలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. వ్యవసాయాధికారులు చేసిన కృషిని మంత్రివర్గ ఉపసంఘ సమావేశం అభినందించింది. రైతుల అభిప్రాయాలను వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి బుధవారం వెల్లడించారు. ఇవీ ఆ వివరాలు..

- చెక్కు రూపేణా పెట్టుబడి ఇవ్వాలని 31.58% మంది రైతులు అభిప్రాయపడ్డారు. మేడ్చల్‌లో 63.8%, నిజామాబాద్‌లో 57.1%, ఆదిలాబాద్‌లో 50%, కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, సంగారెడ్డి, సిద్దిపేట, భద్రాద్రి- కొత్తగూడెం జిల్లాల్లో 40 శాతానికి పైగా రైతులు ఇలా కోరారు.
- బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి జమచేయాలని 27.55% రైతులు అభిప్రాయపడ్డారు. వరంగల్ అర్బన్‌లో 81.55%, రాజన్న సిరిసిల్ల 62.38%, వరంగల్ రూరల్ 49%, జనగామ 44.94%, నిర్మల్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, మెదక్, నల్లగొండ, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో 30% ఈ మేరకు కోరారు.
- పెట్టుబడిని నగదు రూపంలో ఇవ్వాలని 26.59% రైతులు అభిప్రాయం వ్యక్తంచేశారు.
- పోస్టాఫీసుల ద్వారా ఇవ్వాలని 6.81% మంది, ప్రీ లోడెడ్ కార్డ్/సహకార విలువకు సమానమైన కార్డుల రూపంలో చెల్లించాలని 6.44% రైతులు అభిప్రాయపడ్డారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పెట్టుబడి ఇవ్వాలని 1.03% మంది, సూచించిన ఆరు పద్ధతుల్లో దాదాపు 60% రైతులు సాగుకు పెట్టుబడి సహకారాన్ని చెక్కు రూపంలో లేదా బ్యాంకు ఖాతాల్లో జమచేయడానికి మొగ్గు చూపారు.

చెక్కులే కోరుతున్నారు

551 మండలాల్లోని 626 గ్రామాల్లో 62,371 మంది రైతుల అభిప్రాయాల సేకరణ

అక్రమాలకు తావులేకుండా పంట పెట్టుబడి ● తుది నివేదికను సీఎంకు సమర్పిస్తాం

వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రైతులకు పంట పెట్టుబడి పథకాన్ని ఎలాంటి అవకతవకలు జరుగకుండా అమలుచేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పునరుద్ఘాటించారు. పెట్టుబడి కింద ఇచ్చే రూ.4 వేలను చెక్కుల రూపంలో అందించాలని ఎక్కువమంది రైతులు కోరుతున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో ఈ ఏడాది వానకాలం సీజన్ నుంచి రైతులకు ఎకరాకు రూ.4వేలు ఆర్థిక సాయం పథకంపై మంత్రి పోచారం అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం సచివాలయంలో సమావేశమైంది. అనంతరం మంత్రి పోచారం వివరాలను మీడియాకు వెల్లడించారు. రైతులకు పెట్టుబడి మద్దతు చెల్లింపు విధివిధానాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు రాష్ట్రంలోని 551 మం డలాల్లోని 626 గ్రామాల్లో 62,371 మంది రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించామని చెప్పారు. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన తర్వాత క్యాటగిరీ ఏ కింద రాష్ట్రం లో 71.75 లక్షల రైతు ఖాతాలు ఉన్నట్లు గుర్తించామని, సాగులో ఉన్న భూమి 1.42 కోట్ల ఎకరాలు ఉన్నాయని తెలిపారు. ఇన్ని ఎకరాల వరకే పెట్టుబడి ఇవ్వాలనే కటాఫ్ ఆలోచన ప్రభుత్వానికి ఇప్పటివరకు లేదని తెలిపారు. 92.7% రైతులకు 10 ఎకరాల లోపు భూమి ఉందని, 0.28 మంది రైతులకు మాత్రమే 20 ఎకరాలకు పైగా భూమి ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఈ పథకానికి ఏటా ఐదారు వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అన్నారు. తుది నివేదికను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు సమర్పిస్తామని మంత్రి పోచారం వెల్లడించారు. సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డితోపాటు ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, వ్యవసాయ శాఖ కార్యదర్శి సీ పార్థసారథి, కమిషనర్ ఎం జగన్మోహన్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణ, టీఎస్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఎస్సెల్బీసీ కన్వీనర్ మణికందన్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ సీజీఎం ఎలీషా, ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
గురువారం 11 జనవరి 2018
WWW. NTNEWS.COM


వాకిళ్ల ముందు అందమైన ముగ్గులు.. తొలిపొద్దునే హరిదాసు కీర్తనలు.. గంగిరెద్దుల ఆటలతో సంక్రాంతి శోభ రెట్టింపవుతుంది.. వీటితో పాటు అప్పాల ఘుమఘుమలు లేకపోతే.. ఆ ఇల్లు వెలవెలబోయినట్టే ఉంటుంది.. సంక్రాంతి పండుగ పూట పాడిపంటలు నిండుగా పండినట్టే.. ఇంట్లో కరకరలాడే పిండి వంటలు లేకపోతే ఎలా? అందుకే ఈ పండుగపూట.. అప్పాలను అందరూ కలిసి ఆరగించండి.

పండగపూట అప్పాల ఘుమఘుమలు





సంజయ్ తుమ్మ
సెలబ్రిటీ చెఫ్



మిక్స్‌డ్ వెజిటెబుల్ గారెలు



కావాల్సినవి :

బియ్యం పిండి : ఒక కప్పు, , **శనగపిండి** : ఒక టేబుల్ స్పూన్, **అల్లం** : చిన్న ముక్క , **జీలకర్ర** : ఒక టీస్పూన్ , **పచ్చి మిర్చి** : ఒక టేబుల్‌స్పూన్ , **బటర్** : ఒక టీస్పూన్, **ఉల్లి ఆకు** : 2 టేబుల్‌స్పూన్స్ (తరిగినవి) , **క్యారెట్ ముక్కలు** : 2 టేబుల్‌స్పూన్స్ , **బీన్స్ ముక్కలు** : ఒక టేబుల్‌స్పూన్, **పల్లీలు** : 2 టేబుల్‌స్పూన్స్ , **సగ్గుబియ్యం** : ఒక కప్పు **నూనె, ఉప్పు** : తగినంత

తయారీ :

స్టెప్ 1 : ఒక గిన్నెలో బియ్యంపిండి, అల్లం, శనగ పిండి, జీలకర్ర, పచ్చిమిర్చి పేస్ట్, బటర్ వేసి బాగా కలుపుకోవాలి.
స్టెప్ 2 : ఇందులోనే ఉల్లి ఆకు, క్యారెట్స్, బీన్స్, పల్లీలు, సగ్గుబియ్యం, ఉప్పు వేసి కొన్ని వేడి నీళ్లు పోసి పిండి కలుపాలి.
స్టెప్ 3 : కలిపేటప్పుడు పిండి ఉండలు కట్టకుండా చూసుకోవాలి. ఆ తర్వాత ఈ పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి పెట్టుకోవాలి.
స్టెప్ 4 : ఇప్పుడు ఆ ముద్దలను చేతితోనే కాస్త ఒత్తుకోవాలి. ఇలా ఉండలన్నీ చేసి పక్కన పెట్టాలి.
స్టెప్ 5 : కడాయిలో నూనె పోసి ఈ పిండి ముద్దలను వేయించుకోవాలి. కరకరలాడే మిక్స్‌డ్ వెజిటెబుల్ గారెలు రెడీ!

సకినాలు

కావాల్సినవి : కొత్త బియ్యం : ఒక కప్పు, **ఓమా** : ఒక టేబుల్ స్పూన్, **నువ్వులు** : పావు కప్పు, నూనె, **ఉప్పు** : తగినంత

తయారీ :

స్టెప్ 1 : కొత్త బియ్యాన్ని కడిగి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం లేచాక నీళ్లు వడకట్టి కాసేపు బియ్యాన్ని ఆరనివ్వాలి. ఆ తర్వాత మెత్తగా పొడి చేసుకోవాలి.
స్టెప్ 2 : ఈ పిండిని ఒక గిన్నెలో వేసి ఓమా, నువ్వులు, ఉప్పు కొన్ని నీళ్లు పోసి ఉండలు కట్టకుండా కలుపుకోవాలి. ఈ మిశ్రమం మరీ వదులు కాకుండా, గట్టిగా కాకుండా కలుపుకోవాల్సి ఉంటుంది.
స్టెప్ 3 : కాసేపు అలా ఉంచాలి. కాటన్ వస్త్రాన్ని పరిచి.. కొద్దికొద్దిగా పిండిని చేతిలోకి తీసుకొని గుండ్రంగా చుట్టాలి. ఇలా మొత్తం పిండిని చేసుకోవాలి.
స్టెప్ 4 : ఇప్పుడు కడాయిలో నూనె పోసి నూనె బాగా వేడెక్కాక విరిగిపోకుండా ఒక్కో దాన్ని తీసి నూనెలో వేయించుకోవాలి. వీటికి వెల్లుల్లి కారంపొడిలో అద్దుకొని తింటే ఆ టేస్టే వేరు.



అరిసెలు



కావాల్సినవి :

బియ్యం : 500 గ్రా, **బెల్లం** : 350 గ్రా.
నువ్వులు : 3 టేబుల్‌స్పూన్స్, **నెయ్యి** : ఒక టీస్పూన్
నూనె : తగినంత

తయారీ :

స్టెప్ 1 : బియ్యాన్ని కడిగి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం ఒక కాటన్ వస్త్రంలో వేసి వడకట్టాలి. కాసేపు ఈ బియ్యాన్ని ఆరబోసి ఆ తర్వాత పిండి పట్టాలి.
స్టెప్ 2 : ఒక గిన్నెలో బెల్లం, కొన్ని నీళ్లు పోసి చిక్కటి పాకం పట్టుకోవాలి.
స్టెప్ 3 : దీన్ని పొయ్యి మీద నుంచి దించి అందులో నువ్వులు, నెయ్యి వేసి కలుపాలి. ఆ తర్వాత బియ్యం పిం డి కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు కట్టకుండా కలుపుకోవాలి.
స్టెప్ 4 : ఈ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకొని పాలిథిన్ కవర్ మీద ఒత్తి ఉంచాలి.
స్టెప్ 5 : ఇప్పుడు కడాయిలో నూనె పోసి ఒక్కో అరిసెని డీప్ ఫ్రై అయ్యేవరకు కాల్చుకోవాలి. కావాలనుకుంటే కొన్ని నువ్వులను పై నుంచి చల్లుకుంటే మరింత టేస్టీగా ఉంటాయి.



గోధుమ పిండి పూస

కావాల్సినవి :

గోధుమపిండి : ఒక కప్పు
శనగపిండి : 2 టేబుల్‌స్పూన్స్
ఇంగువ : చిటికెడు
ఓమా : పావు టీస్పూన్
కారం : ఒక టీస్పూన్
నూనె, ఉప్పు : తగినంత

తయారీ :

స్టెప్ 1 : ఒక గిన్నెలో గోధుమపిండి, శనగ పిండి,
ఇంగువ, ఓమా, కారం, ఉప్పు వేసి కలుపాలి.
స్టెప్ 2 : దీంట్లో కొన్ని నీళ్లు పోసి ఉండలు కట్టకుండా కలుపుకోవాలి. దీన్ని కొద్దికొద్దిగా పిండి తీసి పక్కన పెట్టాలి.
స్టెప్ 3 : కడాయిలో నూనె పోసి బాగా వేడి చేయాలి. ఇప్పుడు మురుకుల ప్రెస్‌లో పిండి పెట్టి ప్రెస్ చేయాలి.
స్టెప్ 4 : వీటిని మరుగుతున్న నూనెలో వేసి దొరగా వేయించాలి.

అడుగండి చెబుతా

ఇది నిజంగా సమస్యా?



మా ఆవిడ వయసు 38 సంవత్సరాలు. ఆమె ఒక కార్పొరేట్ కంపెనీలో పనిచేస్తుంది. అయితే ఆమె పిల్లల కోసం ఇంటి నుంచే పనిచేస్తుంది. తరచుగా ఫోన్లు మాట్లాడడం, ఫోన్ చూసుకోవడం, మెసేజ్‌ల అప్‌డేట్స్ చూసుకోవడం వృత్తిరీత్యా ఆమెకు తప్పనిసరి. అందువల్ల అది ఆమెకు నిత్యకృత్యం అయిపోయింది. ఎప్పుడైనా ఫోన్ చూడలేకపోతే చాలా కంగారు పడిపోతున్నది. ఎప్పుడైనా ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందంటే చాలు ఇక ఏ పని మీద దృష్టి నిలుపలేకపోతుంది. అసహనం, చిరాకు పడడం ఎక్కువ అవుతుంది. ఈ మధ్య ఆమె చాలా అన్యమనస్కంగా ఉంటున్నట్టు అనిపిస్తున్నది. పెద్దగా కుటుంబంతో కలిసి ఉన్నట్టు కనిపించడం లేదు. పిల్లల మీద కూడా చాలా చిరాకు పడుతున్నది. ఒకరకంగా చెప్పాలంటే మానసికంగా తన స్థితి బాలేనట్టు అనిపిస్తున్నది. నిజంగా ఆమెకు ఏదైనా సమస్యా? అడిక్షన్‌గా మారుతుందా? ఆమెకు ఎలాంటి సహాయం అవసరం. దయచేసి తెలుపగలరు.

- అరవింద్, హైదరాబాద్

కొన్ని సంవత్సరాలుగా కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఈమెయిల్స్, మెసేజ్‌లు, వాట్సప్ వంటివన్నీ అందరికీ అందుబాటులోకి వచ్చాయి. అందువల్ల నిజానికి పనుల్లో ఒత్తిడి చాలా పెరిగిపోయిందని చెప్పాలి. అంతకు ముందు కమ్యూనికేషన్‌లో కొద్ది పాటి సమయం ఉండడం వల్ల కొంత పని తక్కువగా ఉండేది. లేదా కొన్ని పనులు తప్పించుకునే వీలుండేది. ఇప్పుడు అటువంటి అవకాశమే లేకుండా పోయింది. కమ్యూనికేషన్‌కు కనీసం నిమిషాల వ్యవధి కూడా ఉండడం లేదు. అనుకున్నదే తడవుగా సమాచారం అవతలి వైపు నుంచి వచ్చేస్తుంది. ఒక్కోసారి అనుకోకుండానూ వచ్చేస్తున్నది. ఈ వేగాన్ని అందుకోవడంలో తప్పనిసరిగా ఒత్తిడి పెరుగుతున్నది. నిజానికి ఇది కొత్త ఆరోగ్య సమస్యలకు కారణం అవుతున్నదనే చెప్పుకోవాలి. ఇది మనకు సంబంధించిన విషయం మాత్రమే కాదు ఒకే వ్యక్తి రకరకాల గ్రూప్‌లలో సభ్యులుగా ఉండడం వల్ల ఇతరుల పనితీరు, వారి ప్రదర్శనా సామర్థ్యం వంటి ఎప్పటికప్పుడు తెలిసిపోవడం వల్ల పోటి పెరిగి ఒత్తిడి కూడా పెరుగుతున్నది. ఒకవేళ ఈ కమ్యూనికేషన్ దూరమైతే ఏం జరుగుతుందో తెలియక పోవడం వల్ల తాము వెనుకబడిపోతామన్న భయం కలుగుతుంది. వెరసి ఇవన్నీ ఆందోళనకు దారితీస్తున్నాయి. ఇది క్రమంగా డిప్రెషన్‌గా కూడా మారవచ్చు. ఇలాంటివన్నీ కచ్చితంగా వారి సామర్థ్యాన్ని దెబ్బ తీస్తాయి. ఇది మానసిక సమస్యగా మారక ముందే మేల్కొనాల్సిన అవసరం ఉంది.

ఇలా ఎప్పుడూ ఫోన్ చూస్తు ఉండడం వల్ల వారు తమ సోషల్ లైఫ్, ఫ్యామిలీ లైఫ్‌ను చాలా వరకు సరిగ్గా ఆనందించలేని స్థితికి వస్తారు. ఇది కూడా తిరిగి ఒత్తిడికే కారణమవుతుంది. కానీ కమ్యూనికేషన్‌కు పూర్తిగా దూరంగా ఉండడం సాధ్యపడదు. కనుక వీటిని చూసేందుకు కొంత సమయానికి మాత్రమే పరిమితం కావడం మంచిది. ప్రతి ఒక్క మెసేజ్‌ని చూడడం చదవడం వంటి అలవాటును క్రమంగా మానుకోవాలి. కేవలం ముఖ్యమైన మెసేజ్‌లకు మాత్రమే పరిమితం కావాలి. సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లను వారంలో ఒకరోజు మాత్రమే చూడాలన్న నియమం పెట్టుకుంటే మంచిది. వీలైనన్ని తక్కువ గ్రూప్‌లలో మాత్రమే సభ్యత్వం కలిగి ఉండడం వల్ల కూడా కొంత ఒత్తిడి తగ్గుతుంది. ఇక వృత్తికి సంబంధించిన మెసేజ్‌లను తప్పనిసరిగా ఆఫీస్ సమయంలో మాత్రమే చూడడం వాటికి స్పందించడం నియమంగా ఉంచుకోవాలి. ఆ విషయాన్ని అందరికి స్పష్టంగా చెప్పాలి. ఆఫీసు సమయం తర్వాత అటువంటి మెసేజ్‌లు పంపకూడదన్న ధోరణి అనుసరించడం తప్పనిసరి. ఇలాంటి కొన్ని నియమాలు పాటించడం వల్ల ఒత్తిడికి దూరంగా ఉండవచ్చు. మీరు ఈ విషయంలో మీ శ్రీమతికి తోడుగా నిలవడం ముఖ్యం. సరైన సూచనలు ఇచ్చి పాటించేలా చూడండి. అయినప్పటికీ ఆమెలో మార్పు కనిపించకపోతే నిపుణుల సహాయం తీసుకోవడానికి వెనుకాడకూడదు.



డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్
అపోలో హాస్పిటల్స్
హైదరాబాద్

కరకరలాడేలా..




- నెయ్యి త్వరగా పేరుకుపోకుండా ఉండాలంటే మీగడ కట్టేటప్పుడు కొద్దిగా నీళ్లు చల్లాలి.
- ఎక్కువ వెల్లుల్లి పాయలు పొట్టు తీయాలంటే వెల్లుల్లిపాయల్ని ఐదు నిమిషాల పాటు గోరువెచ్చని నీటిలో నానబెట్టి, పొడిబట్టతో తుడిస్తే పొట్టు సులభంగా వచ్చేస్తుంది.
- అల్లం ముక్కలు ఎండబెట్టి టీలో వేస్తే టీ రుచికరంగా ఉంటుంది.
- పూరీలు చేసేటప్పుడు తెల్లగా రావాలంటే.. వేడి నూనెలో నాలుగైదు జామ ఆకులు వేస్తే సరి.
- మురుకులు, పకోడి లాంటివి చేసేటప్పుడు కొద్దిగా పిండిలో కొద్దిగా పాలు పోసి పిండి కలపాలి. ఆ తర్వాత ఉప్పు వేయాలి. అప్పుడు మురుకులు, పకోడి కరకరలాడుతాయి.

సిరిముగ్గు



కె. విజయలక్ష్మి
జి కొత్తపల్లి,
అనంతపురం

27 చుక్కలు 9 వరుసలు 9 వచ్చే వరకు



మా చిరునామా:
సిరి ముగ్గు,
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం - 10,
హైదరాబాద్ - 500034.
zindagi@ntdaily.news,
zindagi.nt@gmail.com

నమస్తే తెలంగాణ

విందు

[హైదరాబాద్]
గురువారం 11 జనవరి 2018

[హైదరాబాద్]
బుధవారం 6 డిసెంబర్ 2017

ఆమె ముద్దు పేరు 'ఆలూ..'. వాళ్ల అమ్మ బాగా చేసే కూర ఆలూ ఫ్రై. ఇలా వాళ్లింట్లో తరతరాలుగా ఆలూకి ఫ్యాన్స్ ఉన్నారట. ఆ ముద్దు పేరు సొంతం చేసుకున్న నటి ఆలియాభట్. ఈ బాలీవుడ్ ముద్దుగుమ్మ ఆహారపు అలవాట్లు, అభిరుచులు ఇవి.

అమ్మలా ఎవరూ చేయలేరు!

ఒకప్పుడు నేను చాలా బొద్దుగా ఉండేదాన్ని. హీరోయిన్ అవ్వడంతో ఇలా సన్నబడ్డాను. ఎప్పుడూ డైట్ ఫాలో అయినా కొన్నిసార్లు మాత్రం చాట్ విషయంలో తప్పుతాను. నాకు మా ఇంటి దగ్గర దొరికే బేల్‌పురి, సేవ్‌పురి చాలా ఇష్టం. కాలేజ్‌లో ఉన్నప్పుడు అక్కడే తినేదాన్ని. ఇప్పుడు మాత్రం ప్యాక్ చేయించుకొని ఇంట్లో తింటున్నా. ఇక షూటింగ్‌కి వెళితే నా డబ్బా సపరేట్‌గా ఇంటి నుంచే పట్టుకెళ్తా. అందులో కోడిగుడ్డు, పండ్లు, చికెన్, కొన్ని పచ్చి కూరగాయలను తీసుకెళతా. ఇక మా ఇంట్లో అమ్మ చేసే ఆలూ ఫ్రై అంటే కూడా నాకు చాలా ఇష్టం. మా నాన్నమ్మ తాతయ్య కోసం వండిపెట్టేది. ఆ వంటకాన్ని అమ్మకు నేర్పించింది. అమ్మలా ఆ వంటను మరెవరూ చేయలేరు. అంత బ్రహ్మాండంగా చేస్తుంది. ఎంతైనా అమ్మ చేతి వంట కదా! అందుకే నా దృష్టిలో అమ్మ ప్రపంచంలోనే బెస్ట్ కుక్. అమ్మ ఆలూనే కాదు.. పాస్తా, మష్రూమ్, చికెన్ వంటకాలు కూడా బాగా చేస్తుంది. నేను తిండి గురించి ఇన్ని మాట్లాడుతున్నా కదా.. నేను వంట చేస్తానుకుంటే పొరపాటే. నాకు కిచెన్‌కి చాలా దూరం. ఎందుకో వంట అనేది పెద్ద ప్రహసనంలా అనిపిస్తుంది. కాకపోతే అన్నం, పప్పు, పాస్తా చేయడం వచ్చు. ఇక బయట తినాలనిపిస్తే ఎక్కువగా మెక్‌డోనాల్డ్స్ నుంచి చికెన్ బర్గర్‌తో ఎక్స్‌ట్రా మయో, చీజ్ వేయించుకొని తెప్పించుకుంటా.



మధుమేహం ఉంటే ఇవి తినండి..



మధుమేహంతో బాధపడేవారు ఎప్పుడు మెడిసిన్ తీసుకోవాలో, ఎలాంటి డైట్ పాటించాలో తెలియక చాలా సందర్భాల్లో ఇబ్బందులు పడుతుంటారు. రెండు మధుమేహ సమస్యలకు చిన్న చిన్న చిట్కాలతో చెక్ పెట్టవచ్చు.

- చాలామంది షుగర్ వ్యాధితో బాధపడేవారు క్రమం తప్పకుండా మందులు వాడాలని అనుకుంటూ ఉంటారు. కానీ అలా ఉండదు
- టైప్ 1 మధుమేహంతో బాధపడుతున్న వారు కచ్చితంగా ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఇన్సులిన్ వాడాల్సిందే.
- టైప్2 మధుమేహంతో బాధపడేవారు మెడిసిన్‌తో పాటు తినే తిండి కూడా సమతుల్యంగా తీసుకోవాల్సి ఉంటుంది.
- టైప్ 1 మధుమేహగ్రస్తులతో పాటు కొన్నిసార్లు టైప్ 2 డయాబెటీస్ వారు కూడా ఒకే రకమైన మెడిసిన్ వాడాల్సి వస్తుంది.
- టైప్2 డయాబెటీస్‌ను ఓరల్ మెడిసిన్ ద్వారా కూడా కంట్రోల్ చేయవచ్చు. ఇది శరీరంలో పేరుకుపోయిన చక్కెర స్థాయిలను తగ్గిస్తూ వస్తుంది.
- దీంతో పాటూ రెగ్యులర్‌గా వర్కవుట్లు, బ్యాలెన్స్‌డ్ డైట్ పాటిస్తే టైప్2 డయాబెటీస్ తగ్గుముఖం పడుతుంది.
- డయాబెటీస్‌ను అదుపులో ఉంచాలన్నా, తగ్గించాలన్నా డైలీ డైట్, క్రమం తప్పకుండా మెడిసిన్, వర్కవుట్లు తప్పనిసరి.
- కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తగ్గించాలి. ఇవి శరీరంలోని చక్కెర స్థాయిల్ని అదుపులో ఉంచుతుంది.
- తక్కువ మోతాదులో ఆహారం తీసుకుంటూ, రోజూ ఒకే సమయానికి భోజనం చేస్తే మధుమేహాన్ని అదుపులో ఉంచవచ్చు.



డాక్టర్ మయూరి ఆవుల
న్యూట్రిషనిస్ట్
mayuri.trudiet@gmail.com

వారెవ్వా.. బుడ్డ కాకర దోశ!

బుడ్డకాకర... ఈ ఆకు గ్రామాల్లో బాగా పరిచయమే. సిటీ వాళ్లకు పెద్దగా తెలియక పోచ్చు. అయితే ఈ ఆకు వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయండోయ్! వీటితో తయారు చేసే దోశ కీళ్ల నొప్పులను మాయం చేస్తుందట.

కాకర, బోడకాకర కాయలను విన్నాం. కానీ ఈ బుడ్డ కాకర ఏంటి? అని కొంతమంది సందేహపడొచ్చు. ఈ కాకరలతో కాదు కానీ.. ఆకులతో మాత్రం చాలా ఉపయోగాలున్నాయి. ఈ ఆకులతో చేసే రసం తాగితే మలబద్ధకం, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. ఆకుల్ని ఆముదంతో కలిపి వేయించి ఒక వస్త్రంలో కట్టాలి. దాన్ని కీళ్ల దగ్గర కాపడం పెట్టుకుంటే నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. మోకాళ్ల నొప్పి తగ్గడానికి ఈ కాపడం ఎంత పనిచేస్తుందో ఈ ఆకులతో చేసే దోశ తినడం వల్ల అంతకంటే ప్రయోజనం కలుగుతుందట. ఇంతకీ ఈ దోశ ఎలా తయారుచేస్తారనే కదా మీ సందేహం? మామూలుగా దోశ పిండి కలుపుకోవాలి. దాంట్లో ఈ ఆకులను, చిన్న ఉల్లిపాయలు, పచ్చిమిర్చి కలిపి మరొకసారి గ్రైండ్ చేసుకోవాలి. ఈ పిండితో దోశలు పోసుకోవచ్చు. లేదా ఆకులను, మెంతులను నానబెట్టి మిక్సీలో గ్రైండ్ చేసుకొని దోశల పిండిలో కలుపాలి. అయితే ఈ పిండి పులియకముందే దోశలు వేసుకుంటే ప్రయోజనం ఉంటుందట. కాబట్టి మోకాళ్ల నొప్పులు ఉన్నవారు వెంటనే ఈ దోశ టేస్ట్ చేసేయండి.



పార్సీ రుచుల ప్రత్యేకం

సోడాబాటిల్ ఓపెనర్ వాలా





రోజువారీ రుచులకు భిన్నంగా కొత్త రుచులను ఆస్వాదించాలంటే హైదరాబాద్‌లోని 'సోడాబాటిల్ ఓపెనర్ వాలా' లో అడుగుపెట్టాల్సిందే. బ్రాండ్ ఇరానీ కాఫీ మొదలు పార్సీ వంటకాలు, ఇరానీ వంటకాలు, ముంబై స్ట్రీట్ ఫుడ్ వంటి ఎన్నో రుచులు ఇక్కడ మనకు దర్శనమిస్తాయి. విదేశీ రుచులకు దేశీయ హంగులు అద్ది అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యేకతలను అందిస్తున్న థీమ్ రెస్టారెంట్ 'సోడాబాటిల్ ఒపెనర్ వాలా' సమీక్ష.

అందరినీ ఆకర్శించే రీతిలో 'సోడాబాటిల్ ఓపెనర్ వాలా' అని పేరు పెట్టడమే ఒక ప్రత్యేక ఆకర్షణ. పేరుకు తగినట్లే రెస్టారెంట్ పార్సీ సంస్కృతికి దగ్గరగా ఉంటుంది. ఇక్కడి వాతావరణం ముంబై పాత ప్రపంచాన్ని పోలి ఉండి ముంబై కేఫ్‌లలో కనిపించే ఉత్సాహపూరిత సందడి కనిపిస్తుంది. వేర్వేరు ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారితో నిత్యం హాస్యపూరిత వాతావరణంతో నిండి ఉంటుంది.




శైలి

ఫ్లోర్ నలుపు తెలుపు రంగుల టైల్స్‌తో కూడి ఉంటుంది. ఇరానీ కుర్చీలు, చాయ్ గ్లాసులు, ఎరుపు గీతలు, ముడులతో కూడిన టేబుల్ క్లాత్‌లు, రంగు గ్లాసు దీపాలు, డోమ్ లైట్స్, కోకిల గడియారాలు, ఇత్తడి టీ కెటిల్స్, డబ్బా టిన్ పెట్టెలు, తాళాలు, పాతా సామాగ్రితో కూడి ఉండి టెట్రో బాలీవుడ్ గీతాలు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌గా వినిపిస్తుంటాయి. మనోహరమైన బొంబాయి ఇరానీ కేఫ్‌తో మిళితమైన ఈ రెస్టారెంట్లో ప్రత్యేకమైన నిబంధనలతో కూడి డిస్‌ప్లే బోర్డులు కూడా కనిపిస్తుంటాయి. 'బయటి ఆహారం అనుమతించబడదు', 'కుర్చీలపై కాళ్లు పెట్టరాదు', 'గట్టిగా మాట్లడకూడదు', 'క్యాషియర్‌తో మాట్లాడవద్దు' 'సిబ్బందిని కించపరచవద్దు', 'ఎలాంటి డిస్కౌంట్‌లు అడుగరాదు', 'ఆహారాన్ని వృధాచేయరాదు', 'వెంట్రుకలు దువ్వరాదు', 'సరసలాడరాదు', 'అనవసర విషయాలకు నవ్వకండి', 'ముక్కు చీదరాదు', 'ఎలాంటి చిరునామా చెప్పరాదు' వంటి నియమాలతో పాటు హైదరాబాద్‌కు ప్రత్యేకమైన 'నో బైగాన్‌కే బాతన్' డిస్‌ప్లే కూడా కనిపిస్తుంది. చూడడానికి సాధారణంగా ఉన్నప్పటికీ వాటిని చూడగానే మనకు తెలియకుండానే ఒక చిరునవ్వు పెదవులపై మొలుస్తుంది. వీటన్నిటితో పాటు సీలింగ్ కింద ఒక చిన్న విద్యుత్ ట్రైన్ బొమ్మను చూడడం మర్చిపోవద్దు. బార్ ప్రాంతంలో ఒక జ్యూక్ బాక్స్ కూడా కనిపిస్తుంది. అక్కడ మనకు కావాల్సిన టెట్రో మ్యూజిక్‌ను ఎంచుకునే అవకాశం ఉంది. ఇంకా అక్కడ మావాకేకులతో నింపిన పెద్ద గాజు జార్‌లు బి మెర్వాన్ బ్యాక్‌డ్రాప్‌తో కనిపిస్తాయి. ఇవన్నీ కూడా గ్రాంట్ రోడ్, దక్షిణ బాంబే జ్ఞాపకాలను గుర్తు చేస్తుంటాయి. మెనూలో ఎంపిక చేసిన పార్సీ ప్రత్యేక వంటలు, ముంబై వీధుల నుంచి ఎంపిక చేసిన స్నాక్స్, ఇరానీ బేకరీ నుంచి కాల్చిన తాజా పదార్థాలు కనిపిస్తాయి.



ఎక్కడుందంటే..
రోడ్ నంబర్ 1, జూబ్లీహిల్స్, హైదరాబాద్



ఆహారం

అక్కడి వంటకాలను చూస్తే 'ఇరానీలు వారు కళ్లతో, వారి ముక్కులతో విసిగిపోరు' అనే విషయం అవగతమవుతుంది. 'సోడాబాటిల్ ఒపెనర్ వాలా' క్లాసిక్ పార్సీ వంటలు, ముంబై స్ట్రీట్ ఫుడ్‌ల కలయికతో కూడిన వంటలను సర్వ్ చేస్తుంది. అన్ని రకాల వెజ్, నాన్ వెజ్ వంటకాలు మనకు ఇక్కడ కనిపిస్తాయి. చికెన్ ఫర్చా, పార్సీ శైలిలో కొలిమిలో ఫ్రై చేసిన చికెన్, బాంబే శైలిలో ఫ్రై చేసిన ఆనియన్స్‌తో కూడిన రొయ్యలు, వడపావ్, టార్డియో ఏసీ మార్కెట్ మమజీస్ గ్రిల్ శాండ్‌విచ్ ప్రత్యేకమైనవి. శాఖహార వంటలలో పుట్టగొడుగు, ఖారీ బిస్కట్స్‌ను మనం ఊహించలేం. ఇక్కడి రాస్ప్‌బెరీ సోడా ప్రత్యేక రుచి కలిగి ఉంటుంది. టొమాటో పాపెటా పర్ ఈడ (పార్సీ శైలిలో ఉడకబెట్టిన గుడ్లు, స్పైసీ టమాటో, పోటాటోలతో కూడిన, బిహేడా పర్ ఈడే (రుచికరమైన ఓక్రాలో కాల్చిన గుడ్లు) రుచికి బాగుంటాయి. శాఖాహారుల కోసం ఆలు ఆంటీ, వెజ్‌టేబుల్ కట్‌లెట్‌ను రుచికరమైన చట్నీ నింపి హంబుల్ బన్ మస్కాతో అందిస్తారు. చికెన్ బైడా రోటీ, బాంబే శైలి చికెన్ ఖీమా, గుడ్లతో కూడిన పరాటా బాగుంటుంది. బోహ్రీ శైలి కీమా పావ్ ఎంతో సువాసనలతో కూడిన రుచికరమైన పదార్థం.

ఇంకా ఇక్కడి డిజర్ట్స్ గురించి తప్పకుండా చెప్పుకోవాలి. ఫేమస్ పార్సీ-ఇరానీ మావా కేక్‌ను ఒకసారి రుచి చూస్తే వదలలేం. అలాగే ఇంగ్లీష్ పౌండ్ కేక్, టబ్లెరోన్ మౌస్, కస్టర్డ్‌తో కూడిన ఆఫిల్ పీ, కారామెల్ కస్టర్డ్, ఐస్‌క్రీమ్‌తో కూడిన పైస్టార్ బ్రౌని వంటి వెన్నో ఇక్కడ సర్వ్ చేస్తారు. అన్నింటికీ ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ ఆపిల్ పీ కస్టర్డ్‌తో సర్వ్ చేయడం ఇక్కడి ప్రత్యేకత. నిమ్మగడ్డి, పుదీనా చితో కూడిన పార్సీ చోయ్ కూడా ఎంతో రుచిగా ఉంటుంది.

సర్వీస్: అందమైన రుచులతో పాటు ఇక్కడి సిబ్బంది సేవలు కూడా అందరినీ ఆకట్టుకునేలా ఉంటాయి. మొత్తం మీదా షాజ్ మెహమూద్, షిరజ్ మీర్జాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న 'సోడాఓపెనర్ వాలా' పార్సీ పుడ్‌కు పెట్టింది పేరు. ఒకసారి ఇక్కడి పదార్థాలు రుచి చూస్తే మళ్లీ మళ్లీ వెళ్లాలనిపించేలా రుచిగా ఉంటాయి.



షాజ్ మెహమూద్

పార్సీ శైలి సాలీ చికెన్, సాలీమటన్ పైన పొటాటో రేకులతో రుచికరమైన ఆహారం బాగుంటుంది. ఆ రుచిని ఆస్వాదిస్తే తప్పకుండా దానితో ప్రేమలో పడడం ఖాయం. చికెన్ లేదా మటన్‌ను వసంత బియ్యంతో వండి వేయించిన ఉల్లిపాయలు, వేరుశనగలు, బెర్రీలు వేసిన చేసిన బెర్రీ పులావ్ ఎంతో రుచికరమైన ఆహారం. ఇక ప్రాన్ పాటియో, ప్రాన్ బాల్చావో తియ్యని, పుల్లని రుచులతో కూడి కొంచెం కారం ఉంటుంది. ఇరానీ ఫలుదా స్ట్రాబెర్రీ రుచితో కూడా ఉంటుంది.

పోపుల పెట్టె

మ్యాజిక్ చేసే మిరియాలు!



గొంతు గరగర అన్నప్పుడో.. జలుబు చేసినప్పుడో తప్ప మిరియాల్ని పెద్దగా వాడరు కొందరు. కానీ వాటిని రోజూ ఏదో ఒక రూపంలో తీసుకుంటే ఎన్నో లాభాలున్నాయి. తెలుసా? అవి ఏంటంటే..

- మిరియాల్లో ఇనుము, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, మాంగనీస్, జింక్, క్రోమియంలాంటి పోషకాలు ఉన్నాయి. ఇవే కాకుండా విటమిన్ ఎ, సి కూడా వీటి నుంచి సమృద్ధిగా పొందవచ్చు.
- ఒక గ్రాము మిరియాలను వేయించి పొడి చేసి అందులో లవంగాల పొడి, వెల్లుల్లి మిశ్రమం తీసుకొని గ్లాసు నీటిలో మరిగించి వడకట్టాలి. దీంట్లో తేనె కలిపి తీసుకుంటే జలుబు, దగ్గు మాయమవుతాయి.
- మిరియాలు రోజూ తీసుకోవడం వల్ల ఒంట్లో కొవ్వు పేరుకుపోకుండా ఉంటుంది. శరీరంలో స్వేద ప్రక్రియ వేగం పుంజుకోవడానికి మిరియాలు సహాయపడుతాయి.
- కండరాల నొప్పులు ఉన్నవారు, అజీర్తి సమస్యతో బాధపడుతున్నవారు మిరియాల పొడిని బెల్లంతో కలిపి తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
- చిటికెడు గళ్ల ఉప్పు, మిరియాల పొడి మిశ్రమాన్ని చిగుళ్లకు రాసి గోరువెచ్చని నీటితో పుక్కిలిస్తే చిగుళ్లవాపు, నోటి నుంచి రక్తం కారడం తగ్గుతాయి.

చాక్లెట్ అంతరించిపోతుందట!

'కిస్ మీ.. మిస్ మీ..' అని చాక్లెట్‌ని చూసుకుంటూ నిజంగానే పాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందేమో! ఎందుకంటే 30 సంవత్సరాల్లో చాక్లెట్ అనే తీపి పదార్థం మనకు దూరమైపోతున్నట్లు సైంటిస్టులు చెబుతున్నారు.



ఆకర్షణీయమైన రంగు, రుచి, వాసన కలిగిన ఏకైక పదార్థం ఏమైనా ఉందంటే.. అది చాక్లెటే అని ముక్తకంఠంతో చెప్పేవాళ్లు కోకొల్లలు. కానీ వారికో చేదు వార్త. మరో ముప్పై సంవత్సరాల్లో చాక్లెట్ కనుమరుగవుతున్నదట. అందరికీ షాక్ అనిపించినా.. ఇది నిజంగా నిజం. చాక్లెట్లను ఎలా తయారు చేస్తారో తెలుసు కదా! కోకోవా ప్లాంట్‌కు చెందిన కోకో విత్తనాల నుంచి కోకోవాను తీసి చాక్లెట్లను తయారుచేస్తారు. అయితే ఈ కోకోవా మొక్కలు ఎక్కువగా ఆఫ్రికన్ దేశాల్లో పెరుగుతాయి. ఇవి పెరుగాలంటే వాతావరణ పరిస్థితులు ఎప్పుడూ ఒకే రకంగా ఉండాలి. అంటే.. ఉష్ణోగ్రత, తేమ, ఇతర అంశాలు అన్నీ 365 రోజులు స్థిరంగా ఉండాలి. అసలు మారకూడదు. అలా ఉంటేనే కోకోవా మొక్కలు పెరుగుతాయి. గ్లోబల్ వార్మింగ్ వల్ల కోకోవా పండే ప్రాంతాల్లో వాతావరణం బాగా వేడెక్కుతుందట. దీంతో కోకోవా పంట త్వరలో అంతరించే ప్రమాదం ఉందని సైంటిస్టులు చెబుతున్నారు. మరో 30 నుంచి 40 ఏళ్ల కాలంలో కోకోవా మొక్కల జాతి పూర్తిగా అంతరించిపోతుందని, అందుకు గ్లోబల్ వార్మింగ్ కారణమని సైంటిస్టులు అంటున్నారు. 2050 సంవత్సరం కల్లా ఇక చాక్లెట్ లభించదు. చాక్లెట్ ప్రియులు త్వరపడండి. వీలున్నంత చాక్లెట్‌ను ఆరగించేందుకు ప్రయత్నించండి. అయితే చాక్లెట్లను కృత్రిమంగా తయారు చేసేందుకు ఇప్పుడే పరిశోధనలు కూడా ప్రారంభించారు. చూద్దాం మరి.. అవి ఎంతవరకు సక్సెస్ అవుతాయో!

సుడోకు

డైలీ సుడోకు 96 సమాధానం

2	5	1	4	9	6	7	3	8
6	7	4	2	3	8	1	9	5
3	9	8	7	5	1	4	2	6
5	8	2	3	7	4	6	1	9
9	4	3	6	1	2	5	8	7
1	6	7	9	8	5	3	4	2
8	1	6	5	2	3	9	7	4
7	2	5	1	4	9	8	6	3
4	3	9	8	6	7	2	5	1

డైలీ సుడోకు -97

5				2				
	3				8			
		8	9		4		3	
	1				7		8	5
7			4		9			6
6	9		8				7	
	4		7		3	1		
			2				6	
				8				4

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



ఇది మా బచ్చా పార్టీ. స్వచ్ఛమైన ప్రేమకు నిర్వచనాలు వీళ్లు.



అజ్మీ షబానా
@AzmiShabana

షబానాను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
3,088,082

కామన్‌మ్యాన్ వాయిస్

మన బంధువుల్లో, స్నేహితుల్లో ఆరోగ్యం సరిగా లేక హాస్పిటల్‌లో ఉంటే.. వెళ్లి చూడండి. ధైర్యం చెప్పి విచారించండి. అలాగని వారికి భారం కాకండి. మీరు హాస్పిటల్‌కు వెళ్లినప్పుడు మీకు తగు మర్యాదలు చేయలేదని అనుకోకండి. వారి బాధలో వారుంటారని ఆలోచించండి. మీ చేతనైన సహాయం చేయండి. అలాగని మీరు ఇచ్చినట్టు పదిమందికి చెప్పుకోకండి.
–Jayasankar Kavanur

ఒక మామూలు సినిమాని బ్లాక్‌బస్టర్ చేయడానికి అభిమానులు ఒక యుద్ధం చేస్తారు. కొన్ని బ్లాక్‌బస్టర్ మూవీస్ వెనుక కొందరి అభిమానుల ఆస్తులు ఉంటాయి.
–Anamika Devi

వైరల్ వీడియో



సంక్రాంతికి కూడా పాటలు రిలీజ్ చేసే ట్రెండ్ వచ్చింది. ఆ ట్రెండ్‌లో భాగంగా మైక్ టీవీ విడుదల చేసిన మంగ్లీ సంక్రాంతి పాట నలభై ఎనిమిది గంటలు దాటకముందే మిలియన్ వ్యూస్ సాధించింది.

Sankranthi Song 2018 || Mangli || Full Song || mictv ||
Total views : 1,084,297+
Published on Jan 7, 2018



సంక్రాంతి పండుగకు మరో నాలుగు రోజులే ఉండటంతో నగరవాసులు సొంతూళ్లకు తరలుతున్నారు. దీంతో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. రైలు ప్రయాణానికే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రయాణికులు సీట్లకోసం కుస్తీ పడుతున్నారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రద్దీ ఎక్కువగా ఉండటంతో రైలు ఎక్కేందుకు జనం అవస్థలు పడాల్సి వచ్చింది.

ఏప్రిల్ నుంచి మరిన్ని మెట్రోరైళ్లు

సీబీటీసీ టెక్నాలజీ పూర్తిస్థాయి వినియోగానికి ప్రణాళిక ■ భవిష్యత్‌లో 5 నుంచి 3 నిమిషాలకో రైలు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నాగోల్ – మియాపూర్ మార్గంలో నడుస్తున్న మెట్రోరైళ్ల ఫ్రీక్వెన్సీ ఏప్రిల్ నుంచి మరింత పెరుగనున్నది. కమిషనర్ ఫర్ మెట్రోరైల్ సేఫ్టీ(సీఎంఆర్ఎస్) మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రస్తుతం నడుస్తున్న మెట్రోరైళ్లు మరింత వేగం పుంజుకోనున్నాయి. సర్వీసులను కూడా పెంచాలని అధికారులు యోచిస్తున్నారు. అందులో భాగంగా సీబీటీసీ(కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్) టెక్నాలజీని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఇది అమల్లోకి వస్తే మూడు నిమిషాలకొక రైలును నడిపే అవకాశముంటుంది. డిమాండ్‌కు అనుగుణంగా భవిష్యత్‌లో సర్వీసులను క్రమబద్ధీకరించనున్నారు. ప్రస్తుతం మియాపూర్–అమీర్‌పేట మార్గంలో 8 మెట్రోరైళ్లను ఏడు నిమిషాలకొకటి చొప్పున నడిపిస్తున్నారు. అమీర్‌పేట నుంచి నాగోల్ మధ్యలో 10 నుంచి 12 నిమిషాల కొకటి 10 రైళ్లు నడుస్తున్నాయి. మెట్టుగూడ నుంచి ఎస్సార్ నగర్ మధ్య కమర్షియల్ ఆపరేషన్స్‌లో మార్చి వరకు సీబీటీసీ టెక్నాలజీపై కొన్ని ఆంక్షలు ఉండటం వల్ల ప్రస్తుత ఫ్రీక్వెన్సీలో ఎటువంటి మార్పులు ఉండవని, ఏప్రిల్ నెలలో ఫ్రీక్వెన్సీ పెంచుతామని మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. నాగోల్ నుంచి మియాపూర్ వరకు 30 కిలోమీటర్లు ప్రయాణించాలంటే ప్రస్తుతం గంట సమయం పడుతున్నది. ఈ సమయం ఏప్రిల్ నుంచి 45 నిమిషాలకు తగ్గే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మియాపూర్ నుంచి అమీర్‌పేట మార్గంలో ఉన్న 7 నిమిషాల ఫ్రీక్వెన్సీని, నాగోల్ నుంచి అమీర్‌పేట వరకు గల 10 నుంచి 12 నిమిషాల ఫ్రీక్వెన్సీని భవిష్యత్‌లో 5 నుంచి 3 నిమిషాలకు తగ్గించనున్నారు. ఇప్పటివరకు ఒక్కోరైలు మూడు బోగీలతో వెళ్తుండగా ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అదనపు బోగీలను కూడా ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న మల్కాజిగిరి ఏసీపీ సందీప్‌రావు గోనె

రద్దయిన నోట్ల మార్పిడికి యత్నం

■ రూ.74 లక్షలు స్వాధీనం.. ఉప్పల్‌లో ముగ్గురి అరెస్ట్

ఉప్పల్, నమస్తే తెలంగాణ: రద్దయిన కరెన్సీనోట్లను మార్చాలని ప్రయత్నించిన ముఠాను హైదరాబాద్ మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.74 లక్షల నోట్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో మల్కాజిగిరి ఏసీపీ సందీప్‌రావు గోనె, ఎస్‌వోటీ ఇన్‌చార్జి రఫీక్, ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, ఉప్పల్ సీఐ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. పాతబస్తీకి చెందిన బాబుబాయ్ రద్దయిన నోట్లను మార్చుతామని, లక్షకు 20 శాతం కమిషన్ ఇస్తామని హుస్సేనిఆలంకు చెందిన మహ్మద్‌హాఫీజ్‌కు చెప్పాడు. రాజస్థాన్‌కు చెందిన మహ్మద్‌హాఫీజ్ హుస్సేనిఆలంలో ఉంటూ గాజుల తయారీ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో బాబుబాయ్‌తో కలిసి నోట్లను మార్చేందుకు బంధువుల వద్ద నుంచి రద్దయి నోట్లను మహ్మద్ హాఫీజ్ తీసుకొచ్చాడు. బుధవారం బాలుడు(15), జహంగీర్‌నగర్‌కు చెందిన ఎండీ ఆదిల్(44)తో కలిసి మహ్మద్ హాఫీజ్ రద్దయిన నోట్లు రూ.74.71లక్షలను మార్చేందుకు ప్లాస్టిక్ కవర్లలో పెట్టుకొని వచ్చి ఉప్పల్ ప్రశాంతినగర్‌లో ఎదురుచూస్తున్నారు. అనుమానంతో ఎస్‌వోటీ పోలీసులు వారిని తనిఖీ చేయగా విషయం వెలుగులోకి వచ్చింది. ముగ్గురినీ అదుపులోకి తీసుకొని ఉప్పల్ పోలీసులకు అప్పగించారు. వారి నుంచి రద్దయిన కరెన్సీ నోట్లతోపాటు రెండు బైక్‌లు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బాబుబాయ్ పరారీలో ఉన్నాడు.

మార్చి 11న అంబేద్కర్ వర్సిటీ అర్హత పరీక్ష

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే అర్హతా పరీక్షకు నోటిఫికేషన్ విడుదలయింది. 18 ఏండ్లు నిండిన అభ్యర్థులు మార్చి 11న నిర్వహించే అర్హత పరీక్షలో పాల్గొనేందుకు అర్హులు. అర్హతా పరీక్షకు హాజరుకావాలనుకొనే అభ్యర్థులు ఫిబ్రవరి 28లోగా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, దీనికోసం రూ.300 రుసుమును చెల్లించాలని యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. పేర్లను నమోదు చేసుకోవానుకునేవారు www.braouonline.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

రోడ్లు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం!

■ ప్రాంతాలవారీగా అధికారులకు బాధ్యతలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రోడ్లు, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అధికారులకు ప్రాంతాల వారీగా బాధ్యతలు అప్పగించాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు లోపాలను సరిదిద్దడం వారి బాధ్యత. జీహెచ్‌ఎంసీకి ఇటీవలే ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్ అధికారులను నియమించింది. ఇందులో భారతి హోళీకెరికి ఎస్‌ఆర్‌డీపీ, హౌసింగ్, నాలాలు తదితర బాధ్యతలు అప్పగించగా, మిగిలిన ఇద్దరిని వివిధ విభాగాలను అధ్యయనం చేయాలని కోరుతూ ఇంకా ఎటువంటి బాధ్యతలు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ ముగ్గురు అధికారులతోపాటు ఇప్పటికే ప్రకటనల విభాగం చూస్తున్న అద్వైత్‌కుమార్‌కు జోన్ల వారీగా రోడ్లు, పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న అధికారులకు సైతం వారి ప్రాంతా ల్లో రోడ్లు, పారిశుద్ధ్యం సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని కమిషనర్ జనార్దన్‌రెడ్డి కోరారు. ప్రజల భాగస్వామ్యంతో క్లీన్ అండ్ గ్రీన్ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని మంత్రి కేటీఆర్ పదేపదే అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశమై రోడ్లు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే ఐఏఎస్ అధికారులకు జోన్లవారీగా బాధ్యతలు అప్పగిస్తూనే ఆయా ప్రాంతాలవారీగా స్థానిక అధికారులకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు.

గమనిక

స్థలాభావం వల్ల నేటి రైతుబడి పేజీని ప్రచురించలేకపోతున్నాం.

హెచ్‌ఎండీఏ బడ్జెట్ 915 కోట్లు!

ప్రతిపాదనలు రూపొందించిన అధికారులు ■ త్వరలో ప్రభుత్వం దృష్టికి ■ రేడియల్ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

ఐదు రోడ్ల నిర్మాణానికి రూ.225 కోట్లు కేటాయించాలని ప్రతిపాదన ■ జైకా నిధుల మళ్లింపునకూ యోచన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

హెచ్‌ఎండీఏ 2018–19 సంవత్సరానికి రూ.915 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అధికారులు ఈ ప్రతిపాదనలను త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. నగరం నలువైపుల నుంచి ఔటర్ రింగ్ రోడ్‌పైకి రవాణాను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రారంభించిన రేడియల్ రోడ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఔటర్‌ను అనుసంధానిస్తూ 376 కిలోమీటర్ల మేర 35 రేడియల్ రోడ్లను నిర్మించాలని హెచ్‌ఎండీఏ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే 17 రోడ్లను హెచ్‌ఎండీఏ అందుబాటులోకి తీసుకొచ్చింది. మరో నాలుగు చోట్ల ఆర్ అండ్ బీ శాఖ నిర్మాణ పనులు ప్రారంభించింది. మిగితా 14 రేడియల్ రోడ్ల నిర్మాణ పనులు ప్రతిపాదన దశలో ఉన్నాయి. వీటిని పట్టాలెక్కించేందుకు ఇటీవల ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందులో ఐదు రోడ్ల నిర్మాణం, భూసేకరణకు దాదాపు రూ.వెయ్యి కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేస్తూ హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీటిని మంత్రి కేటీఆర్ పరిశీలించి దశలవారీగా పనులు చేపట్టాలని కమిషనర్ చిరంజీవులును ఆదేశించారు. ఈ నేపథ్యంలో 2018–19 వార్షిక బడ్జెట్‌లో రేడియల్ రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. సాధారణంగా ప్రభుత్వం నుంచి సంస్థకు ఏటా ఔటర్ నిర్మాణ పనుల యాన్యూటీ పేమెంట్స్ లేదా జైకా లోన్ కోసం కేటాయింపులు జరుగుతుంటాయి. 2017–18 వార్షిక బడ్జెట్‌లో ఓఆర్ఆర్ యాన్యూటీ పేమెంట్స్ రూ.600 కోట్లు, జైకా రుణానికి రూ.500 కోట్లు కలిపి రూ.1100కోట్ల ప్రతిపాదనలు పెట్టగా, ప్రభుత్వం యాన్యూటీలకు రూ.250కోట్లు, జైకా లోన్‌కు రూ.235 కోట్లు కలిపి రూ.485కోట్లు మంజూరు చేసింది. ఈసారి మాత్రం రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తూ దాదాపు రూ.255 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. ప్రభుత్వం కేటాయించే నిధులతో పాటు జైకా సహాయం తీసుకొని పెండింగ్‌లో ఉన్న రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.



రూ.700 కోట్ల జైకా నిధులు

ఓఆర్ఆర్ నిర్మాణంలో భాగంగా ఫేజ్–2 బీలో 71.3 కిలోమీటర్ల నిర్మాణ పనులకు జైకా రూ.3,558 కోట్లు రుణంగా అందించింది. ఇందులో ఔటర్ పనులకు ఖర్చుపెట్టగా దాదాపు రూ.700 కోట్లు మిగిలిపోయాయి. ఈ నిధులను స్కైవేల నిర్మాణానికి వెచ్చించాలని భావించినా, భూ సేకరణలో రక్షణ శాఖ అనుమతులు రావడంలో జాప్యం జరుగుతున్నది. మరోవైపు మిగిలిపోయిన నిధులను ఔటర్‌కే వెచ్చించాలని ఇటీవల జైకా ప్రతినిధులు హెచ్‌ఎండీఏకు షరతు పెట్టారు. ఈ నేపథ్యంలో జైకా అనుమతి తీసుకొని నిధులను రేడియల్ రోడ్ల నిర్మాణ పనులకు మళ్లించాలని అధికారులు భావిస్తున్నారు.

తక్షణం చేపట్టే రేడియల్ రోడ్లు ఇవే..

రేడియల్ రోడ్డు	పరిధి	దూరం(కి.మీల్లో)	వ్యయం(రూ.కోట్లలో)	
			నిర్మాణానికి	భూసేకరణకు
రోడ్ నంబర్-26	మిథానీ జంక్షన్-ఆదిబట్ల	15.5	207.75	64.17
రోడ్ నంబర్-31	తారనగర్-చందానగర్ దేవరగూడ	8.9	88.67	303.81
రోడ్ నంబర్-32	నిజాంపేట క్రాస్‌రోడ్-ఖాజిపల్లి	8.41	93.8	328
రోడ్ నంబర్-8	మూసాపేట-బీహెచ్ఈఎల్ జంక్షన్	7.4	డీపీఆర్ సిద్ధమవుతున్నది	
రోడ్‌నంబర్-20	నాగోల్ బ్రిడ్జి-కొర్రెముల	14	మూసీ రివర్ ఫ్రంట్,హెచ్‌ఎండీఏ సంయుక్తంగా నిర్మిస్తాయి	

ప్రేమించలేదని చంపేశాడు

■ కూకట్‌పల్లిలో యువతిని కత్తితో పొడిచిన ఉన్మాది

■ ప్రేమ పేరుతో మూడేండ్లుగా వేధింపులు కాదనడంతో హత్య

కూకట్‌పల్లి, నమస్తే తెలంగాణ:



జానకి (ఫైల్)



నిందితుడు ఆనంద్

ప్రేమ పేరుతో మూడేండ్లుగా వేధించాడు.. యువతి కాదనడంతో ఉన్మాదిగా మారి కత్తితో పొడిచి పరారయ్యాడు. మరో రెండు రోజుల్లో సొంతూరుకు వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పడుగ జరుపుకొందామనుకున్న ఆ యువతి రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతూ చనిపోయింది. ఏడాది తర్వాత వస్తున్న బిడ్డ కోసం వెయ్యి కండ్లతో ఎదురుచూస్తున్న యువతి తల్లిదండ్రులకు తీరని గర్భశోకం మిగిలింది. పండుగ తర్వాత బిడ్డకు పెండ్లి చేద్దామనుకున్న వారి కలలు కల్లలయ్యాయి. ప్రేమ నిరాకరించిందన్న కోపంతో ఓ ఉన్మాది యువతిని హత్య చేసిన ఘటన హైదరాబాద్ కూకట్‌పల్లిలో సంచలనం రేపింది. పోలీసులు, బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం గుయ్యానవలస గ్రామానికి చెందిన బోను సూర్యనారాయణ, జయమ్మ దంపతుల చిన్న కూతురు బోను జానకి(21) ఉపాధి కోసం ఆరేండ్ల కిందట నగరానికి వచ్చింది. ప్రస్తుతం కూకట్‌పల్లిలోని డిమార్ట్ మాల్‌లో సేల్స్‌గర్ల్‌గా పని చేస్తూ మూసాపేట సర్కిల్ పరిధి హబీబ్‌నగర్‌లో తన స్నేహితురాలు రూపతో కలిసి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నది. మంగళవారం సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో రూప విధులు ముగించుకొని తన గదికి వచ్చి చూడగా జానకి కత్తిపోట్లతో రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతూ కనిపించింది. వెంటనే స్థానికులు జానకిని కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు జానకి స్నేహితులను విచారించగా.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మారెపల్లికి చెందిన అనంతయ్య అలియాస్ ఆనంద్ (27) కొన్నాళ్లుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నట్టు గుర్తించారు. అతడు జానకి పని చేస్తున్న డీమార్ట్ షాపింగ్‌మాల్‌లో ఫ్లోర్ ఇంచార్జిగా పని చేస్తున్నాడు. ప్రేమించకపోతే చంపేస్తానని పలు మార్లు బెదిరించాడు. డిసెంబర్ 24వ తేదీన షాపింగ్ మాల్‌లో కొట్టడంతోపాటు గొంతు నులిమాడు. జానకి ఈ విషయాన్ని ఆనంద్ అక్క, బావకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. దీంతో వారు ఆనంద్‌ను గట్టిగా మందలించారు. ఆనంద్ మరింత పగ పెంచుకున్నాడు. జానకి సంక్రాంతికి ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవగా, పదో తేదీ తర్వాత పది రోజుల వేతనాన్ని ఇస్తామని షాపింగ్‌మాల్ నిర్వాహకులు చెప్పడంతో శుక్రవారం వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నది. జానకికి తల్లిదండ్రులు పెండ్లి చేసేందుకు సిద్ధమవుతుండటం, పండుగకు ఇంటికి వెళ్తే తిరిగి రాదనే అనుమానంతో ఆనంద్ మంగళవారం సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న జానకిపై దాడి చేశాడు. ముందు గొంతు నులిమి ఆ తర్వాత కత్తితో ఛాతి, కడుపు భాగంలో మూడు సార్లు పొడిచి పరారయ్యాడు. సూర్యనారాయణ, జయమ్మ దంపతులకు జానకి ఆరో సంతానమని, ఐదుగురికి పెండ్లి చేశారని త్వరలో చిన్నబిడ్డకు పెండ్లి చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగానే ఈ ఘోరం జరిగిపోయిందని జానకి మేనమామ జయరాజు కన్నీరుమున్నీరయ్యారు. కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్న తల్లిదండ్రులకు జానకి ఉద్యోగం చేస్తూ ఆసరాగా ఉందని, దాదాపు ఏడాది తర్వాత తల్లిదండ్రులను కలుస్తున్నానని సంతోషపడిందని, ఊరికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నదని జానకి స్నేహితురాలు రూప తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడి కోసం గాలిస్తున్నారు.

వరద కాలువల పూడికతీతకు యంత్రాలు

అద్దె ప్రాతిపదికన ఆరింటికి గ్రీన్‌సిగ్నల్.. శివార్ల కోసం 66 జెట్టింగ్‌లు



సక్షన్ కమ్ జెట్టింగ్ యంత్రం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నగరంలోని వరదనీటి పైప్‌లైన్లు, కవర్డ్‌డ్రైన్లు, చిన్నతరహా నాలాల్లో పూడిక తీసేందుకు జీహెచ్‌ఎంసీ త్వరలో ఆరు సక్షన్ కమ్ జెట్టింగ్ యంత్రాలను రంగంలోకి దింపనున్నది. వీటిని ప్రవేశపెట్టేందుకు జీహెచ్‌ఎంసీ స్థాయీ సంఘం గతంలోనే పచ్చజెండా ఊపగా, తాజాగా ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అద్దె ప్రాతిపదికన సెంట్రల్ జోన్‌లో రెండు, మిగతా నాలుగు జోన్లలో ఒక్కొక్కటి చొప్పున ప్రవేశపెట్టనున్నారు. నిర్వాహకులకు ఐదేండ్ల పాటు సుమారు రూ.40.3కోట్ల మేర పనులు ఇవ్వనున్నారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు ముగ్గురు చీఫ్ ఇంజినీర్లు, ఆర్థిక విభాగం అదనపు కమిషనర్‌తో ఓ కమిటీని ఏర్పాటు చేస్తారు. మనుషులు వెళ్లలేని పైప్‌లైన్లు, ఇరుకు నాలాల్లోని పూడికను పైపుద్వారా ట్యాంకులోనికి లాక్కొని, పూడికతో వచ్చే నీటిని రీసైక్లింగ్‌చేసి మళ్లీ వదలడం ఈ యంత్రాల ప్రత్యేకత. దీంతో డ్రైన్లలోనుంచి తీసిన మట్టిని రోడ్లపై పడేసే సమస్య ఉండదు.

శివార్లలో 66 జెట్టింగ్ యంత్రాలు

శివార్లలో మురుగునీటి పైప్‌లైన్ల పూడిక సమస్యను నివారించేందుకు 66జెట్టింగ్ యంత్రాలను సమకూర్చుకోవాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. జీహెచ్‌ఎంసీలో విలీనమైన పాత మున్సిపాలిటీల్లో సుమారు 66వార్డుల్లో మురుగునీటి పారుదల బాధ్యత జీహెచ్‌ఎంసీ ఆధీనంలోనే ఉన్నది. దీంతో ఆయా వార్డులకు ఒక్కొక్కటి చొప్పున 66 యంత్రాలను అద్దె ప్రాతిపదికన సమకూర్చుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రతిపాదనకు స్థాయీసంఘం గతంలోనే ఆమోదం తెలుపగా, ప్రభుత్వ అనుమతి రావాల్సి ఉన్నది. సర్కారు అనుమతించిన వెంటనే వీటిని ప్రవేశపెడుతామని అధికారులు తెలిపారు. పుణె నుంచి వీటిని దిగుమతి చేసుకుంటామని, దశలవారీగా నాలుగు దశల్లో నగరానికి తెప్పిస్తామని వివరించారు.

8 ఇండ్లకు గొళ్లెం పెట్టి.. ఫ్లాట్‌లో చోరీ

■ నగర శివారులో దొంగల ముఠా హల్‌చల్

■ సకాలంలో స్పందించని పోలీసులు

■ చెడ్డీ గ్యాంగ్‌గా అనుమానం

హైదరాబాద్ సిటీబ్యూరో/ బడంగ్‌పేట్, నమస్తే తెలంగాణ: నగర శివారులో దొంగల ముఠా రాచకొండ పోలీసులకు సవాల్ విసిరింది. ఓ అపార్ట్‌మెంట్‌లోని ఎనిమిది ఇండ్లకు బయటి నుంచి గొళ్లెం పెట్టి ఓ ఫ్లాట్‌లో చోరీ చేసింది. ఘటనా స్థలానికి కేవలం కిలోమీటరున్నర దూరంలో కార్డన్ సెర్చ్ నిర్వహించేందుకు దాదాపు 200 మంది పోలీసులు సిద్ధమవుతుండటం గమనార్హం. చోరీ సమయంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ పోలీసులకు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో దొంగలు దర్జాగా పారిపోయారు. ఈ ఘటన మీర్‌పేట్ పీఎస్ పరిధి హస్తినాపురం అగ్రికల్చర్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, వాచ్‌మెన్ తెలిపిన వివరాల మేరకు.. కాలనీలోని బ్లూమింగ్‌డే అపార్ట్‌మెంట్‌కు అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో చడ్డీలు, బనియన్ వేసుకున్న దాదాపు 10 మంది వచ్చారు. కింద ఉన్న వాచ్‌మెన్ రూమ్‌తోపాటు అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్లకు బయటి నుంచి గొళాలు పెట్టుకుంటూ మూడో అంతస్తులోని తాళం వేసి ఉన్న ఫ్లాట్ నంబర్ 301కు చేరుకున్నారు. వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్‌లతో తాళం విరగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాతో పాటు ఇతర ప్రాంతాల్లో వెతికి అందిన కాడికి దోచుకున్నారు. ఈ సమయంలో శబ్దాలు రావడంతో వాచ్‌మెన్ వెంకట్‌రెడ్డి నిద్రలేచి బయటికి వచ్చేందుకు ప్రయత్నించారు. గొళ్లెం పెట్టి ఉండటంతో కిటికీలోనుంచి బయటికి దూకి దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే దొంగలు రాళ్లు విసురుతూ పారిపోయారు. దీంతో వెంకట్‌రెడ్డి చేతికి గాయమైంది. ఈ సమయంలో డయల్ 100కు మూడునాలుగు సార్లు ప్రయత్నించగా ఫోన్ ఎత్తలేదు. తర్వాత మిగతా ఫ్లాట్ల గొళ్లాలను తీయగా వారు విషయం తెలుసుకొని మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మీర్‌పేట్ పోలీసులతో పాటు ఎల్బీనగర్ డీసీపీ ఇతర ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫ్లాట్ నంబర్ 301 యజమాని మణికంఠ అమెరికాలో ఉంటున్నారు. ఆయన అత్త, మామ ఫ్లాట్‌లో ఉంటూ సంక్రాంతి పండుగ కోసం ఏపీలోని భీమవరానికి వెళ్లారు. దొంగలు 10 నుంచి 12 తులాల బంగారం, కొంత నగదు ఎత్తుకెళ్లారని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. చోరీకి పాల్పడింది చెడ్డీ గ్యాంగ్ అని ప్రచారం జరిగినా, పోలీసులు మాత్రం పార్థీ లేదా మహారాష్ట్ర ముఠా పని అయ్యి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రత్యేక బృందాలతో గాలింపు జరుపుతున్నామని సీపీ మహేశ్ భగవత్ తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ వెంకటేశ్వరరావు

కార్డెన్ సెర్చ్‌కు సిద్ధమవుతుండగానే..

అగ్రికల్చర్ కాలనీకి కిలోమీటరున్నర దూరంలో ఉన్న నందనవనం ప్రాంతంలో తెల్లవారుజామున 4 గంటలకు కార్డన్ సెర్చ్ నిర్వహించేందుకు రాచకొండ పోలీసులు దాదాపు 200 మంది సిబ్బందితో ఏర్పాట్లు చేస్తుండగా చోరీ జరుగడం కలకలం రేపుతున్నది. మరోవైపు డయల్ 100కు ఫోన్ చేసినప్పుడు ఆలస్యంగా స్పందించడంపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. సమాచారం ఆలస్యంగా అందడంతో పోలీసులు సమీప ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎల్బీనగర్ డీసీపీ ఎంవీ వెంకటేశ్వరరావు అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వెంటనే కాలనీ అసోసియేషన్లను పిలిపించి సీసీ కెమెరాల అవశ్యకతను వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించారు.

ముంపు ముప్పు తొలగిస్తారు

మ్యాన్‌హోళ్ల నిర్వహణకు డాకెట్ విధానం

కోర్ సిటీలో డివిజన్ల వారీగా పూర్తయిన సర్వే

600 డాకెట్స్‌గా విభజించి కేటగిరీల వారీగా పరిష్కారం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మ్యాన్‌హోల్ నిర్వహణలో సరికొత్త విధానం అమలుకు జలమండలి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పారిశుద్ధ్య పనుల్లో మినీ ఎయిర్‌టెక్ యంత్రాలను ప్రవేశపెట్టి సివరేజీ నిర్వహణలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిన సంగతి తెలిసిందే. అయితే కోర్ సిటీలో ఇప్పటికీ పురాతన డ్రైనేజీ వ్యవస్థ కొనసాగుతుండటం, పైపులైన్ సామర్థ్యానికి మించి మురుగు ఉత్పత్తి అవుతుండటంతో పలు ప్రాంతాల్లో తరచూ మ్యాన్‌హోళ్లు పొంగుతున్నాయి. మురుగు రోడ్లపై పారుతుండటంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సివరేజీ ఓవర్ ఫ్లో సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని సంస్థ ఎండీ దానకిశోర్ నిర్ణయించారు. ఈ మేరకు డాకెట్స్ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఇప్పటికే నగరంలో సీవరేజీ నిర్వహణను డివిజన్లు, సెక్షన్లుగా విభజించగా తాజాగా పరిధిని మరింత కుదిస్తూ డాకెట్లుగా విభజించారు. దాదాపు 600 సీవరేజీ కనెక్షన్లను కలిపి ఒక డాకెట్‌గా గుర్తించారు. నెల రోజులుగా జలమండలి క్షేత్రస్థాయి సిబ్బంది, స్థానిక మేనేజర్లు డివిజన్ల వారీగా పర్యటించి మ్యాన్‌హోళ్లు, మురుగునీటి పైపులైన్ సామర్థ్యం, తరచూ ఉప్పొంగే ప్రాంతాలను గుర్తించారు.

నాలుగు కేటగిరీలు

అధికారులు కోర్‌సిటీలోని ఎనిమిది డివిజన్ల పరిధిలో మ్యాన్‌హోళ్లు, తరచూ పొంగిపొర్లే ప్రాంతాల గుర్తింపు, పరిష్కార మార్గాలపై సర్వే జరిపారు. 72 సెక్షన్లను 600 డాకెట్స్‌గా విభజించారు. తరచూ డ్రైనేజీ ఓవర్ ఫ్లో అయ్యే ప్రాంతాలను (హాట్‌స్పాట్) సమస్య తీవ్రతను బట్టి నాలుగు కేటగిరీలుగా విభజించారు. మనుషులు, యంత్రాల సహాయంతో మరమ్మతులు అవసరమైన వాటిని ఏ– కేటగిరీలో, జీఎం, సీజీఎం పరిధిలోని ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) రూపంలో చేసే పనులను 'బీ'గా, సంస్థ ఎండీ అనుమతితో జరిగే పనులను 'సీ'గా, పైపులైన్ సామర్థ్యం పెంచుతూ కొత్త పైపులైన్ వేయాల్సిన ప్రాంతాలను 'డీ' కేటగిరీలో చేర్చి డివిజన్ల వారీగా నివేదిక అందించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఎండీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు.



డివిజన్	సెక్షన్లు	డాకెట్స్
చంద్రాయణగుట్ట	9	53
మలక్‌పేట	13	118
కార్వాన్	8	91
గోషామహల్	9	55
నారాయణగూడ	12	90
ఎస్‌ఆర్ నగర్	10	101
మారేడ్‌పల్లి	10	85
ఎల్బీనగర్	1	7
మొత్తం	72	600

600 ప్రాంతాల నుంచి ఫిర్యాదులు

పురాతన డ్రైనేజీ వ్యవస్థ, జనాభాకు అనుగుణంగా పైపులైన్ సామర్థ్యం లేకపోవడంతో తరచూ పలు ప్రాంతాల్లో మురుగు పొంగుతున్నది. డ్రైనేజీ ఓవర్ ఫ్లోపై మెట్రో కస్టమర్ కేర్ (155313)కు రోజుకు దాదాపు 600 ప్రాంతాల నుంచి తరుచూ ఫిర్యాదులు అందుతున్నాయి. వాటన్నింటినీ పరిష్కరించడం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా డాకెట్ విధానాన్ని తీసుకొచ్చారు. దీంతో మ్యాన్‌హోళ్ల నిర్వహణపై పర్యవేక్షణ పెరుగడంతోపాటు, శాశ్వతంగా పరిష్కరించే అవకాశం కూడా కలిగింది.

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
గురువారం 11 జనవరి 2018


బి.జయ

'జయ మార్క్ అనిపించేలా.. నా కంటూ ప్రత్యేక గుర్తింపునిచ్చే సినిమాలు మరిన్ని తెరకెక్కించి ప్రేక్షకుల్ని మైమరపింపజేయాలనేది నా లక్ష్యం. ఆ తరువాత ప్రజల్లోకి వెళ్లి సేవ చేయాలనుకుంటున్నాను' అన్నారు బి. జయ. ఆమె పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా బుధవారం పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

ఒక్కరు మారినా మా ప్రయత్నం ఫలించినట్లే!

మా ఆర్.జె. సినిమాస్ సంస్థలో జూన్ నుంచి 'లక్కీఫెలో' పేరుతో కొత్త చిత్రాన్ని మొదలుపెడుతున్నాం. తక్కువ వ్యవధిలోనే చిత్రాన్ని పూర్తి చేస్తాం. ప్రస్తుతం ప్రీపొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కథే ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాలని సన్నాహాలు చేస్తున్నాం. ఓ యువ హీరో ఈ చిత్రంలో నటిస్తారు. అతను ఎవరనేది త్వరలో తెలియజేస్తాం. అనుకోకుండా ఓ యువకుడికి అదృష్టం వరిస్తుంది. అలాంటి వ్యక్తిని అంతా 'లక్కీఫెలో' అంటారు. ఆ అవకాశాన్ని హీరో సద్వినియోగం చేసుకున్నాడా? లేక మిస్ యూజ్ చేసుకున్నాడా? అనేదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. మానవ సంబంధాలు, భావోద్వేగాల్ని మిళితం చేసి ఈ సినిమా రూపొందించనున్నాం. కథానాయిక పాత్రకు ప్రాధాన్యత వుంటుంది. ఈ రోజుల్లో ఆడవాళ్లకు నిత్యం ఏవో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అవి వారిని జీవితాంతం మానసికంగా వెంటాడుతున్నాయి. అలాంటి సమస్యల్ని పరిష్కరించే పాత్ర హీరోయిన్‌ది. ఎంటర్‌టైన్‌మెంట్‌కు వినోదాన్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నాం. మా సినిమా చూసి ఒక్కరిలో మార్పు వచ్చినా మా ప్రయత్నం ఫలించినట్లే.

లవ్‌లీ చిత్రాన్ని మించి...

'వైశాఖం' ప్రేక్షకుల్ని ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందని ఆశించామో అదే స్థాయి విజయాన్ని అందించింది. మేము పెట్టిన బడ్జెట్‌కు తగిన వసూళ్లు రాబట్టింది. ఎక్కడికి వెళ్లినా ఈ సినిమా గురించే మాట్లాడుతున్నారు. 'లవ్‌లీ' దర్శకురాలిగా కమర్షియల్ విజయంతో పాటు ప్రశంసల్ని అందించింది. అయితే 'లక్కీఫెలో' మాత్రం 'లవ్‌లీ'ని మించి పెద్ద విజయాన్ని అందిస్తుందనే నమ్మకముంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో తెలియజేస్తాం. టైటిల్ బాగుందని అందరు అభినందిస్తున్నారు. వేగంగా మరిన్ని సినిమాలు చేసి ప్రేక్షకుల్ని మైమరపింపజేయాలని వుంది. నా కంటూ ఓ మార్కుని ఏర్పరచుకొని ఆ తరువాత ప్రజల్లోకి వెళ్లి సేవ చేయాలనుకుంటున్నాను. అందుకు సంబంధించిన ప్రణాళికను కూడా సిద్ధం చేసుకున్నాను.

మహిళా దర్శకులు రావాలి...

నన్ను స్ఫూర్తిగా తీసుకుని చాలా మంది మహిళలు సినీ రంగంలోకి వచ్చారు. దర్శకత్వ శాఖలో పనిచేస్తున్నారు. చిత్రపరిశ్రమకు మహిళా దర్శకులు మరింత మంది రావాలి. అలా రావాలనుకునే వారికి స్వాగతం చెబుతున్నాను. వెబ్ సిరీస్‌లు చేయాలనే ఆలోచన నాకు లేదు. సినిమాకు వున్నంత క్రేజ్ వెబ్ సిరీస్‌కు లేదు. ఇన్నేళ్లయినా మహిళా దర్శకులతో సినిమాలు నిర్మించడానికి చిత్రపరిశ్రమ ఇంకా సిద్ధంగా లేదు. అవకాశం ఇస్తే చేయగలరా? లేదా అనే అనుమానం ఇంకా అలాగే కొనసాగుతున్నది. ఆ విషయంలో మార్పురావాలి.

శ్రీలక్ష్మి...24 ముద్దులు

నా పేరు కుమారి, వయసు 21.... అంటూ 'కుమారి 21ఎఫ్' సినిమాలో చలాకీ నటనతో యువతరం మనసుల్ని దోచేసింది హెబ్బాపటేల్. ఈ సినిమాతో తెలుగు చిత్రసీమలో లక్కీస్టార్‌గా గుర్తింపును సొంతం చేసుకున్న ఆమెను పలు అవకాశాలు వరించాయి. కథల ఎంపికలో పొరపాట్లు, పరాజయాల కారణంగా వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. గత ఏడాది ఆమె నటించిన సినిమాలేవి సరైన ఫలితాన్ని అందుకోలేదు. పూర్వ వైభవం కోసం తపిస్తున్న ఆమె తాజాగా వినూత్న ప్రయోగంతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమైంది. 'మిణుగురులు' సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు అయోధ్యకుమార్ తాజాగా 'శ్రీలక్ష్మి అండ్ 24 కిసెస్' పేరుతో ఓ సినిమాను తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హెబ్బాపటేల్ ఈ సినిమాలో కథానాయికగా నటించనున్నది. నవతరం ప్రేమకథతో రూపొందనున్న ఈ సినిమాలో హెబ్బాపటేల్ బోల్డ్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నట్లు తెలిసింది. 'కుమారి 21ఎఫ్' తరహాలోనే గ్లామర్‌తో పాటు అభినయానికి ప్రాముఖ్యత కలిగిన పాత్ర ఇదని తెలిసింది. 'ఇంద్ర'తో పాటు పలు సినిమాల్లో బాలనటుడిగా కనిపించిన తేజ ఈ సినిమాలో ప్రధాన పాత్రలో నటించనున్నట్లు సమాచారం.


హెబ్బాపటేల్

నేడు ఆన్‌లైన్ డ్రాలో హజ్‌యాత్రికుల ఎంపిక

- రిజర్వ్ క్యాటగిరీకి డ్రా మినహాయింపు
- రాష్ట్ర కోటా 4066.. దరఖాస్తులు 16,622
- నాలుగుసార్లు దరఖాస్తు చేసినా డ్రాలోనే ఎంపిక



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హజ్‌యాత్ర-2018కు వెళ్లే తెలంగాణ యాత్రికుల ఎంపిక గురువారం జరుగనున్నది. కోటాకు మించి దరఖాస్తులు రావడంతో ఆన్‌లైన్ డ్రా ద్వారా ఎంపిక చేయనున్నారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా(హెచ్‌సీఐ), కేంద్ర మైనారిటీ సంక్షేమశాఖ కలిసి బుధవారం దేశంలోని అన్నిరాష్ట్రాలకు కోటా ప్రకటించాయి. ఈ సారి రాష్ట్రానికి 699 మంది హజ్‌యాత్రికుల కోటా పెరిగింది. గత ఏడాది 3,367 కోటాకు అదనంగా 699 సీట్లు పెంచడంతో మొత్తం 4,066కు చేరింది. మిగతా రాష్ట్రాల్లో కోటా మిగిలితే, తెలంగాణకు కొంత కేటాయిస్తే, స్వల్పంగా పెరుగనున్నది. గురువారం హజ్‌హౌస్‌లో అలీ డ్రా కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మహమూద్ ప్రారంభించనున్నారు. ఈ సారి హజ్‌యాత్రకు రాష్ట్రం నుంచి 16,622 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 16 మంది చిన్నారులు, 508 మంది రిజర్వ్ క్యాటగిరీ (70 ఏండ్లకు పైబడినవారు) ఉన్నారు. వీరు డ్రాతో సంబంధం లేకుండా నేరుగా ఎంపికవుతారు. వీరివెంట ఒకరు సహాయకులుగా వెళ్లేందుకు డ్రాతో సంబంధం లేకుండా అనుమతిస్తారు. 508 మందిని మినహాయించి మిగతా 3,558 మందిని ఆన్‌లైన్‌లో డ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్టు టీఎస్‌హెచ్‌సీ ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ ఎస్‌ఏ షుకూర్ తెలిపారు. నాలుగుసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ హజ్‌యాత్రకు ఎంపికకాని వారికి ఈసారి నేరుగా ఎంపికయ్యే అవకాశం లేదు. కేంద్రం కొత్త నిబంధనలతో వాళ్లు కూడా డ్రా ద్వారా ఎంపిక కావాల్సి ఉంది.

బ్యాంకులు భరోసా కల్పించాలి

అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకుల జోనల్ సమావేశంలో మంత్రులు ఈటల, పోచారం



హోటల్ కత్రియలో జరిగిన అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకుల జోనల్ సమావేశంలో మంత్రి పోచారంకు జ్ఞాపికను అందజేస్తున్న బ్యాంకర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్యాంకులు పేదలకు అండగా ఉంటాయనే భరోసా కల్పించాల్సిన అవసరం ఉన్నదని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. పట్టణాల్లో ఉన్నవారు రుణాలు తీసుకోవాలంటే తాకట్టు పెట్టడానికి వారివద్ద ఏమీ ఉండదని, అలాంటి చిన్న వ్యాపారులకు బ్యాంకులు చేయూతనివ్వాలని సూచించారు. బుధవారం హోటల్ కత్రియలో జరిగిన అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకుల జోనల్ సమావేశానికి మంత్రులు ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంపదను సృష్టించడం మాత్రమే గొప్పకాదని, దాన్ని అందరికీ అందించడం ముఖ్యమని, సమాన పంపిణీ వల్లే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. సంపద కేంద్రీకృతం కావడం అనర్థమని పేర్కొన్నారు. సూటుబూటు చూసి బ్యాంకులు ధనవంతులకే రుణాలు ఇస్తున్నాయని, కానీ కొంతమంది ఎగ్గొట్టిపోతున్నారని చెప్పారు. లాభనష్టాల పట్టిక కాకుండా, కొంత మానవత్వంతో వ్యవహరించాలని మంత్రులు సూచించారు.

మైనార్టీ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం

- సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం 5 నుంచి 10 దేశాలకు విస్తరణ
- ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్



గన్‌ఫౌండ్రీ జామియా నిజామియా కాంప్లెక్స్‌లో రాష్ట్ర మైనార్టీ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎస్‌ఏ షుకూర్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మైనార్టీ విద్యార్థుల కోసం ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ స్టేట్ మైనార్టీ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్'ను ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ వ్యవహారాల సలహాదారు ఏకే ఖాన్ బుధవారం ప్రారంభించారు. గన్‌ఫౌండ్రీ ఎస్బీఐ ఎదురుగా ఉన్న జామియా నిజామియా భవనం మూడో అంతస్థులో దీన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏకే ఖాన్ మాట్లాడుతూ వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు, పరీక్షలకు, వివిధ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఇక్కడ కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. కెరీర్ గైడెన్స్ వెబ్‌సైట్ www.tsmccc telangana.gov.in ను కూడా ఆయన ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా మైనార్టీ విద్యార్థులు అవసర మైన సమాచారాన్ని పొందవచ్చని సూచించారు. విదేశాల్లో ఉన్నతవిద్యకు వెళ్లే మైనార్టీ విద్యార్థులకు రూ.22 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని ఐదుదేశాల నుంచి పదిదేశాలకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఏకేఖాన్ తెలిపారు. మైనార్టీ విద్యార్థుల శిక్షణ కోసం నిజాంకాలేజీలో సీఈడీఎం, తెలంగాణ మైనార్టీల స్టడీసర్కిల్ ద్వారా ఉచితం కోచింగ్, పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నట్టు తెలంగాణ స్టేట్ మైనార్టీ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌ఏ షుకూర్ తెలిపారు.

శరవేగంగా కేటీపీఎస్ ఏడోదశ పనులు

940 ఎంవీఏ జనరేటర్ ఏర్పాటు పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది మార్చి నుంచి ఉత్పత్తి ప్రారంభించే లక్ష్యంతో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కొత్తగూడెం థర్మల్‌పవర్ స్టేషన్ (కేటీపీఎస్) ఏడోదశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్లాంటులో ముఖ్యమైన 940 ఎంవీఏ సామర్థ్యం కలిగిన జనరేటర్‌ను బుధవారం విజయవంతంగా అమర్చారు. జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు విద్యుత్‌సౌధ నుంచి ఆన్‌లైన్‌లో పనులను పర్యవేక్షించగా, క్షేత్రస్థాయిలో డైరెక్టర్ రాధాకృష్ణ పరిశీలన జరిపారు.

ఆస్ట్రియా టీఆర్‌ఎస్‌శాఖ ప్రారంభం

టీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆస్ట్రియాలో తెలంగాణ రాష్ట్ర సమితి శాఖను ప్రారంభించినట్టు టీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల తెలిపారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మిగతా దేశాల్లో ఉన్న తెలంగాణ వారు టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని బుధవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఎంపీ కల్వకుంట్ల కవిత సహకారంతో అన్ని దేశాల్లో టీఆర్‌ఎస్ శాఖలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఆయా దేశాల టీఆర్‌ఎస్ శాఖలు తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉండేందుకు ముందుకొస్తున్నాయని తెలిపారు. ఆస్ట్రియా టీఆర్‌ఎస్ నూతన కమిటీకి అధ్యక్షుడుగా మేడిపల్లి వివేక్‌రెడ్డి, గౌరవ చైర్మన్‌గా ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కంది వంశీ, యలగం సతీశ్, ఆస్ట్రియా కమ్యూనిటీ అఫైర్స్ చైర్మన్‌గా కురకాల రాజు, ప్రధాన కార్యదర్శులుగా అమరం శ్రీకాంత్‌రెడ్డి, దైవాల రవితేజ, నరేశ్, రాజిరెడ్డి, కార్యదర్శులుగా ఆడెపు మనోజ్‌కుమార్, భరత్, శశి, గుర్రం అనిల్, కోశాధికారులుగా మధు, సతీశ్‌కుమార్‌ను నియమించినట్టు తెలిపారు. ఐటీ, మీడియా ప్రతినిధులుగా నవీన్‌కుమార్, సన్నీ, కార్యనిర్వాహక సభ్యులుగా సందీప్‌రెడ్డి, ప్రమోద్, మనోజ్, సతీశ్, దైవాదుల విజయ్, ఈర్ల మహేందర్, కృష్ణ, వినోద్‌ను నియమించినట్టు వెల్లడించారు.

జేఈఈలో డిసేబుల్డ్ అభ్యర్థులకు సహాయకులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా ఏప్రిల్ 8న నిర్వహించనున్న జేఈఈ మెయిన్ పరీక్షలకు హాజరు కావడానికి డిసేబుల్డ్ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తూ జేఈఈ నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు. పరీక్షలను రాయలేని వారికి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని తోడుగా పంపించనున్నారు. ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌లో బబుల్ చేయడానికి వారిని అనుమతించారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని జేఈఈ మెయిన్ బులెటిన్‌లో పొందుపరిచారు. పూర్తి వివరాల కోసం జేఈఈ మెయిన్ 2018 వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

దక్కన్ క్రానికల్ బకాయిలపై విచారణ

ట్రాన్స్‌ట్రాయ్‌ని దివాళాకోరుగా ప్రకటించాలని మరో పిటిషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (డీసీహెచ్‌ఎల్) చెల్లించాల్సిన బకాయిల వ్యవహారంలో కెనరాబ్యాంకు దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) హైదరాబాద్ బెంచ్ విచారణ చేపట్టింది. తమకు చెల్లించాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించక పోవడంతో దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ లిమిటెడ్‌ను ఐబీసీ సెక్షన్ 7 ప్రకారం దివాళాకోరుగా ప్రకటించాలని ఎన్సీఎల్టీని కెనరాబ్యాంక్ ఆశ్రయించిన విషయం తెలిసిందే. బుధవారం జరిగిన విచారణలో ఇరుపక్షాల వాదనలు విన్న ఎన్సీఎల్టీ.. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. తమకు రూ.723 కోట్ల మేరకు డీసీహెచ్‌ఎల్ బకాయిలు పడినట్టుగా కెనరాబ్యాంకు ఎన్సీఎల్టీకి తెలిపింది. కెనరా, ఐడీబీఐ, కార్పొరేషన్, ఇండియన్ ఓవర్సీస్, యాక్సిస్, కోటక్ మహీంద్రా, జమ్ముకశ్మీర్ బ్యాంకులతోపాటు ఎల్ఐసీకి మొత్తం రూ.4వేల కోట్ల మేరకు డీసీహెచ్‌ఎల్ బకాయిలు ఉన్నట్టు తెలుస్తున్నది. కాగా ఏపీలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కాంట్రాక్టులు దక్కించుకున్న ట్రాన్స్‌ట్రాయ్ ఇండియా సంస్థపై సైతం కెనరాబ్యాంకు ఎన్సీఎల్టీని ఆశ్రయించింది. సుమారు రూ.725 కోట్ల బకాయిలు చెల్లించడంలో సంస్థ డిఫాల్టర్‌గా ఉన్నదంటూ కెనరాబ్యాంకు పేర్కొన్నది. దీనిపై త్వరలో విచారణ జరుగనున్నది.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ

(కలెక్టర్ గారి కార్యాలయము, మెదక్ జిల్లా)

లేఖ నెం. జి/142/2017 తేది: 11-2017
ఆర్.డి.ఓ. లేఖ నెం. సి/603/2017 తేది: 17-11-2017

ప్రకటన

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రజోపయోగం కోసం మరియు రవాణా సౌకర్యార్థం నూతన బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ అక్కన్నపేట నుండి మెదక్ వరకు నిర్మించుటకు గాను **మెదక్ జిల్లా రామాయంపేట మండలం లోని అక్కన్నపేట, తొనిగండ్ల మరియు లక్ష్మాపూర్ గ్రామాల శివారు నందు** గల భూములను, భూ సమీకరణ చేయుటకు గాను నిర్ణయించినారు. తదనుసారము ఈ దిగువ షెడ్యూలు నందు **అక్కన్నపేట, తొనిగండ్ల మరియు లక్ష్మాపూర్‌ల** నందు (14.35¼) ఎకరముల భూమిని ప్రభుత్వ ఉత్తర్వు నెం. 123, రెవెన్యూ (జె.ఎ. అండ్.ఎల్.ఎ.) శాఖ, తేది : 30-07-2015 ప్రకారం సంప్రదింపుల ద్వారా సేకరించుటకు గాను చర్య గైకొనబడుచున్నది.

శ్రీయుత జిల్లా కలెక్టర్, మెదక్ గారి ఆధ్వర్యములో ప్రభుత్వముచే నియమింపబడిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నందు సంప్రదింపుల ద్వారా నిర్ణయించిన ధరల ప్రకారం నష్ట పరిహారం పొందుటకు గాను ఈ దిగువ షెడ్యూల్ నందు చూపబడిన సంబంధిత భూ యజమానులందరూ వారి వారికెదురుగా చూపబడిన భూములను మరియు ఆస్తులను ప్రజోపయోగ నిమిత్తం నూతన బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ అక్కన్నపేట నుండి మెదక్ వరకు నిర్మించుటకు గాను ఇష్టపూర్వకంగా అమ్ముటకు ఒప్పుకొని ఫారం-1లో అంగీకార పత్రం మరియు ఫారం-2లో అఫిడవిట్‌లను సమర్పించినారని ఇందు మూలంగా ఆసక్తి గల సంబంధిత వ్యక్తులందరి దృష్టికి తీసుకురావడమైనది.

షెడ్యూల్

జిల్లా: మెదక్ మండలం : రామాయంపేట గ్రామం: అక్కన్నపేట

క్ర. సం.	సర్వే నం./ సబ్ డివిజన్ నెం.	పట్టా/ ఇనాం /ప్రభుత్వం	భూమి యొక్క స్వభావం	ప్రతిపాదిత విస్తీర్ణం (ఎక.లలో)	యజమాని పేరు/ పట్టాదారు పేరు / తండ్రి/ భర్త పేరు	హద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు రకం	సంఖ్య	నిర్మాణములు రకం	విస్తీ
1	2	3	4	5	6	7	8	9	10	11	11	12	12
1	439	పట్టా	మెట్ట	0.03	మెంగర్తి రవీందర్ తండ్రి దేవయ్య	మెంగర్తి నారాయణ	మెంగర్తి లలిత	స్వంత భూమి	మాసుల సిద్దిరాములు	-	-	-	-
[illegible]													

(ఇతర షెడ్యూళ్ళు: గ్రామం: తొనిగండ్ల, లక్ష్మాపూర్; మండలం: హవేలి ఘనపూర్ – గ్రామం: కూచన్‌పల్లి, గంగాపూర్; మండలం: మెదక్ – గ్రామం: పాతూర్, అవుసులపల్లి) [illegible]

జిల్లా: మెదక్ మండలం : మెదక్ గ్రామం: పాతూర్

క్ర. సం.	సర్వే నం./ సబ్ డివిజన్ నెం.	పట్టా/ ఇనాం /ప్రభుత్వం	భూమి యొక్క స్వభావం	ప్రతిపాదిత విస్తీర్ణం (ఎక.లలో)	యజమాని పేరు/ పట్టాదారు పేరు / తండ్రి/ భర్త పేరు	హద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు రకం	సంఖ్య	నిర్మాణములు రకం	విస్తీ
1	2	3	4	5	6	7	8	9	10	11	11	12	12
1	41/2/88	లావుణి పట్టా	మెట్ట	0.09	సర్దన నర్సమ్మ భర్త దుర్గయ్య	కాసుల సత్తమ్మ	లంబాడి శాంతి	స్వంత భూమి	రైల్వే భూమి	-	-	-	-
2	41/2/121	లావుణి పట్టా	మెట్ట	0.17	దుద్ది రాజమ్మ భర్త సిద్దయ్య	రైల్వే భూమి	ముడావత్ శాంతి	స్వంత భూమి	రైల్వే భూమి	-	-	-	-
3	41/68/ఈ1	లావుణి పట్టా	మెట్ట	0.16	ముడావత్ సువాలి భర్త బాల్‌సింగ్	రైల్వే భూమి	డప్పు మల్లవ్వ	స్వంత భూమి	రైల్వే భూమి	-	-	బోరు	-
4	41/68/ఉ1	లావుణి పట్టా	మెట్ట	0.06	ముడావత్ జమ్లి భర్త భద్య	రోడ్లు	శంకర్, హరి	రైల్వే భూమి	బద్య	-	-	బోరు	-
5	41/2/29/1	లావుణి పట్టా	మెట్ట	0.31	కేతావత్ హరి తండ్రి ఉన్య	రోడ్లు	రైల్వే భూమి	రైల్వే భూమి	బద్య	-	-	-	-
	41/2/26/ ఆ3/1	లావుణి పట్టా	మెట్ట	0.06	కేతావత్ హరి తండ్రి ఉన్య	రోడ్లు	రైల్వే భూమి	రైల్వే భూమి	బద్య	-	-	-	-
6	41/2/29/2	లావుణి పట్టా	మెట్ట	0.14	కేతావత్ శంకర్ తండ్రి ఉన్య	ముడావత్ సువాలి	లక్య	డప్పు మల్లవ్వ	హరి	-	-	2 బోరులు	-
7	41/2/8/అ	లావుణి పట్టా	మెట్ట	0.36½	ముడావత్ భద్య తండ్రి జోద్య	జాలి దుర్గయ్య	అంద్రియ	రైల్వే భూమి	స్వంత భూమి	-	-	బోరు	-
8	41/2/24/అ	లావుణి పట్టా	మెట్ట	0.10	డప్పు మల్లమ్మ భర్త దుర్గయ్య	యం. సువాలి	లక్య	స్వంత భూమి	రైల్వే భూమి	-	-	-	-
9	41/2/127	లావుణి పట్టా	మెట్ట	0.30	సర్దన పోచమ్మ భర్త పద్మయ్య	కె.హరి	బాల ఎల్లయ్య	సర్దన మైసయ్య	రైల్వే భూమి	-	-	బోరు	-
10	41/2/131	లావుణి పట్టా	మెట్ట	0.13½	సర్దన జర్నమ్మ భర్త మైసయ్య	లక్య	బాల ఎల్లయ్య	స్వంత భూమి	రైల్వే భూమి	-	-	-	-
11	41/2/26/1	లావుణి పట్టా	మెట్ట	0.09½	సర్దన మైసయ్య తండ్రి నర్సయ్య	లక్య	బాల ఎల్లయ్య	స్వంత భూమి	రైల్వే భూమి	-	-	బోరు	-
12	41/2/15/అ	లావుణి	మెట్ట	0.04	కేతావత్ లక్య	శంకర్	సర్దన	స్వంత	సర్దన	-	-	-	-
[illegible]													

సం/- భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, మెదక్ సం/- సంయుక్త కలెక్టర్ మెదక్ సం/- జిల్లా కలెక్టర్ మెదక్

DIPR RO No.1460/LA/PP/2017-18



బుధవారం సచివాలయంలో కమలాపూర్ రేయాన్స్ కంపెనీ కార్మికుల సమస్యలపై చర్చిస్తున్న మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కడియం శ్రీహరి, చందూలాల్, ఎంపీ సీతారాంనాయక్

రేపటిలోగా రేయాన్స్ కార్మికులకు
వేతనం చెల్లించాలి

రేయాన్స్ ఫ్యాక్టరీ సీఈవోకు డిప్యూటీ సీఎం కడియం ఆదేశం
కంపెనీ ప్రతినిధులతో మంత్రుల భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కార్మికులకు శుక్రవారం వరకు (ఈ నెల 12వ తేదీలోపు) వేతనాలు చెల్లించాలని భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌లోని రేయాన్స్ ఫ్యాక్టరీ (బిల్ట్ బల్లాపూర్ ఇండస్ట్రీ) సీఈవో నిహార్ అగర్వాల్‌ను ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆదేశించారు. బుధవారం సచివాలయంలో రేయాన్స్ ఫ్యాక్టరీ ప్రతినిధులు, కార్మికశాఖ అధికారులు, కార్మిక యూనియన్ నేతలతో డిప్యూటీ సీఎంతోపాటు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, గిరిజనశాఖ మంత్రి చందూలాల్, ఎంపీ సీతారాంనాయక్ సమావేశమయ్యారు. కమలాపూర్ రేయాన్స్ ఫ్యాక్టరీ మూతపడటంతో 32 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కంపెనీ తమ గోడును పట్టించుకోవడం లేదని, కార్మికులు మంత్రులకు మొరపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో కార్మికులకు ఒక నెల వేతనం చెల్లించాలని, ఫిబ్రవరిలోపు ఫ్యాక్టరీ భవితవ్యాన్ని తేల్చాలని సీఈవోను ఆదేశించారు. ఇటీవల పేపర్ పల్ప్‌కు ధర పెరుగడంతో ఫ్యాక్టరీని పేపర్ పల్ప్ ఫ్యాక్టరీగా మార్చి నడిపించే ప్రతిపాదనలను పరిశీలించాలని, ఒకవేళ ఫ్యాక్టరీని మూసివేయాలనుకుంటే కార్మికులకు మొత్తం బకాయిలు చెల్లించాలని కంపెనీ ప్రతినిధులకు మంత్రులు సూచించారు. దీనికి సంబంధించి ఫిబ్రవరి 14న కంపెనీ బోర్డు మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఈవో అగర్వాల్ తెలిపారు. సమావేశంలో కార్మికశాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్, జాయింట్ కమిషనర్ భాగ్యానాయక్, బిల్ట్ డిప్యూటీ జీఎం వై కేశవరెడ్డి, బిల్ట్‌వర్కర్స్ జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమతిలేని లేఅవుట్లకు నో రిజిస్ట్రేషన్?

పంచాయతీల్లో కోఆప్షన్ సభ్యుడిగా ఎన్నారైలకు చాన్స్
హెచ్ఎండీఏ అనుమతిచ్చిన 7 రోజుల్లో భవన నిర్మాణానికి క్లియరెన్స్
నూతన పంచాయతీరాజ్ చట్టంపై మంత్రుల సబ్‌కమిటీ సుదీర్ఘ చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అనుమతిలేని లేఅవుట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకుంటే ఎలా ఉంటుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటైన ఉపసంఘం ఆలోచిస్తున్నట్టు తెలుస్తున్నది. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీహెచ్‌ఆర్డీ)లో బుధవారం మూడోరోజు సమావేశమైన మంత్రుల సబ్‌కమిటీ ఎనిమిది గంటలపాటు అనేక అంశాలపై చర్చించింది. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, జీ జగదీశ్‌రెడ్డి కూడా చర్చలో పాల్గొన్నారు. అనుమతిలేని లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను ఆపేస్తే ఎలా ఉంటుందన్న అంశంపై సంబంధితశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మహమూద్ అలీతోనూ సబ్‌కమిటీ ప్రత్యేకంగా చర్చించింది. పంచాయతీ పాలకవర్గసభ్యులకు సిట్టింగ్ ఫీజు ఇవ్వడం, గైర్హాజరుకు అనర్హత వేటు, పంచాయతీల్లో ఎన్నారైలు, గ్రామ మహిళాసమాఖ్య అధ్యక్షురాలు, నిపుణులను కోఆప్టెడ్ సభ్యులుగా నియమించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. మండలస్థాయిలో పెద్ద భవనాల నిర్మాణం అనుమతులపై కమిటీ ఏర్పాటు చేసి అనుమతించే అంశంపైనా చర్చించారు. భవన నిర్మాణానికి హెచ్ఎండీఏ అనుమతి ఇచ్చిన వారం రోజుల్లో పంచాయతీ క్లియరెన్స్ ఇవ్వని పక్షంలో అనుమతి ఇచ్చినట్టుగా భావించేలా, పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి పంచాయతీల నుంచి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేకుండా చూసేలా చట్టంలో నిబంధనలు చేర్చే విషయం ప్రస్తావనకు వచ్చింది. గురువారం సబ్‌కమిటీ మరోసారి సమావేశం కానున్నది.



బుధవారం నూతన పంచాయతీరాజ్ చట్టంపై అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు పోచారం, జగదీశ్‌రెడ్డి



నాంపల్లి టీఎన్జీవో భవన్‌లో పెన్షనర్స్ డైరీని ఆవిష్కరిస్తున్న మండలి చైర్మన్ కే స్వామిగౌడ్. చిత్రంలో దేవీప్రసాద్, కారం రవీందర్‌రెడ్డి, రాజేందర్, ముజీబ్ హుస్సేన్, రేచల్ తదితరులు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి: స్వామిగౌడ్

హైదరాబాద్/బేగంబజార్, నమస్తే తెలంగాణ: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. నాంపల్లిలోని టీఎన్జీవో కేంద్ర సంఘం కార్యాలయంలో బుధవారం 'ది తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2018 డైరీను రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. త్వరలో ఇందిరాపార్క్‌లో పెన్షనర్ల కుటుంబసభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తామని స్వామిగౌడ్ తెలిపారు. క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ వచ్చేలా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలోని పెన్షనర్లందరికీ ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపును ఇవ్వాలని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ మహిళా విభాగం చైర్‌పర్సన్ రేచల్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేనీ, తెలంగాణ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి నవనీతరావు తదితరులు పాల్గొన్నారు.

భారత ప్రభుత్వం
రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ మరియు హైవేస్ మంత్రిత్వ శాఖ

ప్రకటన
కొత్త ఢిల్లీ జనవరి 4, 2018

ఎస్.ఓ.53(E) - జాతీయ రహదారుల చట్టం, 1956 (48 ఆఫ్ 1956) (ఇకపైన ఇక్కడ సదరు చట్టంగా రిఫర్ చేయబడుతుంది)లో సెక్షన్ 3 ఎ సబ్ సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ, దిగువ షెడ్యూలులో ఇవ్వబడిన సంక్షిప్త వివరణగల భూమి ప్రజోపయోగార్థం కావలసి వున్నదని భావించిన అనంతరం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని కుమరంభీమ్ మంచిర్యాల్ జిల్లాలో కి.మీ. 0.000 నుంచి కి.మీ. 44.200 వరకు భూమిపై జాతీయ రహదారి నం.363, (మంచిర్యాల్ - చంద్రాపూర్ సెక్షన్) లో విస్తారణం (వెడల్పు నాలుగు/ఆరు - లేనింగ్ మొదలగునవి) నిర్వహణ, యాజమాన్యత, ఆపరేషన్ కొరకు అవసరమై ఉన్నది.అందుకు అట్టి భూమి సేకరించాలనే తన ఉద్దేశ్యాన్ని ఇందుమూలముగా వ్యక్తం చేస్తున్నది.

సదరు భూమి విషయంలో ఆసక్తిగల ఏ వ్యక్తి అయినా అధికారిక గెజిట్‌లో ఈ నోటిఫికేషన్ వెలువడిన తేది నుండి ఇరవై-ఒక్క రోజుల్లోగా సదరు చట్టంలోని సెక్షన్ 3సి సబ్-సెక్షన్ (1) క్రింద సదరు పనికోసం అట్టి భూమి ఉపయోగించుటకు ఆక్షేపణను తెలియజేయవచ్చును.

అట్టి ప్రతి ఆక్షేపణను సమర్థ ప్రాధికారికి అంటే జాయింట్ కలెక్టర్, మంచిర్యాల్, వారికి వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును. దాని ఆక్షేపణకు కారణాలు తెలియజేయాలి. సమర్థ ప్రాధికారి స్వయంగా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా విచారించే అవకాశం ఆక్షేపకునికి ఇస్తారు. అట్టి ఆక్షేపణలు విచారించిన తరువాత మరియు తదుపరి విచారణ చేసిన తర్వాత సమర్థ ప్రాధికారి అవసరమని భావిస్తే ఉత్తర్వుద్వారా ఆక్షేపణలను అనుమతించవచ్చును లేదా అనుమతించక పోవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 3సి యొక్క సబ్-సెక్షన్ (2) కింద సమర్థ ప్రాధికారి చేసిన ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది.

ఈ నోటిఫికేషన్ కిందవచ్చే భూమి ప్లాన్లు, భూమి ఇతర వివరాలు సమర్థ ప్రాధికారి కార్యాలయంలో లభిస్తాయి.వాటిని ఆసక్తిగలవారు తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ రహదారి నం.363 పైన కి.మి.0.000 నుండి కి.మి.44.200 వరకు (మంచిర్యాల్ - చంద్రాపూర్ సెక్షన్) భూమిపై ఉన్న కట్టడంతో లేదా కట్టడం లేకుండా సేకరించవలసిన భూమి సంక్షిప్త వివరణ.

క్రమ సంఖ్య	జిల్లా పేరు	తాలూకా పేరు	గ్రామంపేరు	సర్వే నం.	భూమి రకం	భూమి స్వభావం	విస్తీర్ణం (చదరపు మీటర్లలో)
1	2	3	4	5	6	7	8
1	మంచిర్యాల్	(1) జైపూర్	(1)రామారావుపేట	367	ప్రైవేట్	తరి + మెట్ట	130490
				గ్రామం మొత్తం			130490
		(2)నస్పూర్	(2)సింగాపూర్	రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	9359
				గ్రామం మొత్తం			9359
			(3)నస్పూర్	69	ప్రైవేట్	తరి + మెట్ట	29667
				72/5	ప్రైవేట్	తరి + మెట్ట	2277
				70	ప్రైవేట్	తరి + మెట్ట	2878
				గ్రామం మొత్తం			34822
		(3)మంచిర్యాల్	(4)గర్మిళ్ల	218	ప్రైవేట్	తరి + మెట్ట	16669
				217	ప్రైవేట్	తరి + మెట్ట	12015
				216	ప్రైవేట్	తరి + మెట్ట	8757
				207	ప్రైవేట్	తరి + మెట్ట	732
				208	ప్రైవేట్	తరి + మెట్ట	3639
				203	ప్రైవేట్	తరి + మెట్ట	8898
				202	ప్రైవేట్	తరి + మెట్ట	2673
				196	ప్రైవేట్	తరి + మెట్ట	2795
				181	ప్రైవేట్	తరి + మెట్ట	451
				157	ప్రైవేట్	తరి + మెట్ట	1197
				160	ప్రైవేట్	తరి + మెట్ట	205
				159	ప్రైవేట్	తరి + మెట్ట	2295
				345/7	ప్రైవేట్	తరి + మెట్ట	5458
				గ్రామం మొత్తం			65784
		(4)మందమర్రి	(5)అమరవాది	26	ప్రైవేట్	తరి + మెట్ట	3
				కాలువ	ప్రభుత్వం	తరి + మెట్ట	783
				గ్రామం మొత్తం			786
			(6)క్యాతన్‌పల్లి	33	ప్రైవేట్	తరి + మెట్ట	6704
				35	ప్రైవేట్	తరి + మెట్ట	8160
				28	ప్రైవేట్	తరి + మెట్ట	9888
				25	ప్రైవేట్	తరి + మెట్ట	3451
				రైల్వే ట్రాక్	ప్రభుత్వం	మెట్ట	2162
				41	ప్రైవేట్	తరి + మెట్ట	20362
				60	ప్రైవేట్	తరి + మెట్ట	9050
				61	ప్రైవేట్	తరి + మెట్ట	5520
				84	ప్రైవేట్	తరి + మెట్ట	4000
				110	ప్రైవేట్	తరి + మెట్ట	8330
				111	ప్రైవేట్	తరి + మెట్ట	109
				107	ప్రైవేట్	తరి + మెట్ట	2487
				రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	4054
				గ్రామం మొత్తం			84279
			(7)తిమ్మాపూర్	275	ప్రైవేట్	తరి + మెట్ట	1267
				276	ప్రైవేట్	తరి + మెట్ట	484
				రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	12682
				301	ప్రైవేట్	తరి + మెట్ట	3430
				300	ప్రైవేట్	తరి + మెట్ట	2140
				నది	ప్రభుత్వం	తరి + మెట్ట	1133
				303	ప్రైవేట్	తరి + మెట్ట	2140
				గ్రామం మొత్తం			23275
			(8)అందుగులపేట్	రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	7739
				51	ప్రైవేట్	తరి + మెట్ట	2018
				52	ప్రైవేట్	తరి + మెట్ట	3295
				50	ప్రైవేట్	తరి + మెట్ట	2027
				5	ప్రైవేట్	తరి + మెట్ట	4738
				48	ప్రైవేట్	తరి + మెట్ట	1924
				రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	2065
				49	ప్రైవేట్	తరి + మెట్ట	1141
				గ్రామం మొత్తం			24948
			(9)మందమర్రి	382	ప్రైవేట్	తరి + మెట్ట	2034
				383	ప్రైవేట్	తరి + మెట్ట	4206
				129/1	ప్రైవేట్	తరి + మెట్ట	70527
				394	ప్రైవేట్	తరి + మెట్ట	894
				350	ప్రైవేట్	తరి + మెట్ట	1555
				348	ప్రైవేట్	తరి + మెట్ట	1523
				347	ప్రైవేట్	తరి + మెట్ట	1154
				346	ప్రైవేట్	తరి + మెట్ట	894
				141	ప్రైవేట్	తరి + మెట్ట	1021
				395	ప్రైవేట్	తరి + మెట్ట	826
				396	ప్రైవేట్	తరి + మెట్ట	1675
				రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	8990
				401	ప్రైవేట్	తరి + మెట్ట	1455
				402	ప్రైవేట్	తరి + మెట్ట	726
				గ్రామం మొత్తం			97478
		(5)కాశీపేట్	(10)పెద్దంపల్లి	5	ప్రైవేట్	తరి + మెట్ట	1377
				రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	180
				గ్రామం మొత్తం			1557
		(6)బెల్లంపల్లి	(11)ఆకెనపల్లి	1	ప్రైవేట్	తరి + మెట్ట	201
				రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	3213
				గ్రామం మొత్తం			3415
			(12)కన్నాల్	28	ప్రైవేట్	తరి + మెట్ట	1906
				రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	3187
				29	ప్రైవేట్	తరి + మెట్ట	2646
				30	ప్రైవేట్	తరి + మెట్ట	1478
				35	ప్రైవేట్	తరి + మెట్ట	2046
				36	ప్రైవేట్	తరి + మెట్ట	753
				63	ప్రైవేట్	తరి + మెట్ట	2554
				60/1	ప్రైవేట్	తరి + మెట్ట	1751
				రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	205
				88	ప్రైవేట్	తరి + మెట్ట	815
				రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	2687
				61/2	ప్రైవేట్	తరి + మెట్ట	571
				159	ప్రైవేట్	తరి + మెట్ట	14851
				160	ప్రైవేట్	తరి + మెట్ట	310
				162	ప్రైవేట్	తరి + మెట్ట	245
				89	ప్రైవేట్	తరి + మెట్ట	2076
				157	ప్రైవేట్	తరి + మెట్ట	652
				156	ప్రైవేట్	తరి + మెట్ట	879
				155	ప్రైవేట్	తరి + మెట్ట	697
				153	ప్రైవేట్	తరి + మెట్ట	440
				90	ప్రైవేట్	తరి + మెట్ట	1457
				152	ప్రైవేట్	తరి + మెట్ట	189
				151	ప్రైవేట్	తరి + మెట్ట	338
				150	ప్రైవేట్	తరి + మెట్ట	322
				149	ప్రైవేట్	తరి + మెట్ట	354
				91	ప్రైవేట్	తరి + మెట్ట	675
				148	ప్రైవేట్	తరి + మెట్ట	307
				147	ప్రైవేట్	తరి + మెట్ట	337
				92	ప్రైవేట్	తరి + మెట్ట	728
				144	ప్రైవేట్	తరి + మెట్ట	392
				143	ప్రైవేట్	తరి + మెట్ట	691
				93	ప్రైవేట్	తరి + మెట్ట	631
				94	ప్రైవేట్	తరి + మెట్ట	362
				95	ప్రైవేట్	తరి + మెట్ట	280
				96	ప్రైవేట్	తరి + మెట్ట	2733
				138	ప్రైవేట్	తరి + మెట్ట	608
				137	ప్రైవేట్	తరి + మెట్ట	537
				129	ప్రైవేట్	తరి + మెట్ట	1070
				128	ప్రైవేట్	తరి + మెట్ట	486
				97	ప్రైవేట్	తరి + మెట్ట	377
				98	ప్రైవేట్	తరి + మెట్ట	1622
				100	ప్రైవేట్	తరి + మెట్ట	1387
				రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	432
				110	ప్రైవేట్	తరి + మెట్ట	36912
				109/1	ప్రైవేట్	తరి + మెట్ట	119958
				108	ప్రైవేట్	తరి + మెట్ట	25435
				గ్రామం మొత్తం			226001
		(7)తాండూర్	(13)బోయపల్లి	9/1	ప్రైవేట్	తరి + మెట్ట	13906
				17	ప్రైవేట్	తరి + మెట్ట	181
				19	ప్రైవేట్	తరి + మెట్ట	1975
				26	ప్రైవేట్	తరి + మెట్ట	296
				25	ప్రైవేట్	తరి + మెట్ట	4318
				22	ప్రైవేట్	తరి + మెట్ట	2904
				24	ప్రైవేట్	తరి + మెట్ట	68
				గ్రామం మొత్తం			23650
			(14)తాండూర్	595	ప్రైవేట్	తరి + మెట్ట	2920
				612/1	ప్రైవేట్	తరి + మెట్ట	1148
				401	ప్రైవేట్	తరి + మెట్ట	2997
				405	ప్రైవేట్	తరి + మెట్ట	773
				406	ప్రైవేట్	తరి + మెట్ట	844
				429	ప్రైవేట్	తరి + మెట్ట	2049
				431	ప్రైవేట్	తరి + మెట్ట	335
				440	ప్రైవేట్	తరి + మెట్ట	636
				433	ప్రైవేట్	తరి + మెట్ట	1116
				435	ప్రైవేట్	తరి + మెట్ట	454
				440	ప్రైవేట్	తరి + మెట్ట	420
				434	ప్రైవేట్	తరి + మెట్ట	313
				645	ప్రైవేట్	తరి + మెట్ట	555
				649	ప్రైవేట్	తరి + మెట్ట	92
				644	ప్రైవేట్	తరి + మెట్ట	967
				642	ప్రైవేట్	తరి + మెట్ట	715
				643	ప్రైవేట్	తరి + మెట్ట	652
				202	ప్రైవేట్	తరి + మెట్ట	128
				201	ప్రైవేట్	తరి + మెట్ట	304
				669/22/1	ప్రైవేట్	తరి + మెట్ట	1179
				32/1	ప్రైవేట్	తరి + మెట్ట	1209
				32	ప్రైవేట్	తరి + మెట్ట	3937
				25	ప్రైవేట్	తరి + మెట్ట	1423
				45	ప్రైవేట్	తరి + మెట్ట	167
				28	ప్రైవేట్	తరి + మెట్ట	3837
				23	ప్రైవేట్	తరి + మెట్ట	206
				27	ప్రైవేట్	తరి + మెట్ట	598
				26	ప్రైవేట్	తరి + మెట్ట	109
				24	ప్రైవేట్	తరి + మెట్ట	459
				35	ప్రైవేట్	తరి + మెట్ట	381
				గ్రామం మొత్తం			30924
			(15)కిష్టంపేట్	9	ప్రైవేట్	తరి + మెట్ట	47
				10	ప్రైవేట్	తరి + మెట్ట	1267
				12	ప్రైవేట్	తరి + మెట్ట	69
				13	ప్రైవేట్	తరి + మెట్ట	99
				14	ప్రైవేట్	తరి + మెట్ట	81
				15	ప్రైవేట్	తరి + మెట్ట	1096
				22	ప్రైవేట్	తరి + మెట్ట	525
				23	ప్రైవేట్	తరి + మెట్ట	535
				గ్రామం మొత్తం			3717
			(16)కొత్తపల్లి	రోడ్డు	ప్రభుత్వం	మెట్ట	6909
				173	ప్రైవేట్	తరి + మెట్ట	563
				174	ప్రైవేట్	తరి + మెట్ట	593
				171	ప్రైవేట్	తరి + మెట్ట	1549
				170	ప్రైవేట్	తరి + మెట్ట	2555
				గ్రామం మొత్తం			12169
			(17)వనదపల్లి	64/1	ప్రైవేట్	తరి + మెట్ట	6267
				గ్రామం మొత్తం			6267
			(18) రేపల్లెవాడ	2	ప్రైవేట్	తరి + మెట్ట	1168
				3	ప్రైవేట్	తరి + మెట్ట	1773
				8	ప్రైవేట్	తరి + మెట్ట	302
				9	ప్రైవేట్	తరి + మెట్ట	1269
				10	ప్రైవేట్	తరి + మెట్ట	3214
				16	ప్రైవేట్	తరి + మెట్ట	1806
				17	ప్రైవేట్	తరి + మెట్ట	2267
				18	ప్రైవేట్	తరి + మెట్ట	1219
				19	ప్రైవేట్	తరి + మెట్ట	12368
				గ్రామం మొత్తం			25386
				ఏరియా మొత్తం చదరపు మీటర్లలో			804305
				ఏరియా మొత్తం హెక్టార్లలో			80.43

[F.No. 11060/30/ NHAI/PIU-NRML/MANCHERIAL/2017]

రాజేష్ గుప్తా
డిప్యూటీ సెక్రటరి



సచివాలయంలో బీసీ సంక్షేమం, అటవీ, పర్యావరణ అభివృద్ధి సంస్థల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జోగు రామన్న, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్

ఈ ఏడాది బడ్జెట్లో బీసీలకు ప్రాధాన్యం

బీసీ సంక్షేమం, అటవీ, పర్యావరణ అభివృద్ధి సంస్థల క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి జోగురామన్న
బీసీ సహకార సమాఖ్యల వెబ్‌సైట్ ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది బడ్జెట్లో బీసీలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నామని బీసీ సంక్షేమ, అటవీశాఖ మంత్రి జోగురామన్న పేర్కొన్నారు. రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల ప్రగతికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, ఈ ఏడాది బీసీ నామసంవత్సరమని చెప్పారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్లో బీసీ సంక్షేమం, అటవీ, పర్యావరణ అభివృద్ధి సంస్థల క్యాలెండర్‌ను, బీసీ సహకార సమాఖ్యల వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జోగురామన్న మాట్లాడుతూ బీసీల సమగ్రాభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఈ నెల మూడో వారం నుంచి సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రగతిభవన్లో ప్రారంభమయ్యే బీసీ కార్యక్రమాలను నిరంతరాయంగా అమలుచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బాపురావు రాథోడ్, గడ్డం వివేక్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ అనితా రాజేంద్ర, ఎఫ్‌డీసీ ఎండీ చందన్‌మిత్రా, బీసీ సంక్షేమశాఖ అదనపు కార్యదర్శి సైదా పాల్గొన్నారు.



బుధవారం రవీంద్రభారతిలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు ఈటల రాజేందర్, నాయిని నర్సింహారెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఆర్టీసీ యూనియన్ నాయకులు అశ్వత్థామరెడ్డి, థామస్‌రెడ్డి

పోలీసుల్లో పరిణతిని పెంచే పంచసూత్రాలు

- పోలీస్‌శాఖకు డీజీపీ మహేందర్‌రెడ్డి మార్గనిర్దేశం
- సిబ్బంది పనితీరులో మార్పు, ప్రజల్లో విశ్వాసం పెంచేలా చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వంలోని వివిధ శాఖలలో పోలీసు శాఖ ఒకటి. అన్ని శాఖల మాదిరిగా ఇది కూడా ప్రజలకు సేవలందించేందుకే ఏర్పాటైంది. అయితే, ప్రజలు మాత్రం ఇతరశాఖల పట్ల చూపిస్తున్న చొరవ పోలీసుశాఖపై చూపించడం లేదు. పోలీసులు, పోలీస్‌స్టేషన్ అంటే ఇప్పటికీ భయపడుతున్న పరిస్థితులే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిని రూపుమాపి ప్రజల్లో పోలీస్‌శాఖపై నమ్మకం, భరోసా, విశ్వసనీయత పెంచేందుకు కార్యాచరణ ప్రారంభించారు డీజీపీ మహేందర్‌రెడ్డి. ప్రతిపనిలో పారదర్శకతతో ప్రజల విశ్వాసం పొందాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిద్ధం కావాలని, ప్రజల్లో నమ్మకం పెంచాలని పోలీసులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. 2018లో పోలీస్‌శాఖలో మార్పులు తీసుకువచ్చి, ప్రజల్లో పోలీసులపై పూర్తిస్థాయిలో భరోసా కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. తొలుత సిబ్బందిలో మార్పు తీసుకువచ్చి, వారి పనితీరును మెరుగుపర్చాలని నిర్ణయించారు. పారదర్శకతతో పనిచేస్తూ, విలువలను పెంచుకున్నప్పుడే ప్రజల్లో పోలీసుశాఖపై నమ్మకం పెరుగుతుందని పలు అధ్యయనాల ద్వారా గుర్తించి, మెరుగైన సేవలతో ప్రజల్లో విశ్వాసం కల్పించేందుకు ఐదు మార్గదర్శకాలను రూపొందించారు. డీజీపీగా బాధ్యతలు తీసుకున్న తరువాత జిల్లాల పర్యటనలు ప్రారంభించిన మహేందర్‌రెడ్డి ఫ్రెండ్లీ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌తో ప్రజలకు దగ్గరవ్వాలని సూచిస్తున్నారు.

డీజీపీ రూపొందించిన ఐదుసూత్రాలు..

- పారదర్శకత ఉన్నప్పుడే విశ్వాసం పెరుగుతుంది, భరోసా కలుగుతుంది.
- ప్రతివ్యక్తి హుందాతనాన్ని, హక్కులను గౌరవించాలి.
- ప్రజల అవసరాలను అవగాహన చేసుకోవాలి. వారి సమస్యలను తమ సమస్యలుగా భావించాలి.
- విశిష్టమైన సేవలతో సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలి.
- ప్రతిభ పెంచుకోవడం, పరివర్తన ద్వారా సవాళ్లను ఎదుర్కోవడం సులభం.



బుధవారం పరిశ్రమల భవన్‌లో టీఎస్ఐఐసీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి రాజమల్లు. చిత్రంలో ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, టీఎస్ఐఐసీ సీఈ లక్ష్మీకాంత్‌రెడ్డి, నిమ్జ్ సీఈవో మధుసూదన్ తదితరులు

పరిశ్రమలకు భూసేకరణ వేగవంతం చేయాలి

టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు పేర్కొన్నారు. బుధవారం పరిశ్రమభవన్‌లో టీఎస్ఐఐసీ ఉద్యోగుల 2018 క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో టీఎస్ఐఐసీ లక్ష్య సాధనలో ముందుండాలన్నారు. ప్రతిష్ఠాత్మకమైన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, జహీరాబాద్ నిమ్జ్, సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కులు, ఫుడ్ పార్కులు త్వరలో ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ ఏడాది బుద్వేల్‌లో ఐటీ పార్కులు, కరీంనగర్, ఖమ్మంతోపాటు తెలంగాణలోని ప్రధాన పట్టణాల్లో ఐటీ హబ్, టవర్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. అన్ని జిల్లాల్లో కొత్త పారిశ్రామికవాడల ఏర్పాటుకు అనువైన భూములను ఎంపిక చేయాలని టీఎస్ఐఐసీ అధికారులు, ఉద్యోగులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ఆలోచనలకు అనుగుణంగా వేగవంతమైన పారిశ్రామిక ప్రగతితో బంగారు తెలంగాణ నిర్మాణంలో పాలు పంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, నిమ్జ్ సీఈవో మధుసూదన్, టీఎస్ఐఐసీ సీఈ లక్ష్మీకాంత్‌రెడ్డి, టీఎస్ఐఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు విఠల్ పాల్గొన్నారు.

మారుతి కార్ల ధరలకు రెక్కలు

రూ.17 వేల వరకు పెంచిన సంస్థ.. అదే బాటలో హోండా



న్యూఢిల్లీ, జనవరి 10: కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ..తన వాహన ధరలను రూ.17 వేల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ముడి సరుకుల ధరలు పెరుగడం వల్లనే రూ.1,700 నుంచి రూ.17 వేల వరకు సవరించాల్సి వచ్చిందని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. పెరిగిన ధరల బుధవారం నుంచి అమలులోకి వచ్చాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సంస్థ రూ.2.45 లక్షలు(ఆల్టో 800) మొదలుకొని రూ.11.29 లక్షల(ప్రీమియం ఎస్-క్రాస్) లోపు ధర కలిగిన పలు మోడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. ఈ నెల 8 నుంచి అమలులోకి వచ్చేలా వాహన ధరలను రూ.6 వేల నుంచి రూ.32 వేల వరకు సవరించినట్లు మరో సంస్థ హోండా వెల్లడించింది. కానీ ఈ ధరల పెంపు నుంచి అకార్డ్ హైబ్రిడ్ మోడల్‌ను మినహాయింపునిచ్చింది. హెచ్‌సీఐఎల్ రూ.4.66 లక్షల నుంచి రూ.43.21 లక్షల లోపు విలువైన పలు మోడళ్లను విక్రయిస్తున్నది. ఇప్పటికే టాటా మోటార్స్ రూ.25 వేలు పెంచుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

పంటల బీమాకు మరిన్ని నిధులు?

వచ్చే బడ్జెట్‌లో రూ.13 వేల కోట్ల కేటాయింపులు



న్యూఢిల్లీ, జనవరి 10: పంటల బీమాకు రాబోయే బడ్జెట్‌లో మరిన్ని నిధులు దక్కే అవకాశాలున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి (2017-18)గాను వచ్చిన బడ్జెట్‌లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)కు రూ.10,701 కోట్లను కేటాయించగా, వచ్చే ఏడాదికి (2018-19)గాను వస్తున్న పద్దులో రూ.13,000 కోట్లు ఇవ్వవచ్చని తెలుస్తున్నది. 2016 ఆరంభంలో పీఎంఎఫ్‌బీవైని మోదీ సర్కారు పరిచయం చేయగా, ఆధునికీకరించిన ఈ పంట బీమా పథకం కింద రైతులకు స్వల్ప మొత్తం ప్రీమియానికే.. పూర్తిస్థాయి నష్టపరిహారం అందుతుంది. అలాంటి ఈ పథకానికి వచ్చే బడ్జెట్‌లో 10 శాతం ఎక్కువ నిధులు కేటాయించవచ్చని సంబంధిత శాఖా వర్గాల సమాచారం. నిజానికి వ్యవసాయ మంత్రిత్వ శాఖ రూ.11,000 కోట్ల నిధులనే డిమాండ్ చేసింది. కానీ ఈ పథకానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా.. కేంద్రం మాత్రం మరో రూ.2,000 కోట్లను అధికంగానే కేటాయించే వీలున్నదని సదరు వర్గాలు అంటున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లోనూ దక్కింది రూ.9,000 కోట్లేనని, అయితే అదనపు అవసరాల కోసం సప్లిమెంటరీ డిమాండ్లలో భాగంగా మరో రూ.1,701 కోట్ల నిధులను కేటాయించారని, దీంతో మొత్తం 2017-18లో పీఎంఎఫ్‌బీవై బడ్జెట్ కేటాయింపులు రూ.10,701 కోట్లకు చేరాయని తెలిపాయి. కాగా, 2016-17 పంట సంవత్సరం (జూలై-జూన్)లో మొత్తం పంట బీమా క్లెయిమ్‌లు రూ.15,500 కోట్లుగా ఉన్నట్లు అంచనా. వీటిలో రూ.13,661 కోట్ల క్లెయిమ్‌లను పరిశీలించగా, రూ.12,313 కోట్ల క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు అధికారిక సమాచారం. 2016-17లో పీఎంఎఫ్‌బీవై పంట బీమా పాలసీని తీసుకున్న రైతుల సంఖ్య 5.70 కోట్లుగా ఉన్నది. ఆహార ధాన్యం, వంటనూనె పంటకుగాను 1.5-2 శాతం మధ్య, ఉద్యానవన, పత్తి పంటలకు 5 శాతం వరకు ప్రీమియాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఎంతమంది రైతులైనా పాలసీని తీసుకోవచ్చు. ఎలాంటి పరిమితులూ ఉండవు. క్లెయిమ్‌లో 25 శాతం నేరుగా రైతుల ఖాతాల్లోనే జమవుతుంది. ఇదిలావుంటే ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టనున్నది తెలిసిందే.

ఈ ఏడాది వృద్ధి 7.3 శాతం

ప్రభుత్వ సంస్కరణల జోష్ • వరల్డ్ బ్యాంక్ తాజా అంచనా



వాషింగ్టన్, జనవరి 10: భారత ప్రగతి రథచక్రాలు ముందుకే సాగనున్నాయని సర్వేలు అంచనావేస్తున్నాయి. ప్రస్తుత సంవత్సరంలో 7.3 శాతం వృద్ధిరేటు సాధించనున్నదని వరల్డ్ బ్యాంక్ తాజాగా వెల్లడించింది. ఆ తర్వాతి రెండేండ్లకుగాను 7.5 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నదని 2018 సంవత్సరానికిగాను విడుదల చేసిన గ్లోబల్ ఎకనామిక్స్ నివేదికలో ఈ గణాంకాలను వెల్లడించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే భారత్ ఈ ఏడాది మంచి వృద్ధిరేటు సాధించే అవకాశం ఉన్నదని, ముఖ్యంగా ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు ఇందుకు దోహదం చేయనున్నాయని పేర్కొంది. గతేడాది పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలులోకి వచ్చినప్పటికీ భారత్ 6.7 శాతం వృద్ధిని సాధించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. రానున్న పదేండ్లకాలంలో ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే భారత్ ఒక మెట్టుపైకి ఎక్కనున్నదని ప్రపంచ బ్యాంక్ డైరెక్టర్ అయాన్ కోస్ తెలిపారు. పొరుగు దేశమైన చైనాతో పోలిస్తే భారత్ అన్ని రంగాల్లో మెరుగైన పనితీరు కనబరిచే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత మూడేండ్లుగా దేశీయ వృద్ధి ఆశించిన స్థాయిలోనే కదలాడుతున్నదన్నారు. 2017లో చైనా 6.8 శాతం వృద్ధి సాధించింది. ఇది భారత్ కంటే 0.1 శాతం ఎక్కువ. ప్రస్తుత సంవత్సరానికిగాను చైనా వృద్ధి 6.4 శాతానికి పరిమితమవనున్నదని అంచనావేసిన ప్రపంచ బ్యాంక్.. ఆ తర్వాత రెండేండ్లలో వృద్ధి 6.3-6.2 శాతానికి మించే అవకాశాలేమి కనపడటం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఉత్పాదక విషయానికి వస్తే భారత్‌కు మంచి సామర్థ్యం ఉన్నదని తెలిపిన ఆయన.. కార్మిక, విద్య, ఆరోగ్యం విషయాల్లో సంస్కరణలు, పెట్టుబడులకు బోలెడన్ని అవకాశాలున్నాయన్నారు. అలాగే ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉన్న మహిళా కార్మికులతో పోలిస్తే భారత్‌లో చాలా తక్కువగా ఉన్నారని, ఈ పరిధి మరింత పెరుగాల్సిన అవసరం ఉన్నదని ఆయన సూచించారు. కానీ, దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుతుండటం కొంత కలవరానికి గురి చేస్తున్నదని, ఈ నేపథ్యంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడానికి కీలక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. జీఎస్టీ అమలులోకి రావడం, బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి భారీ స్థాయిలో నిధులను వెచ్చించడంతో వచ్చే పదేండ్లలో భారత్ ఇతర దేశాలకు ఆశాకిరణంగా మారనున్నదన్నారు. అయితే ఇదే సమయంలో భారత్ సవాళ్లను ఎదుర్కొక తప్పదని వరల్డ్ బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి.

2018-19లో వృద్ధి 7.3 శాతం: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధి 7.3 శాతంగా నమోదవనున్నదని దేశంలో రెండో అతిపెద్ద ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అంచనావేస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో వినిమయం పుంజుకోవడం ఇందుకు దోహదం చేయనున్నదని పేర్కొంది. అలాగే జీఎస్టీ అమలులోకి రావడం, పెద్ద నోట్ల రద్దు కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మాత్రం వృద్ధి 6.5 శాతానికి పరిమితం కానున్నదని తెలిపింది. సాధారణ వర్షపాతం నమోదవడంతో గ్రామీణ ప్రాంతాల్లో వినిమయం ఊపందుకున్నదని, అలాగే రుణ ఎగవేతదారులు తగ్గుముఖం పట్టారని బ్యాంక్ వెల్లడించింది. పెద్ద నోట్ల రద్దుతో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు జీఎస్టీ అమలులోకి వచ్చాక సద్దుమణిగాయని తెలిపింది. కానీ, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమంటుండటంపై బ్యాంక్ ఆందోళనను వ్యక్తంచేసింది. దీంతో ద్రవ్యలోటు, క్యాడ్ మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ధరలు పెరుగుతుండటంతో ఈ ఏడాది మధ్యనాటికి ద్రవ్యోల్బణం 6 శాతానికి చేరుకునే అవకాశం ఉన్నదన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.. కానీ రెండో అర్ధభాగానికి మాత్రం కాస్త సద్దుమణిగే అవకాశం ఉందని వెల్లడించింది.

వృద్ధిరేటుపై ప్రధాని సమీక్ష

దేశీయ వృద్ధిని మళ్లీ గాడిలో పెట్టడానికి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా రంగంలోకి దిగారు. నాలుగేండ్ల కనిష్ఠ స్థాయికి జారుకోనున్న వృద్ధిరేటును పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రముఖ ఆర్థికవేత్తలు, విశ్లేషకులతో మోదీ బుధవారం సమీక్ష జరిపారు. ఈ సమావేశానికి 40 మంది ఆర్థికవేత్తలతోపాటు ఆయా రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ఎన్‌డీఏ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదో, చివరిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఈ సమావేశం మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నది.

ఎఫ్‌డీఐలపై ఎవరేమన్నారు..?

సింగిల్ బ్రాండ్ రిటైల్ తదితర రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనల సడలింపు నిర్ణయం దేశంలోకి మరిన్ని విదేశీ పెట్టుబడులకు ఊతమిస్తుంది. ఎయిర్ ఇండియాలో విదేశీ విమానయాన సంస్థల పెట్టుబడులను 49 శాతం వరకు అనుమతించడం ఇబ్బందుల్లో ఉన్న ఆ సంస్థ పునరుజ్జీవనానికి దోహదపడగలదు. **- సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ**

సింగిల్ బ్రాండ్ రిటైల్ కోసం కేంద్రం ప్రకటించిన కొత్త విదేశీ పెట్టుబడుల నిబంధనలను స్వాగతిస్తున్నాం. ఆటోమేటిక్ రూట్ ద్వారా 100 శాతం విదేశీ పెట్టుబడులకు ఆమోదం తెలుపడం హర్షణీయం. దేశీయ బ్రాండ్ల విస్తరణకు ఈ నిర్ణయం దోహదపడుతుంది' **- రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా**

రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులకు పెద్దపీట వేయడం ప్రగతిదాయక నిర్ణయం. అయితే మల్టీ-బ్రాండ్ రిటైల్ కోసం ఎఫ్‌డీఐ నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడం అసంతృప్తిని కలిగిస్తున్నది.

- ఆశిష్ కసద్ (ఈవై ఇండియా)

ఆటోమేటిక్ మార్గం కింద సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో 100 శాతం ఎఫ్‌డీఐని అనుమతిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆపిల్‌తోపాటు షియామీ, ఒప్పో వంటి చైనా మొబైల్ తయారీ సంస్థలకు అత్యంత లాభదాయకం. సొంత ఔట్‌లెట్లతో కస్టమర్లకు మరింత దగ్గర కాగలవు.

- కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ తరుణ్ పాఠక్

రియల్టీ బ్రోకరేజ్‌లో ఎఫ్‌డీఐ నిబంధనలను సడలించడం నూతన పెట్టుబడులకు కలిసొస్తుంది. ప్రాపర్టీ బ్రోకరేజ్ సర్వీసెస్‌లు రియల్ ఎస్టేట్ బిజినెస్ కాదన్న స్పష్టత ప్రభుత్వం నుంచి రావడం ప్రశంసనీయం. రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను సంఘటితం చేయడానికి ఇది దోహదం చేస్తుంది.

- అభిషేక్ గోయెంకా (పీడబ్ల్యూసీ ఇండియా)

ఎఫ్‌డీఐ నిబంధనల సరళతరంతో దేశంలో కొత్తగా పెద్ద ఎత్తున స్టోర్ల ఏర్పాటుకు వీలు కలుగుతున్నది. దీనివల్ల స్థలాలకు వాణిజ్యపరమైన డిమాండ్ అమాంతం పెరిగే అవకాశాలున్నాయి. నిర్మాణ రంగాభివృద్ధికి ఇది ఎంతగానో కలిసొచ్చే నిర్ణయం. **- జేఎల్ఎల్ ఇండియా రిటైల్ ఎండీ పంకజ్ రెంజెన్**

హాస్టల్ మెస్‌పైనా జీఎస్టీ!

ఆహారం, పానీయాలపై 5 శాతం పన్ను: సీబీఈసీ



న్యూఢిల్లీ, జనవరి 10: హాస్టల్ మెస్ లేదా క్యాంటీన్ మీల్స్‌పైనా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) పడుతుంది. వసతి గృహాల్లో విద్యార్థులు, సిబ్బందికి కల్పించే భోజన సదుపాయానికి 5 శాతం జీఎస్టీ వేస్తామని బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. విద్యా సంస్థలైనా, బయటి వ్యక్తులైనా ఎవరైనాసరే నిర్వహిస్తున్న హాస్టల్ మెస్ సేవలు జీఎస్టీ పన్నుకు అర్హనీయమైనవేనని కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ బోర్డు (సీబీఈసీ) పేర్కొన్నది. కాలేజ్ హాస్టల్ మెస్ అందిస్తున్న సేవలపై జీఎస్టీ పన్ను ఉంటుందా? అన్న ప్రశ్నలకు సీబీఈసీ బదులిస్తూ.. 'విద్యా సంస్థలుగావచ్చు లేదా ఇతర కాంట్రాక్టర్లుగావచ్చు ఎవరు నడిపే మెస్, క్యాంటీన్‌లలోనైనా సరఫరా చేసే ఆహారం, పానీయాలపై జీఎస్టీ కింద 5 శాతం పన్నును చెల్లించాల్సిందే.

ప్రైస్ వాటర్‌హౌస్‌పై సెబీ కొరడా

న్యూఢిల్లీ, జనవరి 10: సత్యం కుంభకోణం కేసులో ప్రైస్ వాటర్‌హౌస్ నెట్‌వర్క్ సంస్థలపై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ బుధవారం కొరడా ఝుళిపించింది. ఈ కేసులో పాల్పడిన అవకతవకలకుగాను రెండేండ్లపాటు దేశంలోని ఏ లిస్టింగ్ కంపెనీకి ఆడిట్ సర్టిఫికేట్లను జారీ చేయరాదంటూ నిషేధం విధించింది. ఆయాచితంగా పొందిన రూ.13 కోట్లకుపైగా లాభాన్ని వడ్డీతోసహా చెల్లించాలని ప్రైస్ వాటర్‌హౌస్ బెంగళూరు, మరో ఇద్దరిని ఆదేశించింది.

డిస్కవరీలో మరో రెండు బైకులు

మార్కెట్లోకి ప్రవేశపెట్టిన బజాజ్



న్యూఢిల్లీ, జనవరి 10: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో..ప్రీమియం ఎగ్జిక్యూటివ్ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి రెండు నూతన బైకులను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో రూ.50,496 విలువైన డిస్కవరీ 110 మోడల్ కాగా, మరొకటి రూ.56,314 ధర కలిగిన డిస్కవరీ 125 మోడల్ అని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 115.5 సీసీ ఇంజిన్‌తో రూపొందించిన డిస్కవరీ 110 కాగా, 124.5 సీసీ సామర్థ్యంతో రూపొందించిన మరో బైకు రూ. 53,491గాను, అలాగే డ్రమ్, డిస్క్ వెర్షన్ మోడల్ రూ.56,314కి లభించనున్నది. ఈ సందర్భంగా కంపెనీ ప్రెసిడెంట్ ఎరిక్ వ్యాస్ మాట్లాడుతూ..100-125 సీసీలోపు సామర్థ్యం కలిగిన బైకులను కోరుకుంటున్న వినియోగదారులకు నూతన ఫీచర్స్‌తో ఈ బైకులను రూపొందించినట్లు తెలిపారు. రోజంతా వెలిగే ఎల్ఈడీ లైటింగ్, డిజిటల్ డిస్‌ప్లే ప్యానెల్స్ ఉన్నాయని ఆయన వెల్లడించారు.

తేన్పులతో చిరాకు పెట్టవద్దు

జీన్స్, టీ-షర్టులు తగదు.. సిబ్బందికి ఎస్‌బీఐ సూచన

న్యూఢిల్లీ, జనవరి 10: తేన్పులు తీసి చిరాకు పెట్టవద్దంటూ తమ ఉద్యోగులకు ఎస్‌బీఐ క్లాస్ పీకింది. సాంఘీక ఆచారాలపై సిబ్బందికి కొన్ని సలహాలు, సూచనలు చేసిన ఈ ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం.. విధి నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలను, నీతి, నియమాలను పాటించాలని, ఖాతాదారులకు మర్యాదపూర్వక సేవలను అందించాలని కోరింది. 'ఫార్మల్ దుస్తులు ధరించండి.. బాగుంటుంది. చెప్పులకు బదులు పాలిష్ చేసిన షూలను వేసుకోండి.. ఇంకా బాగుంటుంది. కానీ తేన్పులు, ఆవలింతలు తీస్తే మాత్రం చాలా చిరాగ్గా ఉంటుంది. ముఖ్యంగా సమావేశాల్లో అస్సలు బాగుండదు' అని ఓ సర్క్యులర్‌లో తమ 2,68,705 మంది ఎంప్లాయిస్‌కు చెప్పింది. కడుపు నిండా తిన్న తర్వాత తేన్పులు, ఆవలింతలు రావడం చాలా సాధారణమే. కానీ తాజా ప్రకటనతో ఎస్‌బీఐలో ఇవి ఇతరులకు ఇబ్బందికర స్థాయిలో ఉంటున్నాయని తెలుస్తున్నది. కాగా, దేశంలోని తమ 13,000 శాఖలతోపాటు ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల్లో ఉన్న 190 కార్యాలయాలకు ఎస్‌బీఐ ఈ సర్క్యులర్‌ను జారీ చేసిందని ప్రముఖ జాతీయ వార్తా దినపత్రిక 'ది హిందూ' తెలిపింది. 'టీ-షర్టులు, జీన్స్, స్నీకర్స్/స్పోర్ట్స్ షూలు వేషధారణలో భాగం కాకూడదు' అని ఈ సందేశంలో ఎస్‌బీఐ పేర్కొన్నది. ఈ క్రమంలోనే పరిపాలనా విభాగంలో పనిచేసే సీనియర్ పురుష సిబ్బంది చూడచక్కని ఫార్మల్స్ ధరించాలని సూచించిన బ్యాంకు.. కస్టమర్లతో జరిపే సమావేశాల్లో టై వేసుకోవాలన్నది. అలాగే సీనియర్ మహిళా సిబ్బంది కూడా భారత సంప్రదాయ దుస్తులు ధరించాలని సలహా ఇచ్చింది.

అవన్నీ వట్టి పుకార్లే

సోషల్ మీడియాలో బ్యాంకింగ్ ఉచిత సేవల నిలిపివేత సందేశాలపై ఐబీఏ స్పష్టీకరణ



ముంబై, జనవరి 10: ఈ నెల 20 నుంచి అన్ని ఉచిత సేవలను నిలిపివేసే యోచనలో బ్యాంకులున్నాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను, సమాచారాన్ని భారతీయ బ్యాంకుల సంఘం (ఐబీఏ) ఖండించింది. అదంతా వట్టిదేనని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. 'ఈ జనవరి 20 నుంచి బ్యాంకులు అన్ని ఫ్రీ సర్వీసులను ఆపేస్తున్నాయంటూ కొన్ని సామాజిక ప్రచార వేదికల్లో వైరల్ అవుతున్నది. కానీ ఇదంతా పూర్తిగా అవాస్తవం. తప్పుడు, నిరాధార సమాచారం. అలాంటి చర్యలేవీ బ్యాంకులు తీసుకోబోవడం లేదు' అని ఈ సందర్భంగా ఐబీఏ స్పష్టం చేసింది. 'ఖాతాదారులు మాత్రమే సొంత చెక్కుల ద్వారా గరిష్ఠంగా రూ.50,000 నగదును తీసుకోగలరు. ఒక్కో లావాదేవీపై రూ.10 చార్జీ ఉంటుంది. దీన్ని ఖాతాల్లో నుంచే బ్యాంకులు మినహాయించుకుంటాయి' అని వాట్సాప్ గ్రూపుల్లో ఓ మెసేజ్ చక్కర్లు కొడుతున్నది. ఇలాగే 'రూ.10,000 వరకు ప్రతీ నగదు ఉపసంహరణను థర్డ్ పార్టీ ఖాతాదారులు చెక్కు ద్వారానే చేసుకోవాలి. ఒక్కో లావాదేవీకి చార్జీగా రూ.10 చెల్లించాలి. ప్రతీ చెక్కు డిపాజిట్‌పై రూ.10 చార్జీ విధించనున్నారు. అదనంగా స్పీడ్ క్లియరింగ్ చార్జీలుంటాయి' అని మరో సందేశం గత వారం రోజులుగా తిరుగుతున్నది. ఇలాంటి సందేశాలు వద్దని, చట్టరిత్యా చర్యల్ని తీసుకోవాల్సి వస్తుందని ఐబీఏ హెచ్చరించింది.

బినామీ లావాదేవీలకు దూరంగా ఉండండి..

లేకుంటే ఏడేండ్ల జైలు శిక్ష తప్పదు: ఐటీ వర్గాలు



న్యూఢిల్లీ, జనవరి 10: బినామీ లావాదేవీలకు దూరంగా ఉండాలని లేకుంటే కఠిన చర్యలు ఎదుర్కొక తప్పదని ప్రజలకు ఆదాయ పన్ను శాఖ తాజాగా హెచ్చరికలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి జాతీయ పత్రికల్లో 'కీప్ అవే ఫ్రమ్ బినామీ ట్రాన్సక్షన్' పేరుతో ఐటీ శాఖ ఈ ప్రకటనను ప్రచురించింది. బినామీ లావాదేవీలు నల్లధనం కిందకు వస్తాయని, వాటిని తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని ఈ ప్రకటనలో ఐటీ శాఖ పేర్కొంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వానికి చేరవేయాలని ఈ సందర్భంగా ఐటీ శాఖ వర్గాలు ప్రజలకు సూచించారు. బినామీ లావాదేవీలు జరుపుతున్న వారు పట్టుబడితే ఏడేండ్ల జైలు శిక్షతోపాటు వారి బినామీ ప్రాపర్టీకి సంబంధించి మార్కెట్ విలువ ఆధారంగా 25 శాతం వరకు జరిమానా విధించనున్నట్లు ఈ ప్రకటనలో పేర్కొంది. నవంబర్ 1, 2016 నుంచి అక్టోబర్ 2017 వరకు దేశవ్యాప్తంగా రూ.1,833 కోట్ల విలువైన బినామీ ఆస్తులను జప్తు చేయడం జరిగిందని, అలాగే 517 మందికి నోటీసులను జారీ చేసినట్లు వెల్లడించింది. తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తులను కూడా వదిలేది లేదని, వీరికి ఐదేండ్ల జైలు శిక్షతోపాటు వారి ఆస్తిలో పది శాతం జరిమానా కింద విధించనున్నట్లు ఐటీ శాఖ వర్గాలు హెచ్చరించాయి.

వరంగల్‌లో మలబార్ గోల్డ్ షోరూం

రేపు ప్రారంభించనున్న సంస్థ



కోజికోడ్, జనవరి 10: ప్రపంచంలో అతిపెద్ద ఐదు బంగారు ఆభరణాల విక్రయాల్లో ఒకటిగా కొనసాగుతున్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వ్యాపారాన్ని భారీగా విస్తరిస్తున్నది. ఆరు దేశాల్లో 11 షోరూంలను ఈ నెల 12న ప్రారంభించనున్నట్లు మలబార్ గ్రూపు చైర్మన్ ఎంపీ అహ్మద్ ఈ సందర్భంగా తెలిపారు. దీంతో రిటైల్ అవుట్‌లెట్ల సంఖ్య 197 నుంచి 208కి చేరుకోనున్నది. తెలంగాణలోని వరంగల్‌తోపాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అల్ ఖైల్ మాల్, అల్ హజానా లులు మాల్, అల్ బుహైరా లులు మాల్, సహారా సెంటర్, అజ్మాన్ సిటీ సెంటర్, ఖతార్‌లోని ఖతార్ మాల్, ఒమాన్‌లోని లగూనా మాల్, మస్కట్ సిటీ సెంటర్, సింగపూర్‌లోని ఏఎంకే హబ్, మలేషియాలోని అంపంగ్ మాల్‌లో ఏర్పాటు చేస్తున్నది.



హన్మకొండ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు కోలా రాజేశ్‌కుమార్ గౌడ్ తదితరులు

తారే జమీన్ పర్

'నమస్తే తెలంగాణ' ముగ్గుల పోటీలకు విశేషస్పందన.. ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: సంక్రాంతి సందర్భంగా 'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన లభిస్తున్నది. జనగామ జిల్లా కేంద్రంలోని జూబ్లీగార్డెన్స్‌లో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఖమ్మంలోని నయాబజార్ కళాశాల ప్రాంగణంలో 'న్యూఇరా' పాఠశాల యాజమాన్యం సౌజన్యంతో ముగ్గుల పోటీలు వైభవంగా సాగాయి. జెడ్పీ చైర్ పర్సన్ గడిపల్లి కవిత ముగ్గుల పోటీలను ప్రారంభించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు దంపతులు ముగ్గుల పోటీలు ప్రారంభించారు. పాలమూరు జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ బహుమతులను ప్రదానం చేశారు. వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలో హన్మకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలను వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దల పద్మ, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ గుండు సుధారాణి ప్రారంభించారు. వరంగల్‌రూరల్ జిల్లా పరకాల పట్టణంలో మయూరి గార్డెన్స్, ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతిరెడ్డి ప్రారంభించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు అతిథులు బహుమతులను ప్రదానం చేశారు.



జనగామలో నిర్వహించిన రంగవల్లుల పోటీలో ముగ్గు వేస్తున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన టీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ఇంటింటికీ తాగునీరు, ప్రతి ఎకరాకూ సాగునీరు

- ఏడాదిలో కాళేశ్వరం నీళ్లు, గజ్వేల్‌కు రైలు సౌకర్యం
- భారీనీటిపారుదల శాఖమంత్రి తన్నీరు హరీశ్‌రావు

గజ్వేల్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. గజ్వేల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గడువుకు ముందే ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి సాగు నీరు అందించాలనే లక్ష్యంతో రేయింబవళ్లు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల నిర్మాణ పనులు రాత్రి సమయంలో కూడా జరగడాన్ని కేంద్ర జలవనరుల సంఘం ఇంజినీర్లు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారన్నారు. సీఎం కేసీఆర్ ఈ పనులపై నిరంతర పర్యవేక్షణ చేస్తూ పనుల్లో వేగం పెంచుతున్నారన్నారు. మిషన్ కాకతీయ, మిషన్‌భగీరథ, నిరంతర విద్యుత్, హరితహారం, ఐటీ అభివృద్ధి తదితర అంశాల్లో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయ పథకాలతో ప్రతి ఇంటికి మంచినీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనేది ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. హరితహారంలో రాష్ట్రం దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని, ప్రతిపక్షాలకు అభివృద్ధి పనులు వణుకు పుట్టిస్తున్నాయని పేర్కొన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, రోడ్ల అభివృద్ధి, డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా రాష్ట్ర ప్రగతికి ప్రతిరూపాలుగా నిలిచాయని, గజ్వేల్‌లో ఎడ్యుకేషన్ హబ్, హార్టికల్చర్ యూనివర్సిటీ, అటవీ శాఖ కళాశాల నిర్మాణాలు దేశవిదేశాలలో గుర్తింపు తెస్తాయన్నారు. ఏడాదిలోపు కాళేశ్వరం సాగు నీరందించడానికి పనులను వేగవంతం చేశామని, డిసెంబర్‌లోగా గజ్వేల్‌కు రైలు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో పనులను మరింత ముమ్మరం చేసినట్టు స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, నర్సారెడ్డి, పార్టీ ఇంచార్జి భూపతిరెడ్డి, నగరపంచాయతీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

10వేల మందితో బందోబస్తు

మేడారం జాతరపై ఐజీ నాగిరెడ్డి ● జాతర సేవలకు 'మేడారం సేన' సోషల్ మీడియాలోనూ ప్రచారం ● జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్వీ కర్ణన్



జయశంకర్ జిల్లా ప్రతినిధి/నమస్తే తెలంగాణ : మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు 10వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్టు నార్త్‌జోన్ ఐజీ వై నాగిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మేడారం సందర్శించారు. తొలుత జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, జిల్లా ఎస్పీ ఆర్ భాస్కరన్‌తో కలిసి మేడారంలోని సమ్మక్కసారలమ్మ దర్శనం చేసుకున్నారు. అనంతరం చేపట్టిన పనులు, ఏర్పాట్లను పరిశీలించారు. జాతర పరిసరాల్లో పోలీసు శాఖ ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు, క్రౌడ్ కౌంటింగ్, డిటెన్షన్ కెమెరాలను పరిశీలించారు. అనంతరం నాగిరెడ్డి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్, ఎస్పీ ఆర్.భాస్కరన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈసారి కోటి మందికిపైగా భక్తులు మేడారం వచ్చే అవకాశం ఉన్నందున మహాజాతర ప్రశాంతంగా జరగటానికి 10వేల మంది పోలీసులతో జాతర బందోబస్తు నిర్వహించనున్నట్టు తెలిపారు. మహాజాతర నిర్వహణ కోసం స్పెషల్‌గా పోలీసు శాఖ సాఫ్ట్‌వేర్ తయారుచేస్తున్నదని, జాతర బందోబస్తు విధులకు హాజరయ్యే పోలీసుల అధికారులు, సిబ్బందికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందుతుందని తెలిపారు. జాతర డ్యూటీకి వచ్చే పోలీసు అధికారులు, సిబ్బందికి ఎప్పుడు బందోబస్తు విధులకు రావాలి, ఎక్కడ రిపోర్టు చేయాలి, ఏ ప్రదేశంలో విధులు నిర్వహించాలనేది ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా మొబైల్స్‌కు ఎప్పటికప్పుడు మెసేజ్ వెళ్తుందన్నారు.



జాతర పరిసరాల్లో ఎస్పీ భాస్కరన్‌తో కలిసి పర్యటిస్తున్న ఐజీ నాగిరెడ్డి

జాతర సేవలకు 'మేడారం సేన'

యువతతో మేడారం సేనా ఏర్పాటు చేయనున్నట్టు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ వెల్లడించారు. సమ్మక్కసారలమ్మ మహాజాతరలో మేడారం సేనా సభ్యులు వాలంటీర్లుగా పనిచేస్తారని ఆయన తెలిపారు. సోమ, మంగళవారం రాత్రి మేడారంలోని ఐటీడీఏ క్యాంపు ఆఫీసులో బస చేశారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా ఇంచార్జి కలెక్టర్ కర్ణన్ మేడారంలో విస్తృతంగా పర్యటించారు. మేడారంలోని ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ఎస్పీ భాస్కరన్, సమ్మక్కసారలమ్మ పూజారులతో కలిసి యువకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా 'మేడారం సేనా' పేరుతో యువకులు ఒక దళంగా ఏర్పడాలని పిలుపునిచ్చారు. మేడారం సేనలోని సభ్యులు జాతరలో వాలంటీర్లుగా సేవలందించాలన్నారు. ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు జాతరకు స్పెషల్‌గా లోగోను యువత రూపొందించాల కోరారు. పరిశీలనకు వచ్చిన లోగోల్లో ఒకటి వెబ్‌సైట్‌కు ఎంపిక చేస్తామన్నారు. ముఖ్యంగా మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించటానికి యువత సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలని అన్నారు. ఫొటోలు, సెల్ఫీలు, వీడియోలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తే అంతర్జాతీయంగా ప్రచారం లభిస్తుందన్నారు. గిరిజన సంప్రదాయం ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జంపన్న వాగు నుంచి మేడారంలోని గద్దెల వద్ద గల క్యూలైన్ల వరకు గర్భిణులు, దివ్యాంగులు, వృద్ధుల కోసం 10ఆటోలను జాతర ప్రారంభమయ్యే వరకు నడపాలని సూచించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇంచార్జి కలెక్టర్ కర్ణన్



నిర్మల్‌లో విద్యార్థినులకు కాస్మోటిక్ కిట్స్ అందజేస్తున్న మంత్రి అల్లోల

విద్యా ప్రమాణాలు పెంచడమే సర్కారు లక్ష్యం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ / నమస్తే తెలంగాణ: విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నిర్మల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు కాస్మోటిక్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థినులకు మూడు మాసాలకు గాను నెలకు రూ.వంద విలువగల కాస్మోటిక్ వస్తువులను అందజేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న వసతులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. అనంతరం మంత్రి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు.

నకిలీ పత్తి విత్తనాలు సీజ్

మల్దకల్ : జోగుళాంబ గద్వాల జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. ఎస్సై నవీన్‌సింగ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్దకల్ మండలం సద్దలోనిపల్లి గ్రామానికి చెందిన సీడ్ ఆర్గనైజర్ రామకృష్ణ వ్యవసాయ క్షేత్రంలోని పశువుల పాకలో అక్రమంగా నకిలీ పత్తి విత్తనాలు నిల్వ చేసినట్టు సమాచారం అందింది. బుధవారం గ్రామానికి చేరుకొని దాడులు నిర్వహించారు. దాడుల్లో పశువుల పాకలో 50 కిలోల పత్తి వితనాల సంచులు 55 దొరికాయన్నారు. రామకృష్ణపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. స్వాధీనం చేసుకొన్న విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు గోదాముకు తరలించినట్టు ఎస్సై వివరించారు.

జిల్లా జైలు నుంచి ఖైదీ పరారీ

నల్లగొండ క్రైం : ఖైదీ పరారైన ఘటన మంగళవారం రాత్రి నల్లగొండలో చోటు చేసుకుంది. బుధవారం జిల్లా జైలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా చిమటపాలెం గ్రామానికి చెందిన మల్లారం శివకృష్ణ 2012లో మహబూబ్‌నగర్ జిల్లాలోని కేశంపేటకు చెందిన గనిపిసెట్టి వెంకట్‌రావు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. వెంకట్‌రావు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని 21మే, 2012లో నిద్రపోతున్న అతడిపై శివకృష్ణ మద్యం మత్తులో రాడ్‌తో కొట్టి హత్య చేశాడు. ఈ కేసులో మహబూబ్‌నగర్ స్పెషల్ కోర్టు అతడికి జీవిత ఖైదు విధించి చర్లపల్లి జైలుకు పంపించారు. శిక్షను అనుభవిస్తున్న ఖైదీ 16 సెప్టెంబర్, 2017న నల్లగొండ జిల్లా జైలుకు వచ్చినట్టు తెలిపారు. అవుట్ ప్రాసింగ్ ఖైదీగా అతడిని జైళ్ల శాఖ ఏర్పాటు చేసిన పెట్రోలు బంక్‌లో పెట్టారు. మంగళవారం రాత్రి బంక్‌లో ఉన్న ఖైదీ పోలీసుల కళ్లుకప్పి పారిపోయినట్టు శ్రీనివాస్ తెలిపారు. పారిపోయిన ఖైదీ కోసం గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

భార్యను కత్తితో పొడిచిన భర్త

వాజేడు : జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామంలో భానక్క(38)ను ఆమె భర్త లక్ష్మయ్య బుధవారం ఉదయం మద్యం మత్తులో కత్తితో పొడిచి హత్యచేశాడు. భార్యభర్తల మధ్య మాటామాటా పెరుగడంతో మద్యం మత్తులో ఉన్న భర్త క్షణికావేశంలో పక్కనే ఉన్న కత్తితో కడుపులో పొడవటంతో ఆమె మృతిచెందింది. వెంటనే పేరూరు పోలీసుల ఎదుట భర్త లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న వెంకటాపురం సీఐ నలవాల రవీందర్, పేరూరు ఎస్సై కాగితోజు శివప్రసాద్ ఘటన స్థలానికి చేరుకొని గ్రామస్థుల నుంచి వివరాలను సేకరించారు. తల్లి హత్యకు గురవడం, తండ్రి జైలుకు వెళ్లడంతో ఐదో తరగతి చదువుతున్న కొడుకు సిద్ధయ్య అనాథగా మిగిలాడు.

మహాశివరాత్రిని వైభవంగా నిర్వహిద్దాం

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జాతర సమీక్షలో ఎమ్మెల్యే చెన్నమనేని

వేములవాడ, నమస్తే తెలంగాణ: వేములవాడ రాజన్న సన్నిధిలో ఫిబ్రవరి 13న జరిగే మహాశివరాత్రి జాతరను వైభవంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు అన్నారు. జాతర సమయంలో సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా వీఐపీలకు ఒక సమయాన్ని కేటాయిద్దామని, వారిని అదే సమయంలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజన్న ఆలయ కళాభవన్‌లో జరిగిన జాతర సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడారు. వేములవాడ పట్టణంలోని ప్రజలకు ఈ నెల 15 నుంచే మిషన్ భగీరథ ద్వారా నీటిని అందించేందుకు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

రాజన్న సన్నిధికి చేరుకునే భక్తులు మొదట చేరుకునే తిప్పాపూర్ బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ కృష్ణభాస్కర్ అధికారులను ఆదేశించారు. పాత గోడలకు రంగులు వేయించేందుకు అవసరమైన నిధులను కేటాయిస్తామన్నారు. ఎస్పీ విశ్వజిత్ మాట్లాడుతూ.. స్థానిక జగిత్యాల బస్టాండ్ ప్రాంతంలో మరో పార్కింగ్ స్థలాన్ని ఎంచుకోవాలన్నారు. వీధి వ్యాపారులతో పాటు ఇతరులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. 1600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామని, సీసీ కెమెరాలతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా 350 బస్సులను ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆలయ ఈవో దూస రాజేశ్వర్, నగర పంచాయతీ అధ్యక్షురాలు నామాల ఉమ పాల్గొన్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు

టీఆర్‌ఎస్‌లో చేరికల జోరు



ఉప్పల్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎంపీ మల్లారెడ్డి, మేయర్ బొంతురామ్మోహన్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : గులాబీ పార్టీలో చేరికల పరంపర కొనసాగుతున్నది. బుధవారం వివిధ పార్టీలకు చెందిన నేతలు టీఆర్‌ఎస్‌కి జై కొట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో 160 కుటుంబాలు బుధవారం టీఆర్‌ఎస్‌లో చేరా యి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండ లం కైలాపూర్‌కు గ్రామానికి చెందిన 100 మంది రాష్ట్రహౌస్ ఫెడ్ చైర్మన్ కడారి నవనీతరావు, మార్కె ట్ కమిటీ చైర్మన్ కుంభం రవీందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చినమడూరు, ధర్మాపురం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్‌లో నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్, టీడీపీకు చెందిన పది మంది నాయకులు, కార్యకర్తలు టీఆర్‌ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల బీజేపీ నేతలు తాడం మల్లేశ్, లింగంతో సహా మరో 30మంది హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నివాసంలో పార్టీలో చేరారు. ఉప్పల్‌లోని ఎన్‌ఆర్‌బీ బేరింగ్ అధ్యక్షుడు ఇక్బాల్ ఆహ్మద్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్మికులు టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మల్కాజ్‌గిరి ఎంపీ మల్లారెడ్డి, మేయర్ బొంతురామ్మోహన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కట్టుకున్నోళ్లనే కడతేర్చారు..!

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇద్దరి హత్య.. భర్తలను చంపిన భార్యలు.. కుటుంబ కలహాలే కారణమా..?



మృతుడు బాణోతు శ్రీను(ఫైల్)

అశ్వాపురం రూరల్ / కారేపల్లి: కలకాలం కలిసుండాల్సిన కట్టుకున్న భర్తలనే కడతేర్చారా భార్యలు.. క్షణికావేశం.. కుటుంబ కలహాలే ఈ హత్యలకు కారణమని తెలుస్తున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం రాంనగర్‌కు చెందిన వలస గిరిజనుడు కొర్స దేవయ్య(22) భార్య, మామ చేతిలో హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాంనగర్‌లో కొర్స దేవయ్య ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చాడు. ఆయనకు కొంతకాలం క్రితం కొర్స లక్ష్మితో వివాహం జరిగింది. అప్పటి నుంచి వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి దేవయ్య భార్యతో గొడవ పడ్డాడు. గొడవతో వేగలేక లక్ష్మి, తన తండ్రి సోడె నందయ్యతో కలిసి మంగళవారం రాత్రి దేవయ్యను కర్రతో తలపై బలంగా కొట్టడంతో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేందర్ తెలిపారు.

గొంతు నులిమి చంపి ఆత్మహత్యగా చిత్రీకరణ..

భార్య తన భర్త గొంతు నులిమి హత్య చేసిన సంఘటన మంగళవారం రాత్రి ఖమ్మం జిల్లాలోని కారేపల్లి మండలం సామ్యాతండాలో చేటుచేసుకుంది. గ్రామస్థులు, బంధువుల కథనం ప్రకారం.. సామ్యా తండాకు చెందిన బాణోతు శ్రీను(35)కూలీ పనులు చేసుకుంటున్నాడు. భార్య లక్ష్మి ఇల్లెందు వెళ్లి కూరగాయల వ్యాపారం చేస్తున్నది. మద్యం తాగి ఇంటికి వచ్చే శ్రీను భార్యతో నిత్యం గొడవకు దిగేవాడు. మంగళవారం రాత్రి కూడా వివాదం చోటుచేసుకుంది. భర్త నిద్రలోకి జారుకోగానే గొంతు నులిమి చంపేసింది. తెల్లవారుజామున తన భర్త పురుగుమందు తాగి మృతి చెందాడంటూ బంధువులకు ఫోన్‌లో సమాచారం అందించింది. మృతుడి ఇంటివద్దకు చేరుకున్న బంధువులు, గ్రామస్థులు పురుగుమందు తాగిన ఆనవాళ్లు ఏమీ లేకపోవడం, శ్రీను మెడ వద్ద కమిలి ఉండటం, నోట్లోంచి నాలుక బయటకు రావటంతో భర్తను హత్య చేసి ఆత్మహత్యగా పేర్కొంటుందంటూ లక్ష్మికి దేహశుద్ధి చేశారు. దీంతో ఆమె అక్కడి నుంచి పారిపోయి కారేపల్లి పోలీసు స్టేషన్‌లో లొంగిపోయింది.

4,200 బస్సులు..50 సీసీ కెమెరాలు

మేడారం జాతరకు సిద్ధమవుతున్న ఆర్టీసీ



సుబేదారి(వరంగల్): మేడారం జాతరకు 20 లక్షల మందిని తరలించేందుకు 4,200 బస్సులు నడుపనున్నామని ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ చెప్పారు. బుధవారం వరంగల్‌లోని ఆర్టీసీ శిక్షణ కళాశాలలో ఎండీ రమణారావుతో కలిసి జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జాతరలోని ఆర్టీసీ ప్రాంగణం, రాష్ట్రంలోని ప్రధాన బస్‌పాయింట్ల వద్ద 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోల్‌రూం ద్వారా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించడం కోసం సీఎం కేసీఆర్ కేంద్రప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్టు చెప్పారు. ఆర్టీసీ ఎండీ రమణారావు మాట్లాడుతూ ఈ జాతరకు వరంగల్‌నుంచి కొత్తగా 20 వజ్ర బస్సులను నడుతున్నామని చెప్పారు.

వర్గీకరణకు గద్దర్ నాయకత్వంలో ఢిల్లీకి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్



జగిత్యాల జిల్లాకేంద్రంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

జగిత్యాల, నమస్తే తెలంగాణ : ఎస్సీ వర్గీకరణకు మాల, మాదిగ మేధావులను కలుపుకొన ప్రజా గాయకుడు గద్దర్ నాయకత్వంలో ఢిల్లీకి వెళ్తున్నామని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వర్గీకరణ అమలుకు మాలల అడ్డంకిగా మారారని, తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వాస్తవానికి మాల కులస్తుల్లో మేధావి వర్గం వర్గీకరణకు మద్దతు తెలుపుతున్నదన్నారు. ప్రధాని, కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. అపాయింట్‌మెంట్ ఖరారు కాగానే ఢిల్లీకి వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ అధ్యక్షుడు సుంకపాక దేవయ్య, రాష్ట్ర కార్యదర్శి వంతడుపుల అంజయ్య, జిల్లా ఇన్‌చార్జి కొక్కెర భూమన్న, జిల్లా అధ్యక్షుడు రామెల్ల లక్ష్మణ్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి లక్ష్మణ్, బోయిని శంకర్, కొమురయ్య, రాములు, కొండ శంకర్, రమేశ్ పాల్గొన్నారు.

సబ్సిడీ గొర్రెలు అమ్మితే పథకాల నిలిపివేత

నార్కట్‌పల్లి : 'గొల్ల కురుమలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెల పంపిణీ చేస్తున్నది.. వీటిని ఎవరైనా అమ్మితే వారికి ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తాం' అని పశుసంవర్ధకశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం నెమ్మానిలో గొర్రెల అభివృద్ధి పథకం తీరును పరిశీలించారు. లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. గొర్రెల పంపిణీ విషయంలో నల్లగొండ జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. దళారుల మాటలు నమ్మి తాత్కాలిక లాభాల కోసం గొర్రెలను అమ్మడం, రీసైక్లింగ్ లాంటివి చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంతర్జాతీయ స్పేస్ ప్రోగ్రామ్‌కు సూర్యాపేట వాసి

బొడ్రాయిబజార్ : ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో అంతర్జాతీయ అంతరిక్ష విశ్వవిద్యాలయం జరుపనున్న స్పేస్ ప్రోగ్రామ్‌కు సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఇస్రో శాస్త్రవేత్త చెర్కుపల్లి వెంకటరమణ ఎంపికయ్యారు. జనవరి 15నుంచి జరుగనున్న ఈ ప్రోగ్రామ్‌లో ప్రపంచ అంతరిక్ష శాస్త్రవేత్తలు పాల్గొననున్నారు. జనవరి 12న జరిగే పీఎస్‌ఎల్‌వీ – సీహెచ్‌వో ప్రయోగంలో తలమునకలైన వెంకటరమణ ఆవెంటనే ఆస్ట్రేలియా పర్యటనకు సన్నద్ధులవుతున్నారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
గురువారం 11 జనవరి 2018




గురుకుల విద్యార్థుల ప్రతిభ అసాధారణం

■ ఇంటర్ స్పోర్ట్స్ లీగ్ ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గురుకుల విద్యార్థులు అసాధారణ ప్రతిభను కనబరుస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన పిల్లలకు అవకాశాలు కల్పిస్తే మిగతావారితో సమానంగా రాణిస్తారని గురుకుల విద్యార్థులు నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలీలో రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూల్స్ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్–2018ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐదు సొసైటీల నుంచి రెండు వేల మంది విద్యార్థులు పాల్గొనటం సంతోషకరమని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో 8 వేల పోస్టులను భర్తీ చేస్తున్నామని, నెలలోపే ఉపాధ్యాయులు పాఠశాలలకు వస్తారని తెలిపారు. బాలానగర్ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన పరేడ్‌ను అభినందించిన డిప్యూటీ సీఎం కడియం.. వారికి రూ.10వేల బహుమతి అందించారు. కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, విద్యాశాఖ గురుకుల విద్యాలయ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, మైనార్టీ గురుకులాల కార్యదర్శి షఫీవుల్లా, బీసీ గురుకులాల కార్యదర్శి మల్లయ్య భట్టు తదితరులు పాల్గొన్నారు.

బ్రాడ్‌మన్ రికార్డు బద్ధలు


బషీర్ షా

న్యూఢిల్లీ: క్రికెట్‌లో రికార్డులు పుడుతూ ఉంటాయి, బద్దలవుతూ ఉంటాయి. అది సహజం. కానీ ఆస్ట్రేలియా దిగ్గజ బ్యాట్స్‌మన్ డాన్‌బ్రాడ్‌మన్ రికార్డు (టెస్ట్ సగటు 99.94) మాత్రం బద్దలవదని అంతా అనుకున్నారు. అయితే ఆఫ్ఘానిస్థాన్ కుర్రాడు బషీర్ షా బ్రాడ్‌మన్ రికార్డును బద్దలుకొట్టాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యధిక సగటు (121.77)తో బ్రాడ్‌మన్‌ను వెనక్కి నెట్టాడు. ఇప్పటి వరకు 7 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన 18 ఏండ్ల బషీర్ ట్రిపుల్ సెంచరీ (303) కూడా నమోదు చేశాడు. ట్రిపుల్ సెంచరీ సాధించిన అత్యంత పిన్న వయస్కుడి జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు. అంతేకాదు అరంగేట్రంలో అత్యధిక స్కోరు (256) చేసిన రెండో బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు.

తొలి టెస్టు ఓటమితో ఇంటాబయటా విమర్శలు ఎదుర్కొంటున్న భారత టీమ్ మేనేజ్‌మెంట్.. కీలకమైన రెండో టెస్టుకు ఎలాంటి జట్టును ఎంచుకుంటుంది..? ఇప్పుడు సగటు అభిమాని మదిలో మెదులుతున్న ప్రశ్న ఇది. ఒక్క హార్దిక్ పాండ్యా మినహా.. జట్టులోని మిగతా వారందరూ విఫలంకావడంతో అంతా గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో ఓపెనర్ల నుంచి లోయర్ ఆర్డర్ వరకు జట్టులో ఎవరికి స్థానం ఉంటుందో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. మరి ఇలాంటి సమయంలో రహానే ఒక్కడికే మద్దతు ఎందుకు పెరుగుతున్నదో చూద్దాం..!


రహానే

విదేశాల్లో అత్యుత్తమ సగటు కలిగిన బ్యాట్స్‌మన్
సాంకేతికంగా రోహిత్ కంటే మెరుగు

రహానే ఎందుకు?

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

స్వదేశంలో భారత జట్టు విజయాలను చూసి ఒక్కరంటే ఒక్కరు కూడా నోరు మెదపలేదు. వరుసగా తొమ్మిది సిరీస్ విజయాలు అందులో రెండు శ్రీలంకపై, ఓసారి విండీస్, ఇక న్యూజిలాండ్, ఆస్ట్రేలియాపై గెలువడంతో గత 70 ఏండ్లలో ఎన్నడూ లేనంత పటిష్టంగా టీమ్‌ఇండియా ఉందని అందరూ ఆకాశానికెత్తేశారు. కానీ ఒకే ఒక్క మ్యాచ్‌తో అంచనాలన్నీ తారుమారయ్యాయి. విదేశాల్లో మన జట్టు పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని కేప్‌టౌన్ ఓటమితో స్పష్టం చేసింది. అయితే ఈ ఓటమికి కారణాలేంటి..? అద్భుతమైన ఆటగాళ్లు అందుబాటులో ఉన్నా తుది జట్టు ఎంపికలో ఎందుకు అలసత్వం వహించారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. కానీ దీనికి విరాట్ చెప్పిన సమాధానం.. 'ఫామ్' ఆధారంగా ఎంపిక చేశామని. మరి ఇది సరైన సమాధానమేనా..? విదేశాల్లో అత్యుత్తమ సగటు కలిగిన బ్యాట్స్‌మన్‌ను కాదని వన్డే, టీ20ల్లో రాణించిన ఆటగాడిని తీసుకోవడం సమంజసమేనా..?

రహానే ది బెస్ట్

రోహిత్‌తో పోల్చుకుంటే దక్షిణాఫ్రికాలో రహానేకు అద్భుత రికార్డు ఉంది. నాలుగేండ్ల కిందట ధోనీ సారథ్యంలో సఫారీ పర్యటనకు వచ్చిన టీమ్‌ఇండియాలో కోహ్లీ (272), పుజార (280), రహానే (209) మాత్రమే మెరుగ్గా ఆడారు. పేస్‌కు స్వర్గధామమైన బౌన్సీ పిచ్‌లపై ఈ త్రయం పరుగుల వర్షం కురిపించింది. ముఖ్యంగా డర్బన్ టెస్టులో రహానే (96) ఇన్నింగ్స్‌ను ఎప్పటికీ మర్చిపోలేం. అయితే కేవలం దక్షిణాఫ్రికాకే పరిమితం కాలేదు. టెస్టుల్లో అరంగేట్రం (2013) చేసినప్పట్నించీ విదేశాల్లో ఆడిన 24 టెస్టుల్లో రహానే సగటు 53.44. చేసిన పరుగులు 1817. ఇందులో ఆరు సెంచరీలు, 9 అర్ధసెంచరీలు ఉన్నాయి. అదే రోహిత్ విషయానికొస్తే అతని సగటు 25.11 మాత్రమే. ఇందులో ఒక్క సెంచరీ కూడా లేదు. టాప్ ఆర్డర్‌లో ఎక్కువగా రాణించే రోహిత్.. మిడిలార్డర్ భారాన్ని మోయలేడు. ఉన్నతమైన టెక్నిక్స్, గంటల కొద్ది క్రీజులో నిలబడే ఓపిక, ఫిట్‌నెస్, ఏకాగ్రత్త చాలా అవసరం. ఈ అంశాలన్నింటిలో రహానే చాలా పైస్థాయిలో ఉంటాడు. భారత్‌లో లంకతో జరిగిన మూడు టెస్టు సిరీస్‌లో రహానే (17 పరుగులు) విఫలంకావడం అతన్ని అవకాశాలను దెబ్బతీసిందనడం ఏమాత్రం సరైంది కాదు. ఎందుకంటే అంతర్జాతీస్థాయి క్రికెటర్‌కు ఫామ్ అనేది విరామంలాంటిది. ఒకే ఒక్క మ్యాచ్‌తో గత చరిత్రను మొత్తం మార్చగల శక్తి ఉన్న ఆటగాడు రహానే. ఎంత సవాలు ఎదురైతే అతనిలో అంత సామర్థ్యం బయటకు వస్తుంది. కాబట్టి ఫామ్ ఆధారంగా ఎంపిక జరిగిందని కోహ్లీ చెప్పడం కరెక్ట్ కాదు. నాలుగేండ్ల కాలంలో రహానే ఆడిన విలువైన ఇన్నింగ్స్ ముందు రోహిత్ సూపర్ బ్యాటింగ్ తక్కువే. ఎందుకంటే భారత టెస్టు విజయాల్లో పుజార, రహానే పాత్ర వెలకట్టలేనిది.

ఓపెనింగ్‌లో ఎవరు..!

గాయం నుంచి కోలుకుని తొలి టెస్టులో బరిలోకి దిగిన ధవన్ నిరాశపర్చడంతో ఇప్పుడు ఓపెనింగ్‌పై సందేహాలు మొదలయ్యాయి. 2013లో విజయ్ మెరుగ్గా ఆడినా ఈసారి నిరాశపర్చాడు. ఈ ఇద్దరు కలిసి తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో 16, 30 పరుగులు చేయడంతో లోకేశ్ రాహుల్‌కు లైన్ క్లియర్ అయిందని కొంతమంది వాదన. మరి అనుభవజ్ఞుడైన ధవన్‌ను తప్పించే సాహసం చేస్తారా? పదేండ్ల కెరీర్‌లో రెండుసార్లు ఇక్కడ పర్యటించిన విజయ్ కూడా హాఫ్‌సైడ్ బంతులను ఎదుర్కోవడంలో ఘోరంగా విఫలమవుతున్నాడు. సఫారీ పేసర్ల రెండు వైపుల స్వింగ్‌కు సులువుగా వికెట్ సమర్పించుకుంటున్నాడు. మరోవైపు రోహిత్, ధవన్, సాహా, అశ్విన్‌లను తప్పించి రహానే, పార్థివ్, జడేజాలను తీసుకోవాలన్న డిమాండ్ మొదలైంది. రెండో టెస్టుకు ఆరుగురు బ్యాట్స్‌మన్, నలుగురు బౌలర్లు, ఆల్‌రౌండర్‌ను తీసుకోవాలని మేనేజ్‌మెంట్ యోచిస్తున్నది. ఇదే జరిగితే పార్థివ్, రహానేలో ఒకరు ఓపెనర్‌గా రావొచ్చు. ప్రస్తుతానికి ప్రత్యామ్నాయాలు చాలా కనిపిస్తున్నా.. టాప్–5 బ్యాట్స్‌మెన్‌లో ఎవరికి చోటు ఉంటుందన్నదే ఆసక్తికరం.



బుమ్రా పరిస్థితేంటి..?

ఐదుగురు భిన్నమైన పేసర్లను జట్టులోకి తీసుకొచ్చామని గొప్పలకు పోయిన చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ ఇప్పుడు ఏం చెబుతాడో..? అరంగేట్రం మ్యాచ్‌లో అదురగొడుతానుకున్న బుమ్రాకు సఫారీ బ్యాట్స్‌మన్ వ్యూహాత్మకంగా చెక్ పెట్టారు. ముఖ్యంగా డివిలియర్స్ ఎదుర్కొన్న తీరు సూపర్బ్. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి బుమ్రా 4 వికెట్లు తీశాడు. ఊరించే పేస్ పిచ్‌లపై ఈ ప్రదర్శన ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇప్పుడు బుమ్రా కొనసాగింపు మొత్తం టీమ్ మేనేజ్‌మెంట్ పైనే ఆధారపడి ఉంది.

'ముందే' వద్దన్నారు..!



సఫారీ సిరీస్‌కు అన్ని రకాలుగా సిద్ధమయ్యామని భారత టీమ్ మేనేజ్‌మెంట్ చేసిన వ్యాఖలు ఎంత బాధ్యతారాహిత్యమో ఇప్పుడు అర్థమవుతున్నది. తొలి టెస్టు ఓటమితో మేనేజ్‌మెంట్ తీసుకున్న కొన్ని నిర్ణయాల్లో డొల్లతనం బయటపడుతున్నది. వాస్తవానికి కఠినమైన టూర్‌ను దృష్టిలో పెట్టుకుని లంకతో టెస్టు సిరీస్ ముగిసిన వెంబడే రహానే, మురళీ విజయ్, పుజారను ముందుగానే దక్షిణాఫ్రికాకు పంపిస్తామని బీసీసీఐ.. టీమ్ మేనేజ్‌మెంట్ వద్ద ప్రస్తావించింది. వాతావరణ పరిస్థితులకు అలవాటు పడతారని బోర్డు సూచించింది. ఖర్చులు కూడా భరిస్తామని, ఈ త్రయానికి ప్రాక్టీస్ నెట్స్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పింది. కానీ మేనేజ్‌మెంట్ మాత్రం దీనికి ససేమిరా ఒప్పుకోలేదని సమాచారం. దీంతో రహానే, రాహుల్‌ను కాదని తుది జట్టులోకి ధవన్, రోహిత్‌ను తీసుకోవడంపై కూడా అనుమానాలు మొదలయ్యాయి.

మిథాలీ సారథ్యంలోనే సఫారీ టూర్‌కు..

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు భారత మహిళల జట్టును బుధవారం ప్రకటించారు. 16 మంది జట్టుకు హైదరాబాద్ బ్యాట్స్‌వుమన్ మిథాలీ రాజ్ సారథ్యం వహించనుంది. ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్ (2017–2020)లో భాగంగా జరిగే ఈ టూర్ వచ్చే నెల 5న మొదలుకానుంది. వన్డే సిరీస్ తర్వాత జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు కూడా ఇదే జట్టును కొనసాగించే అవకాశాలున్నాయి. గతేడాది జులైలో వరల్డ్‌కప్ మ్యాచ్ ఆడిన తర్వాత టీమ్‌ఇండియాకు మళ్లీ ఇదే మొదటి సిరీస్. జట్టు ఎంపికలో భారీ మార్పులు చేయని సెలెక్టర్లు.. అండర్–19 మ్యాచ్‌లో డబుల్ సెంచరీ చేసిన 17 ఏండ్ల ముంబై యువ బ్యాట్స్‌వుమన్ జెమీమ్ రొడ్రిగేస్‌కు అవకాశం కల్పించారు.

జట్టు వివరాలు: మిథాలీ (కెప్టెన్), హర్మన్‌ప్రీత్, సుష్మ వర్మ, ఏక్తా బిస్త్, స్మృతి మందన, పూనమ్ యాదవ్, పూనమ్ రౌత్, రాజేశ్వరి, రొడ్రిగేస్, జులన్, దీప్తి, శిఖా పాండే, మోనా మేశ్రమ్, పూజ, వేదా కృష్ణమూర్తి, తనియా బాటియా.


మిథాలీ

ఐర్లాండ్‌తో రెండు టీ20 మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా ఐర్లాండ్ పర్యటన ఖరారైంది. భారత్ ఆ జట్టుతో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడుతుందని, మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం నాడు ప్రకటించింది. డబ్లిన్‌లో జూన్ 27, 29న ఈ రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. జూలైలో భారత్, ఇంగ్లండ్ పర్యటకు సన్నాహకంగా ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి. 2007లో చివరిసారిగా ఐర్లాండ్‌లో పర్యటించిన భారత్ ఒకే ఒక వన్డే మ్యాచ్ ఆడి విజయం సాధించింది. ఇక 2009 టీ20 ప్రపంచకప్‌లో భారత్, ఐర్లాండ్‌తో టీ20 మ్యాచ్ ఆడింది. ఆ తర్వాత మళ్లీ ఆ జట్టుతో టీ20ల్లో తలపడబోతున్నది.

యుకీ, రామ్‌కుమార్ ముందంజ


యుకీ

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన ఆస్ట్రేలియన్ ఓపెన్ అర్హత మ్యాచ్‌ల్లో భారత ఆటగాళ్లు యుకీ భాంబ్రీ, రామ్‌కుమార్ రామనాథన్ ముందంజ వేశారు. సింగిల్స్ తొలి రౌండ్‌లో యుకీ 1–6, 6–3, 6–4తో బ్రాడ్లీ ష్నుర్‌పై విజయం సాధించాడు. మరో పోరులో రామ్‌నాథన్ 6–7(8), 7–6(3), 6–2తో బ్రాడ్లె క్లాన్(అమెరికా)పై గెలిచి గ్లెబ్ సక్రోవ్(ఫ్రాన్స్)తో రెండో రౌండ్ పోరుకు సిద్ధమయ్యాడు. వేర్వేరు సింగిల్స్ మ్యాచ్‌ల్లో ప్రజ్నేష్ గుణేశ్వరన్, సుమిత్ నాగల్ ప్రత్యర్థుల చేతుల్లో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.



ఆంచల్.. అదుర్స్

స్కీయింగ్‌లో భారత్‌కు తొలి అంతర్జాతీయ పతకం
అల్‌పైన్ ఎజ్డెర్ టోర్నీలో కాంస్యం

న్యూఢిల్లీ: భారత క్రీడాచరిత్రలో మరో సంచలనం. స్కీయింగ్‌లో ఇప్పటివరకు ఎవరూ సాధించని ఘన చరిత్రను హిమాచల్ ప్రదేశ్ ప్లేయర్ ఆంచల్ ఠాకూర్ సొంతం చేసుకుంది. అంతర్జాతీయ స్కీయింగ్ సమాఖ్య (ఎఫ్ఐఎస్) ఆధ్వర్యంలో టర్కీలో జరిగిన ప్రతిష్టాత్మక 'అల్‌పైన్ ఎజ్డెర్ 3200' టోర్నీలో ఆంచల్ కాంస్య పతకం గెలిచింది. మంగళవారం ఆద్యంతం ఉత్కంఠ భరితంగా జరిగిన 'స్లాలోమ్' రేసులో 21 ఏండ్ల ఆంచల్ మూడోస్థానంలో నిలిచింది. అంతర్జాతీయ స్కీయింగ్ ఈవెంట్లలో భారత్‌కు ఇది తొలి పతకం కావడం విశేషం. భారత్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి అమ్మాయిగా రికార్డులకెక్కిన ఆంచల్.. వింటర్ ఒలింపిక్స్‌కు ముందు కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. అంతర్జాతీయస్థాయిలో తొలి పతకం అందుకున్నందుకు ఈ మనాలీ అమ్మాయి సంతోషం వ్యక్తం చేసింది.

తండ్రి బాటలోనే..

ఆంచల్ తండ్రి రోషన్ ఠాకూర్ కూడా స్కీయింగ్ క్రీడాకారుడే. వింటర్ గేమ్స్ ఫెడరేషన్‌కు కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. 'నా కూతురు ఆంచల్ పతకం సాధించిన తర్వాత వీడియో కాల్ చేసి మాట్లాడింది. ఆ సమయంలో పతకాన్ని చూసి అందరితో పాటు ఇచ్చిన ప్రోత్సాహక పతకం అనుకున్నా. కానీ కాంస్యం గెలిచానని చెప్పేసరికి సంతోషాన్ని అపుకోలేకపోయా' అని రోషన్ ఠాకూర్ తెలిపాడు. నిజానికి రోషన్ ఫ్యామిలీలో కూతురు ఆంచల్‌తో పాటు కుమారుడు హిమాన్షు కూడా స్కీయింగ్ క్రీడాకారుడే. ఇతడు సోచిలో జరిగిన వింటర్ ఒలింపిక్స్‌లో ల్యూజ్ క్రీడాకారుడు శివకేశవన్‌తో కలిసి పాల్గొన్నాడు.

ప్రధాని అభినందనలు

కాంస్యం గెలిచిన ఆంచల్‌ను భారత ప్రధాని నరేంద్ర మోదీ ట్విట్టర్‌లో అభినందించారు. 'నీ చారిత్రక విజయాన్ని చూసి యావత్ భారతదేశం గర్విస్తున్నది. భవిష్యత్‌లో నీవు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నా' అని ప్రధాని ట్వీట్ చేశారు. క్రీడా మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ కూడా ట్విట్టర్ ద్వారా ఆంచల్‌కు అభినందనలు తెలిపారు. అయితే ప్రధాని నుంచి తనకు అభినందనలు లభిస్తాయని ఊహించలేదని ఆంచల్ తెలిపింది. 'ప్రధాని నాకు ట్వీట్ చేస్తారని నేను అస్సలు ఊహించలేదు. ప్రాచుర్యం పొందిన ఆటల్లోని క్రీడాకారులతో సమానంగా మమ్మల్ని చూస్తారని అనుకుంటున్నా. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మాకు ఎటువంటి సహకారం అందలేదు' అని ఆంచల్ పేర్కొంది.

రూ. 5 లక్షల క్యాష్ ప్రైజ్

పతకం సాధించిన ఆంచల్‌కు హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జయరామ్ ఠాకూర్ రూ. 5 లక్షల నగదు బహుమతిని ప్రకటించారు.


హ్యున్

సెమీస్‌లో ఢిల్లీ

హైదరాబాద్: అందివచ్చిన అవకాశాన్ని సొమ్ము చేసుకుంటూ ఢిల్లీ డ్యాషర్స్ పీబీఎల్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 4–1తో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌పై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో షిన్ బేక్, మిచెల్లీ లీ (నార్త్ ఈస్టర్న్) 15–13, 15–11తో పొన్నప్ప, ఇవనోవ్ జోడిపై, పురుషుల సింగిల్స్‌లో విన్సెంట్ (ఢిల్లీ) 15–13, 10–15 15–12తో అజయ్ జయరామ్‌పై, మరో పురుషుల సింగిల్స్‌లో హౌవేయ్ (ఢిల్లీ) 15–10, 8–15, 15–11తో తియాన్‌పై, మహిళల సింగిల్స్‌లో హ్యున్ (ఢిల్లీ) 13–15, 15–11, 15–13తో మిచెల్లీ లీపై, పురుషుల డబుల్స్‌లో కిమ్ జంగ్, షిన్ బేక్(నార్త్ ఈస్టర్న్) 9–15 15–10 15–9తో ఇవనోవ్, సొజనోవ్ జోడిపై విజయం సాధించారు.



రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ క్రీడలు ప్రారంభం

వరంగల్ (మట్టెవాడ): మానసిక ఆరోగ్యంతోపాటు శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని వరంగల్ పశ్చిమ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో రాష్ట్రస్థాయి బాలుర పాలిటెక్నిక్ క్రీడలను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈనెల 10 నుంచి 12 వరకు జరుగనున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి దాదాపు 600 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.

సాకర్ సెమీస్‌లో రంగారెడ్డి, నిజామాబాద్

నిజామాబాద్ స్పోర్ట్స్: జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సీనియర్ మహిళాల ఫుట్‌బాల్ టోర్నీ రసవత్తరంగా కొనసాగుతున్నది. టోర్నీ రెండో రోజైన బుధవారం తొమ్మిది మ్యాచులు జరిగాయి. వరుస విజయాలతో ఆధిక్యంలో ఉన్న నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి, మెదక్ జిల్లాల జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. నిజామాబాద్ 1–0తో మెదక్‌పై, ఖమ్మం 2–1తో వరంగల్‌పై, రంగారెడ్డి 3–0తో వరంగల్‌పై, మెదక్ 5–0తో కరీంనగర్‌పై విజయాలు నమోదు చేసుకున్నాయి. గురువారం జరిగే సెమీస్ మ్యాచ్‌ల్లో ఖమ్మం, నిజామాబాద్‌తో, రంగారెడ్డి, మెదక్‌తో తలపడుతాయి. నిజామాబాద్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు, సాట్స్ పరిశీలకుడు రాములు హాజరయ్యారు.

అదురగొట్టిన జూనియర్ ద్రవిడ్

■ సునీల్ జోషి తనయుడు కూడా..


సమిత్

బెంగళూరు: మొన్న సచిన్ కొడుకు.. నేడు ద్రవిడ్ తనయుడు.. క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నారు. కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) ఆధ్వర్యంలో జరిగిన బీటీఆర్ కప్ ఇంటర్ స్కూల్ అండర్–14 టోర్నీలో ద్రవిడ్ తనయుడు సమిత్ ద్రవిడ్ (150), సునీల్ జోషీ కుమారుడు ఆర్యన్ జోషీ (154) సెంచరీలతో హోరెత్తించారు. మాల్యా అదితి ఇంటర్నేషనల్ స్కూల్ తరపున బరిలోకి దిగిన ఈ ఇద్దరూ.. వివేకానంద స్కూల్ బౌలర్లను ఉతికి ఆరేశారు. దీంతో మాల్యా అదితి జట్టు 50 ఓవర్లలో 500 పరుగుల భారీ స్కోరు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన వివేకానంద టీమ్ 88 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా మాల్యా అదితి జట్టు 412 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండేండ్ల కిందట ఇదే టోర్నీలో సమిత్ 125 పరుగులు చేశాడు.

నిఖత్‌కు పతకం పక్కా

■ సెమీఫైనల్లో సరిత, సోనియా
■ జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్

రోహ్‌తక్: తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ జాతీయ మహిళల చాంపియన్‌షిప్‌లో అడుపెట్టిన తొలిసారే పతకాన్ని ఖాయం చేసుకున్నది. మరోవైపు ప్రపంచ మాజీ చాంపియన్ సరితాదేవి, ఏషియన్ కాంస్య పతక విజేత సోనియా లాథర్ సెమీఫైనల్‌కు చేరారు. బుధవారం ఇక్కడ జరిగిన పోటీల్లో నిజామాబాద్ మహిళా బాక్సర్ నిఖత్(51 కి) అభా (ఛత్తీస్‌ఘడ్)పై విజయం సాధించింది.ఇక 60 కిలోల విభాగంలో సరిత (ఏఐసీ), అక్విలియా దుపక్ (అరుణాచల్‌ప్రదేశ్)పై... 57 కిలోల విభాగంలో సోనియా (ఆర్ఎస్‌పీబీ) 5–0తో కమలా బిస్త్ (ఉత్తరాఖండ్)ను ఓడించి సెమీస్‌కు చేరారు. మెడల్స్ రౌండ్‌కు చేరిన వారిలో పవిత్ర(60 కి), సర్జుబాల దేవి (48 కి) ఉన్నారు.


నిఖత్

మహిళా బాక్సర్ల ప్రతినిధి సరిత

సమాఖ్య కార్యనిర్వాహక మండలిలోని మహిళా బాక్సర్లకు ప్రతినిధిగా సరితాదేవిని ఎన్నుకున్నారు. జనవరి 28 నుంచి ప్రారంభం కానున్న భారత ఓపెన్ బాక్సింగ్ టోర్నమెంట్ బాక్సింగ్ దిగ్గజాలు క్యూబా, రష్యాతో కలిపి మొత్తం 25 దేశాలు పాల్గొంటున్నాయి. భారత్ తరపున నాలుగు జట్లు బరిలోకి దిగుతున్నాయి.

దీపాల్ సెంచరీ

న్యూఢిల్లీ: హర్యానా బ్యాట్స్‌మన్ దీపాల్ మాలిక్ (179) భారీ సెంచరీ చేయడంతో.. బ్లైండ్ క్రికెట్ వరల్డ్‌కప్‌లో భారత్ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలిచింది. ముందుగా లంక 40 ఓవర్లలో 358/8 స్కోరు చేసింది. సంపత్ (68), సిల్వ (64) రాణించారు. తొలి 15 ఓవర్లలో లంకేయులు వికెట్ నష్టానికి 121 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచారు. లక్ష్య ఛేదనలో టీమ్‌ఇండియా నిలకడగా ఆడింది. ప్రత్యర్థుల బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొంటూ 32 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. దీపాల్‌కు తోడుగా జయరామ్మి (76) చెలరేగాడు. కెప్టెన్ అజయ్ రెడ్డి (9) విఫలమైన ఆమిగతా బ్యాట్స్‌మెన్ అంచనాలకు అనుగుణంగా రాణించారు. దీపాల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.


సరిత

హర్యానా శుభారంభం

న్యూఢిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్(పీడబ్ల్యూఎల్)లో హర్యానా హ్యామర్స్ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో హర్యానా 5–2తో వీర్ మరాఠాస్‌పై విజయం సాధించింది. 62 కేజీల కీలక బౌట్‌లో సరిత 4–3తో మంజుపై గెలిచింది. తొలి మూడు బౌట్లలో హర్యానా రెజ్లర్లు పూజ, రౌబ్లిత్‌సింగ్ ప్రత్యర్థుల చేతుల్లో ఓడగా, వ్లాదిమిర్ గెలిచాడు. 1–2తో వెనుకంజలో పుంజుకున్న హర్యానా చివరి నాలుగు బౌట్లలో గెలిచి విజేతగా నిలిచింది. రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేతలు హెలెన్ మార్కోలిస్, హర్పుల్..తమ ప్రత్యర్థులపై అలవోక విజయాలు నమోదు చేసుకున్నారు. స్టార్ రెజ్లర్ సుశీల్‌కుమార్‌తో గొడవపడి వార్తల్లోకెక్కిన పర్వీన్ రానా 0–10తో త్సబలోవ్‌పై చిత్తుగా ఓడిపోయాడు.

జాతీయ పరీక్షలకు తగ్గట్టుగా పాఠ్యాంశాలు!

- జేఈఈ, నీట్‌కు అనుగుణంగా మార్పుల యోచనలో విద్యాశాఖ
- త్వరలో సబ్జెక్టు నిపుణులు, ఎస్సీఈఆర్టీ అధికారులతో సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర విద్యావిధానంలో అమలవుతున్న పాఠ్యాంశాల్లో సమూల మార్పులు తీసుకొచ్చే దిశగా పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది. జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలైన నీట్, జేఈఈలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పులు చేసేందుకు సిద్ధమవుతున్నది. నేషనల్ కరిక్యులం ఫ్రేంవర్క్ (ఎన్సీఎఫ్) ప్రమాణాలకు ఆటంకం కలుగకుండా మార్పులు చేయాల్సిన అవసరాన్ని ఇప్పటికే విద్యాశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పలుసార్లు పాఠశాల విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మార్పులపై పాఠశాల విద్యాశాఖ, రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన మండలి (ఎస్సీఈఆర్టీ) అధికారులు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. కేవలం గణితం, సామాన్యశాస్త్రం, భౌతికశాస్త్రం, జీవ శాస్త్రంలో మార్పులు చేయాలని భావిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి పాఠ్యాంశాల్లో కూడా మార్పులు తీసుకొస్తే మంచి ఫలితాలు వస్తాయని విశ్లేషిస్తున్నారు. ఈ మేరకు త్వరలో సబ్జెక్టు నిపుణులు, ఎస్సీఈఆర్టీ అధికారులతో సమావేశం కానున్నారు. 2019-2020 విద్యాసంవత్సరం నుంచి నూతన పాఠ్యాంశాలు అమల్లోకి తీసుకొచ్చే ఆలోచనలో అధికారులు ఉన్నారు. రాష్ట్రంలో 840 గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో కలిపి 1.08 లక్షల మంది విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్నారు. కానీ వీరికి అకడమిక్ పద్ధతితోపాటు ప్రవేశ పరీక్షల తరహాలో పాఠ్యాంశాలను బోధిస్తే జాతీయస్థాయిలో జేఈఈ, నీట్, ప్రాంతీయ ఇంజినీరింగ్ కాలేజీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో సీట్లు సాధించడం తేలికవుతుంది. ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే ప్రతిభావంతులకు వేసవి సెలవుల్లో జేఈఈ, నీట్, ఎంసెట్‌కు ప్రత్యేకంగా కోచింగ్ ఇవ్వాలన్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ఆదేశాలతో ఇంటర్మీడియట్ బోర్డు చర్యలు చేపట్టింది. ప్రతి జిల్లాకు రెండు వేల మందిని ఎంపిక చేసి, ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

ఈ-వెహికల్స్ హబ్‌గా తెలంగాణ!

- రాష్ట్రంలో పెట్టుబడులకు రాయితీలు
- విధివిధానాలపై రవాణాశాఖ ఉన్నతాధికారుల చర్చలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణను ఈ-వెహికిల్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. ప్రస్తుతమున్న డీజిల్, పెట్రోల్ వాహనాలు వెదజల్లుతున్న కాలుష్యం బారి నుంచి తప్పించుకునేందుకు, ఈ-వాహనాలను ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుపుతున్నది. రాష్ట్రంలో బ్యాటరీతో నడిచే ఈ-వెహికిల్స్ తయారీ సంస్థల స్థాపనకు పలు రకాల రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నది. రాష్ట్రంలో ఈ-వాహనాల కంపెనీల పెట్టుబడులకు ఇవ్వాల్సిన రాయితీలపై అధికారులు సమీక్షించారు. ఈ-వెహికల్స్‌పై విధివిధానాల కూర్పు ఎలా ఉండాలనే అంశంపై బుధవారం సచివాలయంలో రవాణాశాఖ ఉన్నతాధికారులు చర్చించారు. రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ ఆధ్వర్యంలో దీనిపై ఒక కమిటీ వేశారు. ఇందులో రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్, ప్రవీణ్‌రావు, ఎంవీఐ సాయిరాం రెడ్డి ఉన్నారు. ఈ వాహనాలకు రీ చార్జింగ్ కోసం పాయింట్లను ఏర్పాటుచేసి ఎక్కడికక్కడ చార్జింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని ప్రతిపాదించారు. హైదరాబాద్‌లో ఆటో రిక్షాల రిజిస్ట్రేషన్లు నిషేధించినందున కొత్తగా వచ్చే ఈ-వాహనాలకు అనుమతించాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

ఖైదీలకు త్వరలో వీడియో కాల్ సదుపాయం

జైళ్లశాఖలో మొదలైన కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంస్కరణలతో ఖైదీల మానసిక పరివర్తనలో మార్పు తీసుకొస్తున్న జైళ్లశాఖ.. మరో కొత్త విధానానికి కసరత్తు మొదలుపెట్టింది. జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ఇప్పటికే తమ వారితో ఫోన్‌లో మాట్లాడుతుండగా.. ఇక నుంచి వారికి వీడియో కాల్ సౌకర్యం కల్పించనున్నది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అన్ని రాష్ట్రాల జైళ్లశాఖ డీజీల సమావేశంలో అనేక అంశాలతోపాటు ఖైదీల అందిస్తున్న సదుపాయాలపై ప్రధానాంశంగా చర్చించారు. మహారాష్ట్ర జైలులో ప్రయోగాత్మకంగా ఖైదీల కోసం వీడియా కాల్ విధానాన్ని ప్రవేశపెట్టినట్టు సమావేశంలో అక్కడి అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్ర జైళ్లశాఖ అధికారులు ఆ విధానంపై దృష్టిపెట్టారు. వీడియోకాల్ ద్వారా ఖైదీలు తమవారితో మాట్లాడటంతో మానసికంగా సంతోషంగా ఉంటారని అధికారులు భావిస్తున్నారు. జైళ్ల నిబంధనల ప్రకారం ప్రస్తుతం ఖైదీలు తమ కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడేందుకు పూర్తివివరాలతో ముందుగానే పేర్లను నమోదుచేసుకుంటారు. వారంలో రెండుసార్లు, పరిమిత సమయంలో మాట్లాడే అవకాశం ఉన్నది. అయితే, ఖైదీలు ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్న విషయాన్ని అధికారులు గుర్తించలేకపోతున్నారు. వీడియో కాల్ విధానం అమలులోకి వస్తే రికార్డు ఆధారంగా ఖైదీలు ఎవరితో మాట్లాడారన్న విషయాన్ని కూడా గుర్తించేందుకు వీలుంటుంది. ప్రస్తుతం టెలిఫోన్ ద్వారా ఖైదీలు మాట్లాడుతున్నారని, వీడియో కాల్ సదుపాయం ఏర్పాటుపై కసరత్తు జరుగుతున్నదని జైళ్లశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

పదిమంది కన్ఫర్డ్ ఐఏఎస్‌ల జాబితాకు ఆమోదం

రెండు మూడురోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి చెందిన 10 మంది సీనియర్ డిప్యూటీ కలెక్టర్లు కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా ఎంపికయ్యారు. బుధవారం ఢిల్లీలో యూపీఎస్సీ చైర్మన్ అధ్యక్షతన సెలక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం పంపించిన 10 మంది సీనియర్ అధికారుల జాబితాను ఆమోదించారు. ఈ జాబితా కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సిబ్బంది శిక్షణ వ్యవహారాల విభాగానికి చేరినట్టు తెలిసింది. మూడురోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు సమాచారం. రాష్ట్రంలో 2014, 15, 16 సంవత్సరాలకు కలిపి 16 ఖాళీలు ఉన్నాయి. ఈ మూడేండ్లలో ఖాళీల భర్తీకి అర్హత ఉన్న 10 మంది సీనియర్ అధికారుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం గతనెల చివరివారంలో యూపీఎస్సీకి పంపింది. కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా ఎంపికైన వారిలో కొర్రలక్ష్మి, చిట్టెం లక్ష్మి, ధర్మారెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, శివలింగయ్య, వీ వెంకటేశ్వర్లు, ఎం హన్మంతరావు, డీ అమోయ్‌కుమార్, కే హైమావతి, ఎం హరిత ఉన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, రెవెన్యూశాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారి, జీఏపీ ముఖ్య కార్యదర్శి అధర్‌సిన్హాలు పాల్గొన్నారు.

ఆఫీస్ స్పేస్‌లో హైదరాబాద్ హవా..!

నైట్ ఫ్రాంక్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆఫీస్ స్పేస్ డిమాండ్‌లో దేశవ్యాప్తంగా హైదరాబాద్‌కు ఉన్న క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. వాణిజ్య సముదాయాల్లో ఉన్న విస్తీర్ణం ఆధారంగా అత్యధిక లావాదేవీలను గతేడాది చివరి అర్థ సంవత్సరానికి నమోదుచేసింది. మొత్తం 3.34 మిలియన్ చదరపు అడుగులకు సంబంధించిన లావాదేవీలు జరిగినట్టు ప్రముఖ స్వతంత్ర గ్లోబల్ ప్రాపర్టీ కన్సల్టెన్సీ నైట్ ఫ్రాంక్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడయింది. దేశంలోని 8 ప్రధాన నగరాలు హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ముంబై, ఢిల్లీ, పుణేలో రియల్ ఎస్టేట్ తీరుతెన్నులపై సర్వే నిర్వహించింది. దీని ప్రకారం.. ఆఫీస్ స్పేస్‌లో మిగతా నగరాలకంటే ఎక్కువ డిమాండ్‌ను సొంతం చేసుకున్న భాగ్యనగరం అదే వేగాన్ని కొనసాగిస్తున్నది. నాణ్యమైన ఆఫీస్ ప్రదేశాల పట్ల ఆసక్తి కారణంగా మాదాపూర్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడాలో 2 నుంచి 4 శాతం పెరిగినట్టు వెల్లడయింది. చివరి ఆరునెలల్లో ఐటీ, ఐటీఈఎస్ గతంలో పోల్చుకుంటే 75 శాతం కోలుకుందని తెలిపింది. అధ్యయనం వివరాలను నైట్ ఫ్రాంక్ ఇండియా డైరెక్టర్ శాంసన్ అర్థర్ బుధవారం వివరించారు. ఆఫీస్ మార్కెట్‌పరంగా.. హైదరాబాద్ చివరి ఆరునెలల్లో రికార్డు నమోదుచేసిందన్నారు. రెసిడెన్షియల్ మార్కెట్ మాత్రం పడిపోయిందని వివరించారు.

రిజిస్ట్రేషన్లలో డిసెంబర్ రికార్డు

- రిజిస్ట్రేషన్ శాఖలో వేగవంతమైన సేవలు
- గతనెల రికార్డు సంఖ్యలో రిజిస్ట్రేషన్‌లు
- సర్కారు ఆదాయమూ పెరిగింది
- సొంత సర్వర్, డెడికేటెడ్ లైన్‌తో సమస్యలు హాంఫట్

(ప్రత్యేక ప్రతినిధి,నమస్తేతెలంగాణ)



రిజిస్ట్రేషన్ శాఖ సేవలు వేగవంతం కావడంతో డిసెంబర్‌లో రికార్డుస్థాయిలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. తరుచూ సర్వర్‌డౌన్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సమస్యలతో సతమతమైన రిజిస్ట్రేషన్ శాఖ ఆధునిక సాంకేతిక హంగులను సమకూర్చుకుని ప్రజలకు సత్వరసేవలను అందించగలుగుతున్నది. డిసెంబర్ నెలలో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఆధునీకరణ, రెయిల్‌టెల్ డెడికేటెడ్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్‌శాఖకు కొత్త హంగులు సమకూరాయి. ఫలితంగా పనులు ఆగమేఘాల మీద పూర్తవుతున్నాయి. డాక్యుమెంట్ తయారైన తర్వాత నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్లు పూర్తవుతున్నాయి. రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు కూడా పార్టీల చేతికి వస్తున్నాయి. ఫలితంగా డాక్యుమెంట్లు పెండింగ్‌లో లేకుండా చకచకా రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. డిసెంబర్‌లో రికార్డు స్థాయిలో 1,08,624 డాక్యుమెంట్‌లు రిజిస్ట్రేషన్ కాగా రూ. 429.99 కోట్లు ప్రభుత్వానికి రాబడి వచ్చింది. గత కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుపుంజుకున్నప్పటికీ నవంబర్ 2017 వరకు నెలకు సగటున సుమారు 80 నుంచి 90 వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యేవి. రూ. 350నుంచి 390 కోట్ల వరకు ఆదాయం వచ్చేది. కానీ డిసెంబర్‌లో రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు లక్ష దాటాయి. గత ఏడాది 2016 డిసెంబర్‌లో 68427 డాక్యుమెంట్‌లు రిజిస్ట్రేషన్ కాగా రూ.238.71 కోట్ల రూపాయల రాబడి మాత్రమే వచ్చింది.

సాంకేతిక సమస్యలకు చెక్

సాంకేతిక సమస్యలకు తావివ్వకుండా రిజిస్ట్రేషన్‌ల కోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్(ఐటీ అండ్ సీ) డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేట్ డాటా సెంటర్‌లో ప్రత్యేక సర్వర్‌ను ఏర్పాటు చేశారు. కొత్త సర్వర్‌కు మొత్తం డాటాను అనుసంధానం చేశారు. ఇంతకాలం ఆంధ్రప్రదేశ్‌తో కలిసి ఉమ్మడిగా ఉన్న సర్వర్‌ను వేరుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, పన్నెండు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆరు డీఐజీ కార్యాలయాల్లో ఇండియన్ రైల్వేకు చెందిన రెయిల్‌టెల్ సాఫ్ట్‌వేర్ సంస్థ డెడికేటెడ్ లైన్లను ఏర్పాటుచేసింది. ఇంతవరకు లీజ్డ్‌లైన్ వల్ల తరుచుగా సాంకేతిక సమస్యలు తలెత్తేవి. కానీ డెడికేటెడ్ లైన్‌ల ఏర్పాటు వల్ల ఈ సమస్యకు శాశ్వతంగా తెరపడింది. ఇక ప్రత్యేక సర్వర్ వల్ల చాలాకాలంగా రిజిస్ట్రేషన్ శాఖను పట్టిపీడిస్తున్న సర్వర్‌డౌన్ సమస్య లేకుండాపోయింది. దీనికిగానూ రాష్ట్ర ప్రభుత్వం రెయిల్‌టెల్‌కు ఏడాదికి కోటి 20 లక్షల రూపాయలను చెల్లిస్తున్నది. వాస్తవానికి 1999 ఫిబ్రవరిలో అన్నిశాఖల కంటే ముందుగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలోనే కంప్యూటరీకరణ జరిగింది. అప్పటినుంచి హార్డ్‌వేర్‌ను, సాఫ్ట్‌వేర్‌ను మార్చకపోవడం వల్ల సాంకేతిక సమస్యలు వెన్నంటడం మొదలైంది. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధతో చేపట్టిన చర్యల వల్ల ఈ సమస్యలకు తెరపడింది. ఆస్తి ఎవరి పేరు మీదున్నది? తమ పేరున బదిలీ అయిందా లేదా? అనేది తెలుసుకోవడానికి ఎంకంబరెన్స్ సర్టిఫికెట్, సెర్చ్‌రిపోర్ట్ తీసుకోవాలంటే ఇదివరకు రెండు నుంచి నాలుగురోజులు పట్టేది. కానీ ఇప్పుడు ఆ పని కొన్ని గంటల్లోనే పూర్తవుతున్నది. ప్రజలకు దీనివల్ల ఎంతో సౌలభ్యం ఏర్పడింది.

సేవల్లో వేగం.. ఉద్యోగ సంఘాల హర్షం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్లక్ష్యానికి గురైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సేవలను ఆధునీకరించడం వల్ల సేవలు వేగవంతమయ్యాయని రిజిస్ట్రేషన్ ఉద్యోగసంఘాలు పేర్కొన్నాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వేగంతోపాటు మరింత పారదర్శకత పెరిగిందని రాష్ట్ర టీజీవో కోశాధికారి గోన విష్ణువర్ధన్‌రావు, ఉపాధ్యక్షుడు సామల సహదేవ్, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, హైదరాబాద్ టీఎన్జీవో అధ్యక్షుడు ముజీబ్ పేర్కొన్నారు.

కిడ్నాపర్ల నుంచి తప్పించుకున్న పాక్ జర్నలిస్టు

- ఫ్రాన్స్ 24తోపాటు భారత టీవీ చానెల్ వియాన్‌కు సేవలందిస్తున్న తాహా సిద్దిఖీ
- ఫ్రాన్స్ అత్యున్నత జర్నలిజం అవార్డు గ్రహీత

ఇస్లామాబాద్, జనవరి 10: పాకిస్థాన్‌లో ప్రముఖ జర్నలిస్టు, తన దేశ ఆర్మీపై విమర్శనాస్త్రాలు సంధించే తాహా సిద్దిఖీపై కిడ్నాప్ యత్నం జరిగింది. బుధవారం సుమారు 12 మంది సాయుధులు కిడ్నాప్‌కు యత్నించగా ఆయన తృటిలో తప్పించుకున్నారు. ఫ్రాన్స్ 24తోపాటు భారత టెలివిజన్ చానెల్ వియాన్‌కు పాకిస్థాన్ బ్యూరో చీఫ్‌గా తాహా సిద్దిఖీ పనిచేస్తున్నారు. ఇస్లామాబాద్ నుంచి రావల్పిండి విమానాశ్రయానికి ట్యాక్సీలో వెళ్తుండగా కిడ్నాప్ యత్నం జరిగింది. ఈ ఘటనలో స్వల్పంగా గాయపడ్డానని, కిడ్నాపర్ల బారి నుంచి తప్పించుకొని పోలీసుల వద్ద తాను క్షేమంగా ఉన్నానని ఆయన ట్విట్టర్‌లో తెలిపారు. 'బుధవారం ఉదయం 8.20 గంటలప్రాంతంలో రావల్పిండి విమానాశ్రయానికి ట్యాక్సీలో వస్తుండగా 10-12 మంది గుర్తుతెలియని సాయుధులు కారును అడ్డుకున్నారు. కిడ్నాప్ చేసేందుకు యత్నించారు. తుపాకీతో కాల్చి చంపేయండని అరిచారు. అక్కడి నుంచి తృటిలో తప్పించుకున్నాను. ప్రస్తుతం పోలీసుల వద్ద క్షేమంగా ఉన్నాను. బలవంతపు అదృశ్యాలను ఆపేందుకు ఏ రూపంలోనైనా మద్దతు కోసం ఎదురుచూస్తున్నాను' అని వరుస ట్వీట్లలో తాహా సిద్దిఖీ పేర్కొన్నారు. కిడ్నాప్ ఘటనపై ఇస్లామాబాద్ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఫ్రాన్స్ అత్యున్నత జర్నలిజం అవార్డు లాండ్రెస్ ప్రైజ్-2014ను తాహా సిద్దిఖీ సాధించారు. గత ఏడాది ఐదుగురు పాక్ బ్లాగర్లు అదృశ్యంగా కాగా, వారిలో నలుగురే తిరిగి వచ్చారు. సోషల్ మీడియాలో కార్యకర్తల అదృశ్యాలపై పాక్ ఆర్మీని సిద్దిఖీ విమర్శించారు. దీంతో గత మే లో ఎఫ్ఐఏ ఆయనకు నోటీసులు జారీచేసింది.



తాహా సిద్దిఖీ

చలి వణుకు జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
మంచిర్యాల	29.0	6.7
కుమ్రంభీం ఆసిఫాబాద్	29.0	6.7
ఆదిలాబాద్	29.0	7.6
నిర్మల్	29.0	7.6
జగిత్యాల	29.5	10.0
వరంగల్ రూరల్	30.0	12.0
కరీంనగర్	33.9	12.3
పెద్దపల్లి	29.8	12.8
ఖమ్మం	30.0	13.0
వికారాబాద్	30.2	13.3
వరంగల్ అర్బన్	28.5	14.5
జనగామ	28.0	15.0
మెదక్	30.3	15.4
సంగారెడ్డి	30.3	15.4
సిద్దిపేట	30.3	15.4
నిజామాబాద్	29.6	15.6
కామారెడ్డి	29.6	15.6
సూర్యాపేట	29.0	16.0
మహబూబాబాద్	29.0	16.0
రాజన్న సిరిసిల్ల	30.0	16.0
జయశంకర్ భూపాలపల్లి	31.0	16.0
వనపర్తి	30.2	16.5
నల్లగొండ	29.0	16.6
యాదాద్రి భువనగిరి	29.0	17.0
మహబూబ్‌నగర్	32.9	17.6
నాగర్‌కర్నూల్	31.0	17.0
భద్రాద్రి కొత్తగూడెం	32.0	17.0
హైదరాబాద్	30.0	18.0
రంగారెడ్డి	30.0	18.0
మేడ్చల్	30.0	18.0
జోగుళాంబ గద్వాల	30.0	19.0

పెరిగిన చలిగాలుల తీవ్రత

కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో సాధారణం కంటే 3 డిగ్రీల మేర తగ్గుదల.. టీఎస్‌డీపీఎస్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ / ఆదిలాబాద్ అర్బన్ నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా చలిగాలుల తీవ్రత పెరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి చలిగాలులు మొదలవుతున్నాయి. తెల్లవారుజామున గాలుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయని టీఎస్‌డీపీఎస్ (తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ) వెల్లడించింది. రానున్న మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలకు తగ్గనున్నట్టు తెలిపింది. ప్రధానంగా ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉన్నట్టు తెలిపింది. బుధవారం అత్యల్పంగా ఆదిలాబాద్‌లో 7.6 డిగ్రీలు, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 8.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నిర్మల్‌లో 10.4 డిగ్రీలు, మేడ్చల్‌లో 10.8, జగిత్యాలలో 11.3 డిగ్రీలు, మంచిర్యాల, భూపాలపల్లి, మహబూబాబాద్, సిరిసిల్లల్లో 11.4 డిగ్రీల చొప్పున, నిజామాబాద్, సంగారెడ్డిల్లో 11.6 డిగ్రీలు, సిద్దిపేట, వికారాబాద్, మహబూబ్‌నగర్‌ల్లో 12.1 డిగ్రీలు, వరంగల్‌లో 12.5 డిగ్రీలు, భువనగిరిలో 13.2 డిగ్రీలు, నాగర్‌కర్నూల్‌లో 13.5 డిగ్రీలు, నల్లగొండలో 13.8 డిగ్రీలు, ఖమ్మం, హైదరాబాద్‌ల్లో 14.1 డిగ్రీలు, సూర్యాపేటలో 15 డిగ్రీలు, జోగుళాంబ గద్వాలలో 15.2 డిగ్రీలు, వనపర్తిలో 15.8 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇటు ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో ఉన్న మారుమూల గ్రామాల్లో చలి తీవ్రత పెరిగింది. ఉదయం 10 గంటలైనా చలి తగ్గడం లేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలుల తీవ్రత మొదలవుతుంది. దీంతో ప్రజలు చలిమంటలు కాచుకుంటున్నారు.

పిల్లల కోసం కొండలను కరిగించాడు

రెండేండ్లపాటు కష్టపడి 8 కిలోమీటర్ల రోడ్డు వేశాడు

ఒడిశాలో ఓ గిరిజనుడి కృషిని గుర్తించిన ప్రభుత్వం



పుల్‌బని(ఒడిశా), జనవరి 10: ఒడిశాలో ఓ వ్యక్తి తన పిల్లలను బడికి పంపడానికి కొండలను కరిగిస్తున్నాడు. కంధమాల్ జిల్లాలో చుట్టూ కొండల మధ్య ఉన్న తన గ్రామం గుంసాహీకి రోడ్డు సదుపాయం లేకపోవడంతో తానే నడుం బిగించాడు. గిరిజనుడైన జలంధర్ నాయక్ 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుల్‌బని పట్టణానికి రెండేండ్లుగా రోజుకు 8 గంటలు కష్టపడి 8కిలోమీటర్ల రోడ్డు వేశాడు. ఇతడి గురించి ఓ పత్రిక కథనం ద్వారా తెలుసుకున్న జిల్లా యంత్రాంగం ఆయనను సత్కరించాలని నిర్ణయించింది. అతడు పని చేసిన కాలానికి ఉపాధి హామీ పథకం కింద డబ్బులు చెల్లించనున్నామని తెలిపింది. రోడ్డు లేకపోవడం వల్ల మిగిలిన గ్రామస్థులందరూ ఊరు వదిలివెళ్లిపోయారు. తాను మాత్రం పిల్లలను స్కూల్‌కు పంపేందుకు సుత్తే, ఉలి, గడ్డపార పట్టుకొని రోడ్డు వేయడం ప్రారంభించానని 45 ఏండ్ల జలంధర్ తెలిపారు. మిగిలిన రోడ్డును ప్రభుత్వమే వేస్తుందని కలెక్టర్ చెప్పారని పేర్కొన్నారు. త్వరలో కంధమహల్ ఉత్సవంలో జలంధర్‌ను సత్కరిస్తామని కలెక్టర్ బృందా చెప్పారు.